జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 15, ఫిబ్రవరి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం




మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఉండవల్లి నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.

షి.. గప్‌చుప్

# ఎర్రగొండపాలెం కేసు ఏమాయె?


- ఎన్నికల సమయంలో బాబుపై ఆదిమూలపు అనుచరుల రాళ్ల దాడి
- ఎన్‌ఎస్‌జీ కమాండర్ తలకు తీవ్ర గాయం
- దాడికి గురై ఆసుపత్రిలోనే మరణించిన టీడీపీ దళిత కార్యకర్త
- మృతుడి కుటుంబానికి 10 లక్షలు ఇచ్చిన చంద్రబాబు
- ఇప్పటికీ అతీగతీలేని ఎర్రగొండపాలెం దాడి కేసు
- ప్రభుత్వం- పోలీసులపై విరుచుకుపడుతున్న టీడీపీ సోషల్‌మీడియా సైనికులు
- పోలీసులు నిద్రపోతున్నారా అంటూ విరుచుకుపడుతున్న పార్టీ శ్రేణులు
- మంత్రి స్వామి, గొట్టిపాటి రవి, ఇన్చార్జి మంత్రి ఆనంకు పట్టదా?
- నియోజకవర్గ ఇన్చార్జి ఎరిక్షన్‌బాబుకు పెత్తనం తప్ప బాధ్యత పట్టదా?











(మార్తి సుబ్రహ్మణ్యం)

అది ఎన్నికల ప్రచార సమయం. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఉమ్మడి ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. ఆ సమయంలో అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ అనుచరులు విధ్వంసకులు అవతారమెత్తారు. చేతిలో రాళ్లు తీసుకుని చంద్రబాబుపై దాడి చేశారు. దానిని ఎన్‌ఎస్‌జీ కమాండర్ ఒకరు అడ్డుకున్నారు. ఫలితంగా అతని తలకు తీవ్ర గాయమయింది.

ఆ దాడిలో తీవ్రంగా గాయాలపాలయి ఆసుపత్రిలో చేరిన టీడీపీ కార్యకర్త దళిత కార్యకర్త చేదూరి రాజయ్య, కొద్దిరోజుల తర్వాత మృత్యువుతో పోరాడి అలసిపోయాడు. ఆయన మరణంతో ఖిన్నుడైన చంద్రబాబు, ఆ కుటుంబానికి 10 లక్షల సాయం చేశారు. ఈ ఘటన జరిగింది 2023 ఏప్రిల్ 21న.

సీన్ కట్ చేస్తే.. కూటమి అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటిపోయింది. ఆ జిల్లాకు స్వామి మంత్రి అయ్యారు. ఉమ్మడి జిల్లాకు మరో మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా మంత్రి అయ్యారు. ఆ జిల్లాకు ఆనం రామనారాయణరెడ్డి ఇన్చార్జి మంత్రి అయ్యారు. ఎన్నికల్లో ఓడినా ఎరిక్షన్‌బాబు నియోజకవర్గ ఇన్చార్జిగా పెత్తనమంతా తానే చేస్తున్నారు. కానీ పార్టీకోసం చనిపోయిన దళిత కార్యకర్త రాజయ్య కేసును.. అంతా కలసి 'విజయ వంతంగా మర్చిపోయారు'. ఇదేఇప్పుడు సోషల్ మీడియాలో పసుపు సైనికుల ఆగ్రహ జ్వాల. ఒక్క ఎర్రగొండపాలెంలోనే కాదు. ఏపీలో చాలా నియోజకవర్గాల్లో టీడీపీ కార్యకర్తలది ఇదే రోదన-వేదన. అయినా పట్టించుకునే దిక్కులేదు. కార్యకర్త త్యాగాల పునాదులపై పదవులు అనుభవిస్తున్న వారికి ఎన్నికల ముందు ఎదుర్కొన్న చేదు అనుభవాలు గుర్తు రావడం లేదు. ఈ విషయంలో యధారాజా తథా ప్రజ అన్నట్లుంది ఎమ్మెల్యే, మంత్రుల వ్యవహారం.

మహానాడు ఫోకస్

అయితే, అధిష్ఠానం మర్చిపోయినా.. ఎమ్మెల్యేలు, మంత్రులు మర్చిపోయినా, సోషల్‌మీడియా సైనికులు మాత్రం.. శూలాల్లాంటి మాటలతో, కొరడా ఝుళిపిస్తున్నారు. ఎందుకంటే వారికి పోయేదేమీ లేదు. అందుకే ఎర్రగొండపాలెంలో బాబుపై రాళ్ల దాడిచేసిన పోలీసులు నిద్రపోతున్నారా? మంత్రులు స్వామి, గొట్టిపాటి, ఆనం ఎక్కడున్నారు అంటూ ధైర్యంగా నిలదీస్తున్నారు.

ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో నాటి విపక్ష నేత, నేటి సీఎం చంద్రబాబునాయుడుపై.. ఎన్నికల సమయంలో జరిగిన రాళ్ల దాడిని పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. ఫలితంగా ఆ కేసు అటకెక్కి నట్లేనన్న భావన కార్యకర్తల్లో

మిగతా.. 2లో



ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఉడుముల శ్రీనివాస్ రెడ్డి(వృత్తంలో)



దాడికి సంబంధించిన వ్యూహాన్ని వివరిస్తున్న ఐప్యాక్ ఉద్యోగి



# స్వచ్ఛాంధ్ర మిషన్‌లో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి

- పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, పని ప్రాంతాల్లో పరిశుభ్రతను ఒక బాధ్యతగా తీసుకోవాలి
- స్వచ్ఛాంధ్ర అనేది ఒక వ్యక్తికో, ఒక సంస్థకో చెందిన కార్యక్రమం కాదు
- పిసిబి గాలి నాణ్యతను పరిశీలించాలి... నెట్ జీరో కార్యక్రమాలు అమలు చేయాలి
- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష
- 14 ఇండికేటర్స్ ఆధారంగా జిల్లాలకు ర్యాంకులు... మొదటి స్థానంలో ఎన్టీఆర్ జిల్లా... చివరి స్థానంలో అల్లూరి జిల్లా


**అమరావతి:** స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. లక్ష్యాలు పెట్టుకోవడమే కాదని. వాటిని ఖచ్చితంగా చేరుకునేలా ప్రణాళికలు అమలు చేయాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో పరిశుభ్రత పెంచేందుకు... అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పేందుకు అమలు చేస్తున్న కార్యచరణపై సీఎం సమీక్ష చేశారు.

ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తోంది. ప్రతి నెల ఒక థీమ్ తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జనవరి నెలలో న్యూ ఇయర్ క్లీన్ స్టార్ట్ అనే అంశాన్ని థీమ్ గా తీసుకోగా... ఈ నెలలో సోర్స్ రీ సోర్స్ అనే అంశాన్ని థీమ్ గా తీసుకున్నారు. మన మూలాలు - మన బలాలు తెలుసుకునేలా, రాష్ట్రంలోని వనరులను ఎలా సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలి అనే దానిపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు.

జీవన ప్రమాణాలు పెంచడం, పర్యాటక రంగానికి ప్రోత్సాహం, పెట్టుబడులు ఆకట్టుకోవడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం, నెట్ జీరోకు రాష్ట్రంలో పర్యావరణాన్ని తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని సిఎం సూచించారు. సంపూర్ణ స్వచ్ఛత వైపు అడుగులు వేయడం, పారిశుధ్యానికి ప్రాధాన్యత, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజారోగ్యం, ఇంకా కేంద్రం నిర్దేశించే లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర అంటే స్వచ్ఛమైన మనుషులు, స్వచ్ఛమైన మనసులు, స్వచ్ఛమైన పరిసరాలు, స్వచ్ఛమైన ఇళ్లు, కాలనీలు, ఊళ్లు అని అంతా గుర్తించాలని సిఎం అన్నారు. ఇళ్లతో పాటు... బహిరంగ ప్రదేశాలను, స్కూళ్లు, కాలేజ్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రార్థనా మందిరాలు, పరిశ్రమలు కూడా పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు.

దీనికోసం ప్రతి వ్యక్తి, ప్రతి ఉద్యోగి, ప్రతి సంస్థ, ప్రతి వ్యవస్థ పనిచేయాలన్నారు. ఇది ఏ ఒక్క శాఖకో... ఒక్క అధికారికో సంబంధించిన కార్యక్రమంగా చూడవద్దని.. పరిశుభ్రత, పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో పాఠశాల విద్యార్థి నుంచి నాయకుల వరకు బాధ్యత తీసుకోలని సిఎం పిలుపునిచ్చారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం ఆ కార్యాలయంలో ఉండే ఉద్యోగులు అంతా కలిసి పరిశుభ్రత,

మిగతా.. 2లో



బడ్జెట్ కేటాయింపులతో ఫోరెన్సిక్‌కు ఊతం..ఫింగర్ ప్రింట్‌కు ప్రాణం

03



రేవంత్‌ది లేకితనం.. లేకిమాటలు!

03



## రాకేష్ చౌదరి కుటుంబానికి అండగా ఉంటాం: లోకేష్

- మంత్రిని కలిసిన కుటుంబ సభ్యులు


**అమరావతి:** ఏనుగుల దాడిలో మృతి చెందిన తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం, కందులవారి పల్లె ఉపసర్పంచ్ రాకేష్ చౌదరి కుటుంబ సభ్యులు శుక్రవారం ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేష్ ను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా ఉండే రాకేష్ చౌదరి మృతిచెందడం నన్ను కలచి వేసింది. ఆయన మృతి పార్టీకి తీరని లోటు. ఏనుగుల దాడిచేయడంతో ఆయన మరణించడం దిగ్భ్రాంతికి గురిచేసింది. రాకేష్ చౌదరి పార్టీ పటిష్ఠత కోసం ఎంతో కృషి చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు. మీకు అన్నివిధాల అండగా ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా రాకేష్ కుమార్తెని ముద్దాడిన లోకేష్... కుటుంబ నేపథ్యాన్ని వాకబు చేశారు.

## వల్లభనేని వంశీకి 14 రోజుల రిమాండ్



**విజయవాడ, మహానాడు:** గన్నవరం వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి విజయవాడ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఆయనతో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న లక్ష్మీపతి, కృష్ణప్రసాద్‌కు కూడా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. వంశీని హైదరాబాద్‌లో అరెస్టు చేసిన పోలీసులు గురువారం రాత్రి విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. ప్రభుత్వం తరఫున వీరగంధం రాజేంద్ర ప్రసాద్, వంశీ తరఫున పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. రాత్రి 11 నుంచి అర్ధరాత్రి 1.45 వరకు ఇరుపక్షాల వాదనలు కొనసాగాయి. ఈ వాదనలు కొలిక్కి రాకపోవడంతో న్యాయమూర్తి అదనంగా మరో అరగంటపాటు

మిగతా.. 2లో



## బీసీ విద్యార్థుల డైట్ బకాయిలు చెల్లించండి

- నసనకోట, ఆత్మకూరు బీసీ సంక్షేమ బాలికల పాఠశాలలు రెసిడెన్షియల్ కాలేజీలుగా అప్‌గ్రేడ్
- సబ్ కమిటీ నివేదిక రాగానే బీసీ రక్షణ చట్టం
- అవసరమైన మేర మరిన్ని దోభీఘాట్ల నిర్మాణం
- బీసీ సంక్షేమ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి:** బీసీ విద్యార్థుల కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలతో స్పష్టమైన మార్పులు రావాలని, ప్రభుత్వం చేసే ఖర్చుకు జవాబుదారీతనం కనిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సచివాలయంలో శుక్రవారం బీసీ సంక్షేమ శాఖపై సీఎం సమీక్ష చేశారు.

రాష్ట్రంలోని 660 గవర్నమెంట్ హాస్టల్స్‌లో రూ.13.10 కోట్లతో చేపట్టిన మరమ్మతులు మరో ఆరు వారాల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు గత ప్రభుత్వం ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, కిచెన్ ఐటెమ్స్ అందించలేదని, రూ.18 కోట్లతో వాటి పంపిణీకి చర్యలు తీసుకున్నామని అధికారులు వివరించగా, ఈ ప్రక్రియ కూడా మార్చి మూడవ వారం నాటికి పూర్తవ్వాలన్నారు.

### బకాయిల విడుదలకు గ్రీన్ సిగ్నల్

పెండింగ్ ట్యూటర్స్ హానరోరియంకు సంబంధించి 485 హాస్టళ్లలో 2024 మార్చి వరకు గత ప్రభుత్వం పెట్టిన రూ.2.02 కోట్ల బకాయిలు, ఈ ఏడాది ఫిబ్రవరి వరకు చెల్లించాల్సి ఉన్న రూ.2.33 కోట్ల

మిగతా.. 2లో

# మోదీ బీసీ కాదు.. ఆయన లీగల్లీ కన్వర్టెడ్ బీసీ

- ఆయన పుట్టుకతోనే ఉన్నత కులం
- కేసీఆర్.. ప్రజలను దోచుకున్న నీ కొడుకును, అల్లుడిని, బిడ్డను కొట్టు
- మళ్లీ బయటకు వచ్చి చేసేదేముంది?
- సోషల్ మీడియాతో ఏం చేస్తారు?
- దండం పెట్టి దండాలు పెడితే పదవులు రావు
- ఇచ్చిన మాట ప్రకారం సబ్ కమిటీ ఏర్పాటు చేసి కులగణన ప్రక్రియ పూర్తి
- గల్లీలో పేదల కోసం పనిచేసే వారినే పదవులు
- యువజన కాంగ్రెస్ నేతల ప్రమాణస్వీకార కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




**హైదరాబాద్:** యూత్ కాంగ్రెస్ లో పనిచేసిన చాలామంది జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి రాజకీయాల్లో రాణించారు. రాజకీయాల్లో యువజన కాంగ్రెస్ మొదటి మెట్టు. ప్రజల వద్దకు వెళ్లి పేదల కోసం పనిచేస్తేనే రాజకీయాల్లో రాణిస్తారు. కాంగ్రెస్ కార్యకర్తలు భుజాలు కాయలు కాసేలా జెండాను మోసి రాష్ట్రంలో కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకొచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేసుకుంటూ

మిగతా.. 2లో



## తెలంగాణ కాంగ్రెస్ ఇన్చార్జిగా మీనాక్షి నటరాజన్

**న్యూఢిల్లీ,మహానాడు:** తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ఇన్చార్జిగా మీనాక్షి నటరాజన్‌ను నియమిస్తూ ఏఐసిసి ఉత్తర్వులు జారీ చేసింది. దీపాదాస్ మున్షీ స్థానంలో ఆమె రాష్ట్ర పార్టీ ఇన్చార్జి బాధ్యతలు నిర్వహిస్తారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.




ఇండియా- అమెరికా కలిసి పని చేయాలి

03



మోదీకి రేవంత్ రెడ్డి సర్టిఫికెట్స్ అవసరం లేదు

04



తెలంగాణలో ప్రతి వ్యక్తి తలసరి ఆదాయం 3.56 లక్షలు

03

జనం గుండె చప్పుడు
# మహానాడు
2
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 15, ఫిబ్రవరి 2025 ‖



# స్వచ్ఛాంధ్ర మిషన్‌లో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి

మొదటి పేజీ తరువాయి..
ఆహ్లాదకర వాతావరణం ఉండేలా కృషి చేయాలన్నారు.

బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడంలో బాధ్యత లేకుండా వ్యవహరించాలని అన్నారు. రోడ్లపై చెత్త వేసి, చెట్లు నరికి వేసి, అంతా క్లీన్ గా ఉండాలి, పచ్చదనం ఉండాలి అని స్లోగన్స్ ఇస్తే కుదరదని అన్నారు. పౌరులు కూడా బాధ్యత వహిస్తే స్వచ్ఛాంధ్ర కల సాకారం చేసుకోవచ్చని సీఎం సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా అంతా కృషి చేయాలి అన్నారు. గాలిలో నాణ్యతను పరిశీలించి సమస్య ఉన్న ప్రాంతాల్లో తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పెరుగుతున్న సమయంలోనే గుర్తించి ఇప్పటి నుంచే అక్కడ పరిష్కారం దిశగా పనిచేయాలని సూచించారు. ఈ విషయంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వంటి శాఖల అధికారులు ఫోకస్ పెట్టాలని సూచించారు.

### జిల్లాలకు ర్యాంకులు

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన కార్యక్రమాలపై అధికారులు ప్రోగ్రస్ ను సీఎంకు వివరించారు. మొత్తం 14 ఇండికేటర్స్ లో పెట్టుకున్న లక్ష్యాలను ముఖ్యమంత్రి ముందు ఉంచారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్స్, డోర్ టు డోర్ కలక్షన్, సాలిడ్ వేస్ట్ సెగ్రిగేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, కమ్యూనిటీ సోక్ పిట్స్, క్లీన్ విలేజ్, ఒడిఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్ వంటి అంశాల్లో ఆయా జిల్లాల్లో ప్రగతిపై సిఎంకు వివరించారు.

ఈ 14 ఇండికేటర్స్ ఆధారంగా జిల్లాకు ర్యాంకులు ఇచ్చారు. పట్టాణాభివృద్ధి శాఖ పరిధిలో డోర్ టు డోర్ కలెక్షన్ కు 15 పాయింట్లు, సోర్స్ సెగ్రిగేషన్ కు 35 పాయింట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కు 20 పాయింట్లు, లెగసీ వేస్ట్ క్లియరెన్స్ కు 10 పాయింట్లు, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కు 20 పాయింట్లు ఇచ్చారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి 15 పాయింట్లు, పబ్లిక్ టాయిలెట్స్ కు 10 పాయింట్లు, కమ్యూనిటీ సోక్ పిట్స్ కు 10 పాయింట్లు, 100 శాతం డోర్ టు డోర్ చెత్త కలెక్షన్ కు 10 పాయింట్లు, ఓడిఎఫ్ ప్లస్ మోడల్ కు 20 పాయింట్లు చొప్పున ఇచ్చారు. ఇలా మొత్తం 200 పాయింట్ల ఆధారంగా జిల్లాల ప్రోగ్రస్ పై ర్యాంకులు ఇచ్చారు.

### మొదటి స్థానంలో ఎన్టీఆర్ జిల్లా

మొత్తం 200 పాయింట్లకు గాను 129 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. 127 పాయింట్లతో విశాఖ రెండో స్థానంలో, 125తో ఈస్ట్ గోదావరి 3వ స్థానం, 122తో అనంతపురం జిల్లా 4వ స్థానం, 120 పాయింట్లతో అన్నమయ్య 5వ స్థానం, శ్రీకాకుళం 6వ స్థానంలో ఉన్నాయి. 118 పాయింట్లతో కడప 7వ స్థానం, 117 పాయింట్లతో గుంటూరు 8వ స్థానం, 115 పాయింట్లతో బాపట్ల 9వ స్థానం, 115 పాయింట్లతో నెల్లూరు 10వ స్థానం, 115 పాయింట్లతో వెస్ట్ గోదావరి 11వ స్థానం, 113 పాయింట్లతో అనకాపల్లి 12వ స్థానం, 111 పాయింట్లతో తిరుపతి 13వ స్థానంలో, 109 పాయింట్లతో కాకినాడ 14వ స్థానంలో ఉన్నాయి. 108 పాయింట్లతో ఏలూరు 15వ స్థానం, 108 పాయింట్లతో కృష్ణ 16వ స్థానం, 105 పాయింట్లతో కోనసీమ 17వ స్థానం, 105 పాయింట్లతో మన్యం పాడేరు 18వ స్థానం, 105 పాయింట్లతో సత్యసాయి 19వ స్థానం, 103 పాయింట్లతో పల్నాడు 20వ స్థానం, 99 పాయింట్లతో కర్నూలు 21వ స్థానం, 99 పాయింట్లతో ప్రకాశం 22వ స్థానం, 94 పాయింట్లతో నంద్యాల 23వ స్థానం, 93 పాయింట్లతో విజయనగరం 24వ స్థానం, 88 పాయింట్లతో చిత్తూరు 25వ స్థానం, 81 పాయింట్లతో అల్లూరి సీతారామరాజు 26వ స్థానంలో ఉన్నాయి.

# బీసీ విద్యార్థుల డైట్ బకాయిలు చెల్లించండి

మొదటి పేజీ తరువాయి..
బకాయిలు మొత్తం కలిపి రూ.4.35 కోట్లు చెల్లించాల్సి ఉందని అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా, వెంటనే చెల్లించేందుకు అనుమతి ఇచ్చారు. డైట్ ఛార్జెస్‌కు సంబంధించి రూ.185.27 కోట్లు పెండింగులో ఉన్నాయని అధికారులు వివరించగా ప్రస్తుతం రూ.110.52 కోట్ల చెల్లింపునకు సీఎం అంగీకారం తెలిపారు.

అదే విధంగా కాస్మోటిక్ బిల్లులు రూ.29 కోట్లు చెల్లించాలని ఆదేశించారు. అలాగే హాస్టళ్ల విద్యుత్ సరఫరాకు సంబంధించిన పెండింగ్ బిల్లులు కూడా వెంటనే చెల్లించాలని సూచించారు. సత్యసాయి జిల్లాలోని నసనకోట, ఆత్మకూరు బీసీ సంక్షేమ బాలికల పాఠశాలలను రెసిడెన్షియల్ బీసీ గర్ల్స్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. కుప్పంలోనూ బీసీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

### దామాషా ప్రకారం కార్పొరేషన్లకు నిధులు

బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కేబినెట్లో కూడా ఆమోదం తెలిపామని, ఈ మేరకు అవసరమైతే న్యాయపోరాటం చేయాల్సి ఉందని తెలిపారు. అలాగే ప్రతి కార్పొరేషన్‌కు దామాషా ప్రకారం నిధులు కేటాయించాలన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, దీనిపై ఇప్పటికే విధివిధానాలు రూపొందించామని తెలిపారు.

రజకులకు మేలు చేకూరేలా రాష్ట్రంలో 2014-19 మధ్య నిర్మించిన దోబీ ఘాట్ల మరమ్మతులు, అవసరమైన చోట కొత్తవి నిర్మించడంపై దృష్టి పెట్టాలని సీఎం అన్నారు. రానున్న బడ్జెట్ లో కేటాయించే నిధులతో రాష్ట్రంలో బీసీ భవనాలు పూర్తి చేయాలని ఆదేశించారు. 2014 నుంచి బీసీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిపొందిన వారి సమాచారాన్ని సేకరించాలని, వృత్తి ప్రామాణికంగా రుణాలు తీసుకున్న వారు ప్రస్తుతం ఎంతమంది కొనసాగిస్తున్నారో ఆడిట్ చేయాలని ఆదేశించారు.

### బీసీలను హత్య చేసిన వారికి శిక్ష పడాలి

వైసీపీ హయాంలో బీసీలను ఊచకోత కోశారని, వారి హత్యలపైనా విచారణ వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశం మేనిఫెస్టోలో కూడా పొందుపరిచామని, అవసరమైతే ప్రత్యేక కమిషన్ ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. బీసీ రక్షణ చట్టాన్ని సబ్ కమిటీ నివేదిక రాగానే అమల్లోకి తెస్తామన్నారు. రాష్ట్రంలో 2014-19 మధ్య నాటి టీడీపీ ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లో 13 కాపు భవనాలను మంజూరు చేసింది.అందులో 5 భవనాల నిర్మాణాలను ప్రారంభించగా, గత ప్రభుత్వం నిలిపేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్మాణాలను పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేసింది. అవి త్వరలోనే వినియోగంలోకి రానున్నాయని అధికారులు వివరించారు. నిర్మాణంలో ఉన్న 42 కాపు కమ్యూనిటీ హాళ్లు కూడా వేగంగా పూర్తి చేయాలని చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ సమీక్షలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, అధికారులు పాల్గొన్నారు.

# వల్లభనేని వంశీకి 14 రోజుల రిమాండ్

మొదటి పేజీ తరువాయి..
వాదనలు విన్నారు. అనంతరం ముగ్గురికీ 14 రోజుల చొప్పున రిమాండ్ విధించారు.

మరోవైపు వంశీ రిమాండ్ రిపోర్టులో పోలీసులు కీలక అంశాలు వెల్లడించారు. సత్యవర్ధన్‌ను బెదిరించడంలో వంశీ కీలక పాత్ర పోషించినట్టు పేర్కొన్నారు. మరణ భయంతోనే వంశీ అనుచరులు చెప్పినట్టు సత్యవర్ధన్ చేశాడని పోలీసులు గుర్తించారు. "వంశీకి నేర చరిత్ర ఉంది. అతనిపై ఇప్పటి వరకు 16 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా సీపీ ఆదేశాలతో నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. విశాఖ పోలీసుల సమాచారంతో విజయవాడ తీసుకొచ్చాం. ఈ కేసులో ఏ9గా ఉన్న రామును కలవాలని వంశీ బలవంతం చేశారు. సత్యవర్ధన్ ఫిర్యాదును వెనక్కి తీసుకోవడంలో ఏ7, ఏ8 కీలకంగా వ్యవహరించారు" అని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

టీడీపీ కార్యాలయంలో పనిచేసే సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి దాడి చేశారన్న అభియోగంపై గురువారం ఉదయం వంశీని ఏపీ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వంశీతో పాటు మరికొందరిపై అట్రాసిటీ యాక్ట్ ప్రకారం నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇదే కేసులో నిందితులుగా ఉన్న ఎలిమినేని శివరామకృష్ణ ప్రసాద్, నిమ్మ లక్ష్మీపతిని విజయవాడలో అరెస్టు చేశారు. మరోవైపు విజయవాడ పడమట పోలీస్ స్టేషన్‌లో సత్యవర్ధన్ వాగ్మూలం నమోదు చేశారు. వంశీని విజయవాడ తీసుకొచ్చి కృష్ణ లంక పోలీస్‌స్టేషన్‌లో దాదాపు ఎనిమిది గంటల పాటు పోలీసులు ప్రశ్నించారు. అనంతరం వంశీతో పాటు మిగతా నిందితులకు విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు.

# మోదీ బీసీ కాదు.. ఆయన లీగల్లీ కన్వర్టెడ్ బీసీ

మొదటి పేజీ తరువాయి..
ముందుకు వెళుతున్నాం.

ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత యూత్ కాంగ్రెస్ పై ఉంది. పార్టీ అనుబంధ విభాగాల్లో బాధ్యత తీసుకున్న వారికి ప్రభుత్వంలో స్థానం కలిపిస్తామని ఆనాడు చెప్పాం. 37 కార్పొరేషన్ చైర్మన్ పదవులను అనుబంధ విభాగాలకు అందించాం. కష్టపడితే తప్పకుండా ఫలితం ఉంటుంది. దండం పెట్టి దండాలు పెడితే పదవులు రావు. అలాంటి వారు పదవుల సంగతి మరచిపోండి. ఢిల్లీ నుంచి పైరవీలతో కాదు.. గల్లీలో పేదల కోసం పనిచేసే వారినే పదవులు వరిస్తాయి. డబ్బులతో ఎన్నికల్లో గెలిచే రోజులు పోయాయి. నిత్యం ప్రజల్లో ఉండే వారినే గెలుపు వరిస్తుంది.

గట్టిగా కొడతానని అంటున్న కేసీఆర్‌కు ఈవేదికగా చెబుతున్నా.. గట్టిగా కొట్టాలంటే దుర్మార్గంగా ప్రజలను దోచుకున్న నీ కొడుకును, అల్లుడిని, బిడ్డను కొట్టు. ఇగ ఆయన బయటకు వస్తానని చెప్పు కుంటుండు.. బయటకు వచ్చి ఏం చేస్తాడు? నువ్వు కుర్చీలో ఉన్నప్పుడే నిన్ను బండకేసి కొట్టి ఓడగొట్టారు. మళ్లీ బయటకు వచ్చి చేసేదేముంది?





మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసింది. రైతులకు రుణమాఫీ చేశాం.. నీవు ఎగ్గొట్టిన రైతు బంధు మేం వేశాం.దేశంలో కులగణన చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. మాదిగ ఉపకులాల వర్గీకరణను అమలు కోసం నిర్ణయం తీసుకున్న రాష్ట్రం తెలంగాణ. మోదీ మందకృష్ణను ఎన్నోసార్లు కౌగిలించుకున్నారు. అది ధృతరాష్ట్ర కౌగిలిగానే మిగిలింది తప్ప వర్గీకరణ అమలు చేయలేదు.

సోషల్ మీడియాలో ప్రభుత్వంపై బీఆరెస్ దుష్ప్రచారం చేస్తోంది. చానెళ్లు, పేపర్లు ఉన్నప్పుడే కాంగ్రెస్ ను ఏమీ చేయలేకపోయారు. సోషల్ మీడియాతో ఏం చేస్తారు? యువజన కాంగ్రెస్ అనుకుంటే ఒక్కసారి కాదు. నాలుగుసార్లు గెలిపిస్తారు. మీతో పాటు నేను కూడా సిద్ధం. తెలంగాణకు చిల్లిగవ్వ ఇవ్వని మోదీపై పోరాటానికి సమయం ఇవ్వాలని సంయమనం పాటిస్తున్నాం.

త్వరలోనే అన్ని సమస్యలపై కార్యాచరణ రూపొందిస్తాం. ప్రజా సమస్యలపై కేంద్రంపై చేసే పోరాటంలో మీరు ముందుభాగాన నిలవాలి.

అత్యంత ప్రధానమైన రెండు కీలక అంశాలపై కాంగ్రెస్ సాహసోపేత నిర్ణయాలు తీసుకుంది. కులగణనపై లేని అపోహలను సృష్టించి తప్పుల తడక అని చెప్పాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. నిజం నిప్పులాంటి అది వారినే దహిస్తుంది తప్ప ప్రజలకు నష్టం కలిగించదు.

మహాత్ముడి వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని దేశ సమగ్రత కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారు. సోనియా గాంధీ మాట ఇస్తే శిలా శాసనం అని ఆనాడు తెలంగాణ ఏర్పాటుచేసి నిరూపించుకున్నారు. కులగణన చేసి బలహీన వర్గాల జనాభా లెక్కగట్టి వారికి రిజర్వేషన్లు కల్పిస్తామని రాహుల్ గాంధీ మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సబ్ కమిటీ ఏర్పాటు చేసి కులగణన ప్రక్రియ పూర్తి చేసుకున్నాం.

సాంకేతికంగా, న్యాయ పరంగా కులగణనపై నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకెళ్లాం. 150 ఇండ్లను ఒక యూనిట్‌గా చేసి ఎన్యుమరేటర్లను నియమించి కులగణన నిర్వహించాం. కులగణన ప్రకారం 56.33 శాతం బలహీనవర్గాల లెక్క తేలింది. చెట్ల మీద విస్తర్లు కట్టినట్టు కెసిఆర్ ఆనాడు సమగ్ర కుటుంబ సర్వేలో కాకిలెక్కలు చూపించారు. కెసిఆర్ లెక్కలు నిజమైతే 52 గా ఉన్న మాదిగ ఉపకులాలు కెసిఆర్ లెక్కపెడితే 82 ఎట్ల అయినయి? వాళ్లు పెద్ద గ్యాంబ్లర్స్ ఆ గ్యాంబ్లర్స్‌కు ఇష్టం లేకనే సర్వేలో పాల్గొనలేదు.

ప్రజలు అడిగి కడుగుతారని ఈ లెక్కలను గందరగోళం చేసి గంగలో కలపాలని చూస్తున్నారు. ఈ లెక్క నాకోసం చేయలేదు.. క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ నాయకుడిగా మా నాయకుడి ఆదేశాలను పాటించా. త్యాగానికి సిద్ధమయ్యే ఈ లెక్కలను పక్కాగా చేయించాం. మా నాయకుడు ఇచ్చిన మాటకు కట్టుబడి కులగణన నిర్వహించాం.

గణనలో ఒక్క తప్పు లేదు వాళ్లు రాసి సంతకం పెట్టిన లెక్కనే మేం తీసుకున్నాం. జనజీవన స్రవంతిలో కలవని వారికి కూడా మళ్లీ అవకాశం ఇచ్చాం. ఇది మా నిబద్ధతకు నిదర్శనం. రాహుల్ గాంధీ మోదీ మెడలు వంచుతారనే కులగణనపై బీజేపీ కుట్రలు చేస్తోంది.

మోదీ బీసీ కాదు.. ఆయన లీగల్లీ కన్వర్టెడ్ బీసీ. ఆయన పుట్టుకతోనే ఉన్నత కులం.. 2001 లో ముఖ్యమంత్రి అయ్యాక ఆయన కులాన్ని బీసీల్లో చేర్చుకున్నారు. ఆయన బీసీ అయితే ఇన్నాళ్లు కులగణన ఎందుకు చేయలేదు.చిత్తశుద్ధి ఉంటే జనగణనలో కులగణనను పరిగణనలోకి తీసుకోవాలి. ఈ లెక్కలను తప్పు పడితే నష్టపోయేది బీసీలే. వర్గీకరణ కోసం జరిగిన పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు.

మేం ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేస్తే దాన్ని కూడా తప్పుపట్టాలని చూస్తున్నారు. అలాంటి వారి మాటలు నమ్మొద్దు. త్వరలోనే దీన్ని చట్టం చేయబోతున్నాం. కెసిఆర్, కేటీఆర్, హరీష్ ఇండ్లముందు మేలుకొలుపు డప్పు కొట్టండి.. వాళ్లను లైన్‌లో పెట్టి లెక్కగట్టండి. కులగణనలో నమోదు చేయించుకోకపోతే కెసిఆర్ కుటుంబాన్ని సామాజిక బహిష్కరణ చేయాలని తీర్మానం చేస్తున్నాం.

# ఎర్రగొండపాలెం కేసు ఏమాయె?

మొదటి పేజీ తరువాయి..
నెలకొంది. ఆ ఘటనకు కారకులు ఎవరో స్పష్టంగా తెలిసినా, సూత్రధారి ఎవరో తెలిసినప్పటికీ ప్రభుత్వం-పోలీసులు.. ఇప్పటివరకూ చర్యలు తీసుకోకపోవడంపై టీడీపీ కార్యకర్తలు, సోషల్‌మీడియా వేదికగా నిప్పులు కురిపిస్తున్నారు.

ఆ దాడికి అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ అని.. ఐప్యాక్ వ్యూహరచనతో జరిగిన దాడి అని టీడీపీ నేతలు అప్పుడే ఆరోపించారు. మంత్రి సురేష్‌కు దాడి వ్యూహం వివరిస్తున్న ఐప్యాక్ ఉద్యోగి ఫొటోతోపాటు.. దాడికి సారథ్యం వహించిన ఏఎంసీ మాజీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి ఫొటోలను కూడా మీడియా ప్రచురించింది. ఆ మేరకు టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే అప్పుడు వైసీపీ అధికారంలో ఉండటంతో పోలీసులు ఆ ఫిర్యాదును పట్టించుకోలేదు. బహుశా ఆధారాలు లేనందున మూసివేసినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదంటున్నారు.

అయితే విచిత్రంగా ఆ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి చంద్రశేఖర్ విజయం సాధించారు. అయినప్పటికీ, ఆయన చేతిలో ఓడిపోయిన ఎరిక్షన్‌బాబు మాత్రం నియోజకవర్గ ఇన్చార్జిగా, అన్నింటా తానై పెత్తనం చేస్తున్నారు. కానీ.. ఎన్నికల సమయంలో బాబుపై జరిగిన రాళ్ల దాడి కేసులో, ముద్దాయిలను అరెస్టు చేయించాలన్న స్పృహ ఏమాత్రం లేకుండా, సొంత పనుల్లో బిజీగా ఉన్నారన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి ప్రకాశం నుంచి డాక్టర్ డోలా బాల వీరాం జనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్ మంత్రులయ్యారు. కానీ వారిద్దరూ బాబుపై జరిగిన రాళ్లదాడిని మర్చి పోయారు. నిందితులను చెరబట్టిం దామన్న ధ్యాస లేకుండా, ఎవరి సొంత వ్యవహారాల్లో వారు మునిగి పోయారని తమ్ముళ్లు విరుచుకుపడుతున్నారు. అటు జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి అసలు ఈ వ్యవహారమే పట్టకుండా పోయిందంటున్నారు.

జిల్లా ఎస్పీని పిలిచి, బాబుపై రాళ్ల దాడి కేసు పురోగతి ఎంతవరకూ వచ్చింది? నిందితులపై చార్జిషీట్ వేశారా లేదా? అని ఆరా తీయడాన్ని మంత్రులంతా మర్చిపోవడంపై తమ్ముళ్ల కారాలు మిరియాలు నూరుతున్నారు.

"ఇలాంటి నిర్లక్ష్యవైఖరి వల్లే మేం స్థానికంగా వైసీపీ నేతల ముందు చేతకానివారిలా నిల్చుంటున్నాం. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే పల్నాడు లాంటి జిల్లాల్లో, ఇప్పటికీ మన పార్టీ వారిపై వైసీపీ నేతలు దాడులు చేస్తున్నారు. ఇది మన అసమర్థత. చేతకాని తనమే కదా? సీఎంపై రాళ్ల దాడి చేసిన వారిపై ఇప్పటివరకూ చర్యలు తీసుకోలేదంటే అది ఎవరికి సిగ్గుచేటు? ఈ పార్టీ ఎటుపోతోంది? ఎవరు ఎవరికి భయపడుతున్నారు? నాయకత్వమంటే ఎవరికీ లెక్కలేదని తేలిపోతుంది కదా? అసలు సెంట్రల్ ఆఫీసు నుంచి కూడా బాబుగారిపై రాళ్ల దాడి కేసు ఎందాకా వచ్చిందని అడిగే దిక్కే లేదు. మా నియోజకవర్గ ఇన్చార్జి ఎరిక్షన్ బాబు కూడా పట్టించుకోకపోతే.. చంద్రబాబు వచ్చి నా కేసు ఏమైందని పట్టించుకుంటారా ఏంటి?" అని ఎర్ర గొండపాలెం నియోజకవర్గానికి చెందిన ఓ సీనియర్ దళిత నేతల ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిజానికి ఇలాంటి వ్యవహారాలన్నీ స్థానిక ఎమ్మెల్యే, ఇన్చార్జి, జిల్లా మంత్రులు, జోనల్ ఇన్చార్జులు సమన్వయం చేసుకుని, తీసుకోవాల్సిన నిర్ణయాలని పార్టీ సీనియర్లు గుర్తు చేస్తున్నారు. 'ప్రతి ఒక్కటీ చంద్రబాబు, లోకేష్ చెప్పరు కదా? వాళ్లు అనేక పనుల్లో బిజీగా ఉంటారు. ఇలాంటి వాటిని పరిశీలించి సమన్వయం చేసుకోవలసింది జిల్లా, నియోజకవర్గ నాయకులు కదా? కానీ వాళ్లేమో కలెక్షన్ల బిజీలో పడ్డారు. పైగా బాబుగారు, లోకేష్ వేధింపులు మా నైజం కాదని చెప్పడం వీళ్లకు కలిసివస్తోంది. వాళ్లు జగన్ మాదిరిగా అనవసరంగా వేధించవద్దన్నారు తప్ప, దాడులు చేసిన వారిని వదిలి పెట్టమని అనలేదు. లీగల్‌గానే వారిపై యాక్షన్ తీసుకోమంటున్నారు కదా? అది కూడా ఎమ్మెల్యేలు, మంత్రులు ఎందుకు చేయర న్నదే కార్యకర్తల ఆగ్రహానికి అసలు కారణం" అని మాజీ మంత్రి ఒకరు విశ్లేషించారు.

# అన్ని వర్గాల శ్రేయస్సుకు దేవేందర్ గౌడ్ కృషి

**- కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి**

హైదరాబాద్: బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సుకు కృషి చేసిన వ్యక్తి టీడీపీ నాయకుడు దేవేందర్ గౌడ్ అని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ లోని జలవిహార్ లో 'విజయ తెలంగాణ' పుస్తక ఆవిష్కరణలో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాల పాత్రను దేవేందర్ గౌడ్ తెరపైకి తేవడంలో కీలకపాత్ర పోషించారన్నారు. టీడీపీలో అనేక పార్టీల్లో





చేరి వన్నె తెచ్చారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో సకలజనుల సమ్మె చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రపంచంలోనే ఇంతపెద్ద ఎత్తున శాంతి ఉద్యమం ఎక్కడా జరగలేదన్నారు.


ఈ ఉద్యమంలో దేవేందర్ గౌడ్ పాత్ర కూడా కీలక భూమిక పోషించిందన్నారు. కొమురం భీం, గొండు నాయకులు, అల్లూరి సీతరామరాజు పోరాటాలు అద్భుతమైనవని కీర్తించారు. బ్రిటిష్ వారి పాలనలో వీరు చేసిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోతాయని, తెలంగాణకు ఆయన సేవలు మరింత అవసరమని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు.

# రేవంత్ రెడ్డికి పోయేకాలం వచ్చింది

**మోదీని తిడితే ఏమైతుందో కెసిఆర్ కి తెలిసింది**

**త్వరలో రేవంత్ కి తెలుస్తుంది**

**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్**



హైదరాబాద్: భారతదేశంలో ఆసేతు హిమాచలం మోడీ గారిని విశ్వసించని ప్రేమించని వారు లేరు. పేదరికం నుండి వచ్చిన వాడిని.. పేదల బాధలు అన్నీ తెలుసు అందులో పి హెచ్ డి చేసాను అని ఆయన అనేక సార్లు చెప్పారు. అంబేద్కర్ రాజ్యాంగం అమలు చేస్తున్నవారు.

అప్పుడు కేసీఆర్ కూడా కళ్ళు నెత్తికి ఎక్కి మోడీ గీడీ అని మాట్లాడారు. ఇప్పుడు రేవంత్ డిల్లీకి పోయి మోడీని మా పెద్దన్న అంటాడు. కేంద్ర సాకారం కావాలి అంటారు. ఇక్కడికి వచ్చి ప్రగల్భాలు పలుకుతున్నారు.బీసీ కాదు అని మాట్లాడుతున్నాడు. రేవంత్ రెడ్డి కి పోయేకాలమా? మోడీ కులాలకు అతీతం.

భారత జాతి ఆత్మగౌరవం ప్రపంచ పటం మీద నిలబెడుతున్న వ్యక్తి.. అమెరికన్ ప్రెసిడెంట్ కుర్చీ వేసి కూర్చోబెడుతున్నారు.. రేవంత్ కూట్లో రాయి తీయలేనివాడు. ఉట్టికి ఎగరలేనమ్మ ఆకాశానికి ఎగిరినట్టు ఉంది. మోడీ మీద విమర్శలు సూర్యుని మీద ఉమ్మి వేసినట్టు ఉన్నాయి.

మోడీ కి స్వార్థం లేదు. దేశ ప్రజలే ఆయన కుటుంబం. ఆయన మీద విమర్శ చేస్తే ప్రజలు గతంలో వారికి చెప్పిన బుద్దే మీకు చెప్తారు. మోడీ తో గొక్కోవడం అంటే ధర్మంతో, ప్రజలతో గోకోవడమే. ఆ నిమిషానికి చప్పట్లు కొట్టొచ్చు కానీ తరువాత పర్యవసానాలు కేసీఆర్‌కి అర్థం అయ్యాయి.

మీకు కూడా అర్థం అవుతాయి. పెద్దలను గౌరవించడం నేర్చుకోమని రేవంత్ రెడ్డికి సలహా ఇస్తున్నా.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

03

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 15, ఫిబ్రవరి 2025



## అయ్యగారూ.. మీకు మేమున్నాం

### - సౌందర్‌రాజన్‌కు మందకృష్ణమాదిగ దన్ను



హైదరాబాద్: దాడికి గురైన చిలుకూరు బాలాజీ ప్రధానార్చకుడు సౌందర్‌రాజన్‌ను పరామర్శించి, ఆయనకు సంఘీభావం ప్రకటించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ. ఈ సందర్భంగా ఆయన సౌందర్‌రాజన్‌పై జరిగిన దాడి గురించి అడిగి తెలుసుకున్నారు. మీకు అండగా మేము ఉంటామని మంద కృష్ణ భరోసా ఇచ్చారు.

## రేవంత్‌ది లేకితనం.. లేకిమాటలు!

- రేవంత్ రెడ్డి బుద్ధి మాత్రం పెరగలేదు
- తెలంగాణ సమాజమంతా రేవంత్ రెడ్డిని ఛీ కొడుతున్నది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజం



హైదరాబాద్: ముఖ్యమంత్రి పీఠం దక్కినా.. రేవంత్ రెడ్డి బుద్ధి మాత్రం పెరగలేదు. పని చేతగాక.. పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నడు. తెలంగాణ సమాజంలో జీవించే హక్కు కేసీఆర్‌కు లేదని రేవంత్ అంటున్నడు. ఎవరికి సమాజంలో జీవించే హక్కులేదో ప్రజలను అడుగుదమా?

నీ నియోజక వర్గం కొడంగల్ లేకా నీ సొంతూరు కొండారెడ్డి పల్లిలో అడుగుదమా? రేవంత్ రెడ్డి నీకు వచ్చే దమ్ముందా? తెలంగాణ సమాజమంతా రేవంత్ రెడ్డిని ఛీ కొడుతున్నది. దుమ్మెత్తి పోస్తున్నది. ఎలుక తోలు తెచ్చి ఎన్నాళ్ళ ఉతికినా నలుపు నలుపే కానీ తెలుపు కాదు అనే సామెతను అక్షరాల చాటుకుని రేవంత్ రెడ్డి తన దిగజారుడుతనాన్ని మరోమారు ప్రదర్శించారు.


సీఎం పదవి లో ఉంటూ చిల్లర భాష మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి ని తెలంగాణ ప్రజలు ఛీ కొడుతున్నారు. రాహుల్ గాంధీ మీద నీకున్న కోపాన్ని కేసీఆర్ మీద చూపిస్తే ఎట్లా రేవంత్తు ఖ్యమంత్రిగా ఎవ్వరూ గుర్తించడం లేదని ఉనికి చాటుకోవడానికే కేసీఆర్ పై ప్రేలాపనలా? కేసీఆర్ ను తిడితే ఒక్క రోజు హెడ్ లైన్స్ లో ఉంటావేమో ? కానీ తెలంగాణ చరిత్ర గతిని మార్చిన కేసీఆర్ స్థానమే ప్రజల హృదయాల్లో పదిలం అని తెలుసుకో.

రేవంత్ రెడ్డి ఇదే భాషను కొనసాగించాలనుకుంటే ఆయన జనజీవన స్రవంతి లో ఉండడానికి అర్హుడు కాదు. తెలంగాణని ఉనికిపొందించిన కెసిఆర్ ను బహిష్కరిస్తావా? సూర్యుడి మీద ఉమ్మేస్తే ఏమవుతుందో తెలుసు కదా? మా బహిష్కరణ నీ వల్ల కాదు గాని, నీ నిష్క్రమణకు సమయం దగ్గర పడుతున్నది.

సామాజిక బహిష్కరణ చేయాల్సివస్తే ప్రజలను పట్టపగలు మోసం చేస్తున్న నిన్ను చేయాలి రేవంత్. నాడైనా నేడైనా తెలంగాణ ద్రోహుల భాషే రేవంత్ భాష .అందుకే తెలంగాణ తెచ్చిన కేసీఆర్ ను పెద్ద చిన్న అనే గౌరవం లేకుండా దుర్భాషలాడుతున్నారు. సీఎం లెక్క తన్ని ,చిల్లర మనస్తత్వాన్ని తెలంగాణ సమాజం ఇప్పటికే అర్థం చేసుకుంది. ప్రజాస్వామ్య పంథా లోనే ప్రజలు రేవంత్ కు దిమ్మదిరిగే సమాధానం ఇస్తరు. కులగణన పేరు మీద కుటిల రాజకీయం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

నీ సర్వే సరైంది కాదని, నీ పార్టీ నాయకులే తూర్పార పడుతున్నారు. నువ్వు కులగణన చేసేవా.. గాడిద గుడ్డు చేయలేదని నీ పార్టీ ఎమ్మెల్యేలే అంటున్నరు . సిగ్గులేకుండా నువ్వు మా గురించి మాట్లాడుతున్నావా. నువ్వు నిజంగా సత్తా ఉన్న నాయకుడు అయితే ముందు మీ పార్టీలో ఉన్న నాయకుల అందర్నీ ఒప్పించు. కుల సర్వేలో ఖచ్చితమైన గణాంకాలు వచ్చాయని చెప్పించు.

నీ కుల సర్వే ఉత్త ఎన్నికల గిమ్మిక్కే ఫెయిల్యూర్ మ్యాజిక్కే. ఒకవైపు నీ సర్వే కరెక్ట్ అంటావు మరోవైపు రీసర్వే అంటావు. మీ ధమాకు కరాబ్ అయింది అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటది? సీఎం పదవి స్థాయిని నీ చిల్లర మాటలతో దిగజార్చకు. ప్రశాంత తెలంగాణ లో ఫ్యాక్షన్ వాతావరణాన్ని సృష్టించే నీ ప్రయత్నాలు ఎప్పటికీ సఫలం కావు. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది. నీ నోరే నీ రాజకీయ జీవితానికి ఉరిగా మారబోతుంది.



## ఇండియా- అమెరికా కలిసి పని చేయాలి

- చైనాను ఎదుర్కొనే ప్లాన్ చెప్పిన ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాను చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ఖచ్చితంగా సమావేశం అవుతానని, అన్ని విషయాలు మాట్లాడతానని వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా విషయంలో తన వ్యూహాన్ని స్పష్టం చేశారు. చైనాతో స్నేహ పూర్వక సంబంధాలను కోరుకుంటున్నాననే తప్ప, గొడవలు కాదని ఖరాఖండీగా చెప్పారు. భవిష్యత్‌లో అన్ని ప్రధాన దేశాలు కలిసి పని చేస్తాయనే ఆశాభావాన్ని ట్రంప్ వ్యక్తం చేశారు. ప్రతీకారం కోసం ఒకరిపై ఒకరు డబ్బు ఖర్చు చేసుకునే బదులు, ఆ డబ్బును మంచి పనులు - ప్రజా ప్రయోజనాల కోసం ఖర్చు చేయాలని కూడా ట్రంప్ సూచించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటనలో భాగంగా, మోదీ కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. చైనాతో వాణిజ్యం, సుంకాల యుద్ధం గురించి అడిగిన ప్రశ్నలకు అమెరికా అధ్యక్షుడు బదులు ఇచ్చారు.

చైనాను ఎదుర్కోవడంలో భారత్-అమెరికా సంబంధాలను మీరు ఎలా చూస్తారని ANI డొనాల్డ్ ట్రంప్‌ను అడిగింది. దీనికి సమాధానంగా మాట్లాడిన ట్రంప్, "చైనాతో మా సంబంధాలు చాలా బాగుంటాయని నేను భావిస్తున్నాను. కోవిడ్-19కి ముందు, నాకు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తో చాలా మంచి సంబంధాలు ఉండేవి. ప్రపంచంలో చైనా చాలా ముఖ్యమైన దేశం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడంలో జిన్‌పింగ్ మాకు సహాయం చేయగలరని నేను భావిస్తున్నాను. చైనా, భారత దేశం, రష్యా, అమెరికా కలిసి పని చేయగలవని నేను ఆశిస్తున్నాను. ఇది చాలా ముఖ్యం కూడా" అని చెప్పారు.

### 'ప్రతీకారం కోసం అనవసరంగా డబ్బు ఖర్చు చేయడం ఎందుకు?' - ట్రంప్..

భారత ప్రధాని నరేంద్ర మోదీ కలిసి నిర్వహించిన ఉమ్మడి మీడియా సమావేశంలో ఇంకా చాలా విషయాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడారు. "నా మొదటి పదవీ కాలంలో అణ్వాయుధ నిరాయుధీకరణ ? గురించి రష్యా అధ్యక్షుడు పుతిన్ తో మాట్లాడాను. నా ప్రయత్నానికి సానుకూల స్పందన వచ్చింది. అదే విధంగా, నేను ఈ విషయంపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో కూడా మాట్లాడాను, ఆయన కూడా చాలా చక్కగా స్పందించారు. మేము (అమెరికా), దేశ రక్షణ కోసం 900 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నాము. చైనా కూడా 450 బిలియన్ డాలర్ల వరకు వెచ్చిస్తోంది. ఇంత డబ్బును ఒకరిపై మరొకరు ఖర్చు చేస్తున్నారు. ఈ డబ్బును మంచి ప్రయత్నాల కోసం ఎందుకు వినియోగించకూడదు..?. భవిష్యత్తులో ఇలాంటి మంచి జరుగుతుందని నేను మీకు హామీ ఇస్తున్నాను" అని వెల్లడించారు.

### ఇజ్రాయెల్ & హమాస్ మధ్య యుద్ధాన్ని ముగించడానికి నేను మాట్లాడతా: ట్రంప్

"నేను అధికారంలో ఉన్నప్పుడు, ఇజ్రాయెల్ - హమాస్ మధ్య యుద్ధం లేదు & రష్యా - ఉక్రెయిన్ మధ్య కూడా యుద్ధం లేదు. నేను తిరిగి అధికారం లోకి వచ్చేసరికి ప్రపంచం మొత్తం రగిలి పోతోంది. నేను ముందు ఈ మంటను చల్లార్చాలి. ఆ తరువాత, నేను రష్యా & చైనాలతో కూర్చుని మాట్లాడతాను. పరస్పర సంఘర్షణను ముగించడానికి అవసరమైన విషయాల గురించి ఖచ్చితంగా చర్చిస్తాను" అని డొనాల్డ్ ట్రంప్ చెప్పారు..





## బడ్జెట్ కేటాయింపులతో ఫోరెన్సిక్‌కు ఊతం..ఫింగర్ ప్రింట్‌కు ప్రాణం

- ఈసారి బడ్జెట్‌లో హోంశాఖకు ప్రత్యేక కేటాయింపులు
- అప్పా,ఆక్టోపస్, గ్రే హౌండ్స్ ఏర్పాటుకు నిధులివ్వాలని ప్రతిపాదన
- ఈగల్ వ్యవస్థ, జైళ్ల నిర్మాణం, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లకు ప్రాధాన్యత
- ఇన్వెస్టిగేషన్ ఛార్జీల అంచనాను పెంచాలని హోంమంత్రి ప్రతిపాదన
- కేంద్ర ప్రభుత్వ నిధులు విరివిగా రాబట్టి పోలీస్ శాఖను పటిష్టం చేస్తాం
- అన్ని ఆధారాలతోనే వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీ అరెస్ట్
- కూటమి నాయకులను అరెస్ట్ చేస్తే సక్రమం..వైసీపీ నేతలయితే అక్రమమా?
- గుర్రంకొండలో యువతి యాసిడ్ దాడి ఘటన కలచివేసింది
- వీడియో కాల్ చేసి మాట్లాడి బాధిత కుటుంబానికి భరోసా
- బుల్లెట్లతో ఉన్న గన్ మ్యాగ్జైన్ అదృశ్యం నిర్లక్ష్యమే
- కీలక కేసులలో నిబద్ధతే తప్ప కూటమి ప్రభుత్వ నిర్లిప్తత లేదు
- 3 నుంచి 6 నెలల కాలంలోనే ఫోక్సో కేసులలో శిక్షల అమలు
- శనివారం తొలిసారి జరిగే కీలక సదస్సుకు ముఖ్య అతిథిగా హోంమంత్రి వంగలపూడి అనిత



అమరావతి: హోంశాఖకు 2025-26 బడ్జెట్ కేటాయింపులతో ఫోరెన్సిక్ కు ఊతమందించి..ఫింగర్ ప్రింట్ కు ప్రాణం పోస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. ఈ సారి బడ్జెట్ లో హోంశాఖకు ప్రత్యేక కేటాయింపులు జరపాలని కోరినట్లు ఆమె స్పష్టం చేశారు. సచివాలయంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల అధ్యక్షతన జరిగిన హోం,విపత్తు నిర్వహణ శాఖల ప్రీ-బడ్జెటరీ సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు.

బడ్జెట్ లో అదనంగా కేంద్ర ప్రభుత్వ నిధులు రాబట్టడంపై ప్రత్యేక కసరత్తు చేస్తున్నామని హోంమంత్రి ఈ సందర్భంగా హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. పోలీస్ వాహనాలకు ప్రభుత్వం ఇచ్చే ఆయిల్ ను 150 లీటర్ల నుంచి 300 లీటర్లకు పెంచాలని హోంమంత్రి అనిత ఆర్థిక మంత్రి కేశవ్ కు ప్రతిపాదించారు. గత ఐదేళ్లలో ఎంతో కీలకమైన ఇన్వెస్టిగేషన్ ఛార్జ్‌లు ఇవ్వలేదన్నారు. వచ్చే బడ్జెట్ లో గత ఛార్జీల అంచనాలు పెంచి బడ్జెట్ లో ప్రత్యేకంగా కేటాయించాలని హోంమంత్రి కోరారు.

గత ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో పోలీస్ స్టేషన్లు క్షేత్రస్థాయిలో చాలా అధ్వాన్నంగా తయారయ్యాయని హోంమంత్రి పేర్కొన్నారు. గంజాయి, సైబర్ క్రైమ్‌లతో జైళ్లలో ఖైదీలు పెరుగుతున్న నేపథ్యంలో కొత్త జైలు భవనాలను నిర్మించడానికి బడ్జెట్ ఇవ్వాలని హోంమంత్రి తెలిపారు. ఇటీవల నెల్లూరు జిల్లా కస్తూర్బాగాంధీ వసతిగృహంలో నిందితుడిని పట్టుకోవడానికి సీసీ కెమెరా లేకపోవడం వల్ల కష్టసాధ్యమైందన్నారు.

గత ఐదేళ్లలో శాఖల వారీగా ప్రతి ఏటా ఐదు శాతం పెంచడం మినహా ఏనాడు చర్చ జరగడం, కేటాయింపులకు నోచుకోవడం జరగలేదని హోంమంత్రి అనిత విమర్శించారు.

కూటమి ప్రభుత్వం ప్రజా పోలిసింగ్ విధానంతో నేరనియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన 6 నెలల్లోనే ఏపీలో నేరాలు 9 శాతం తగ్గుముఖం పట్టడమే అందుకు నిదర్శనమన్నారు.

పోలీస్ అకాడమీ ఏర్పాటుకు రూ.15 కోట్లు కేటాయించాలని హోంమంత్రి అడిగారు. కేసుల దర్యాప్తు, నేరస్థులను పట్టుకోవడంలో కీలకమైన అప్పా, ఆక్టోపస్, గ్రే హౌండ్స్‌ల ఏర్పాటుకు సహకరించాలన్నారు. ఆక్టోపస్ భవన నిర్మాణానికి అవసరమైన రూ.27 కోట్లు నిధులు అందించడానికి చొరవ చూపాలన్నారు. ఈగల్ వ్యవస్థ, కమాండ్ కంట్రోల్ సెంటర్, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు బడ్జెట్ లో పెద్దపీట వేయాలన్నారు.

ప్రభుత్వ ఆస్తులైన హైకోర్టు, విమానాశ్రయాలను రక్షించే ఏపీఎస్ఎఫ్ దళాలకు సంబంధించి నిధులు కేటాయించాలన్నారు. విశాఖపట్నంలో కొత్త సీపీ కార్యాలయం ఏర్పాటుకు నిధులివ్వాలని ప్రతిపాదించారు. విజయవాడ పరిధిలో అస్త్రం యాప్, సీసీటీవీ కెమెరాల నిర్వహణ, అవార్డ్స్ పెండింగ్ బిల్లుల చెల్లింపులకు బడ్జెట్ కేటాయించాలన్నారు. చలాన్లు వేసే టెక్నాలజీకి సంబంధించి అవసరమైన బడ్జెట్ కేటాయింపులు జరపాలని హోంమంత్రి అనిత ఆర్థిక మంత్రిని ప్రజంటేషన్ ద్వారా కోరారు.

హోంమంత్రి అనిత ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం వచ్చే బడ్జెట్ లో హోంశాఖకు ప్రత్యేక కేటాయింపులకు కృషి చేస్తామన్నారు. హోం శాఖకు సంబంధించి 94 కేంద్ర ప్రభుత్వ పథకాలను గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం పక్కనపెట్టిందని ప్రీ బడ్జెటరీ సమావేశం సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే 73 పథకాలను పునరుద్ధరించినట్లు ఆయన స్పష్టం చేశారు.

కేంద్ర ప్రభుత్వ నిధులను సాధ్యమైనంత రాబట్టి సక్రమంగా వినియోగిండానికి పెద్దపీట వేస్తామన్నారు. అందుబాటులో ఉన్న వనరులు, సౌకర్యాలను వినియోగించుకుని ఖర్చు తగ్గించుకోవడం పైనా దృష్టి పెట్టాలని ఆర్థిక మంత్రి కేశవ్ పేర్కొన్నారు. సీఐడీలో స్టేట్ ఫింగర్ ప్రింట్ బ్యూరో సాఫ్ట్ వేర్ నిర్వహణకు సంబంధించి అవసరమైన నిధులకు సంబంధించి స్పష్టతనివ్వాలని అధికారులను ఆర్థిక మంత్రి ఆదేశించారు.

### బుల్లెట్లతో ఉన్న గన్ మ్యాగ్జైన్ అదృశ్యం నిర్లక్ష్యమే : హోంమంత్రి అనిత

సహచర కేబినెట్ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గన్ మెన్ జి.వి రమణ వెంట ఉండే గన్ మాగ్జైన్ అదృశ్యంపై హోంమంత్రి అనిత స్పందించారు. 30 బుల్లెట్లతో గన్ మ్యాగ్జైన్ మాయవడాన్ని సీరియస్ గా పరిగణిస్తున్నట్లు స్పష్టం చేశారు. గన్ మ్యాగ్జైన్ మిస్ అవడంలో నిర్లక్ష్యం స్పష్టమవుతోందన్నారు.

ఈ ఘటనపై దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అంశంపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో మాట్లాడినట్లు హోంమంత్రి మీడియా సమావేశంలో స్పష్టం చేశారు.

### అన్ని ఆధారాలతోనే వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీ అరెస్ట్

వైసీపీ నాయకులు వల్లభనేని వంశీ అరెస్ట్ సక్రమమే తప్ప అక్రమం కాదని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. వంశీ అరెస్ట్ లో కర్మ సిద్ధాంతం కనిపిస్తోందన్నారు. అరెస్ట్ కు సంబంధించి అన్ని ఆధారాలున్నట్లు ఆమె స్పష్టం చేశారు. తప్పు చేసిన వారికి ఎప్పటికైనా శిక్షపడుతుందనడానికి వంశీ అరెస్ట్ ఉదాహరణ అన్నారు. వైఎస్ఆర్సీపీ ప్రభుత్వంలో ప్రతిపక్షంలో ఉన్న మమ్మల్ని నాడు డీజీపీ ఆఫీస్ గేట్ కూడా దాటనీయలేదని హోంమంత్రి గుర్తు చేశారు.

టీడీపీ ప్రధాన కార్యాలయం నుంచి కిలోమీటర్ అవతలే ముళ్ల కంచెలు వేసి ఆపిన నాటి రోజులు గుర్తురాలేదా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 8 నెలల నుంచి మాజీ మంత్రి అంబటి రాంబాబు డీజీపీని కలిసి వినతి పత్రాలు ఇవ్వలేదా? అన్నారు. చట్ట ప్రకారం, ఫిర్యాదును బట్టి సెక్షన్ల అనుగుణంగానే అన్నీ జరుగుతున్నాయన్నారు. కీలక కేసుల్లో కూటమి ప్రభుత్వం నిర్లిప్తత అన్న ఆరోపణ నిజం కాదన్నారు.

ప్రజా ప్రభుత్వం నిబద్ధతతో తప్పు చేసిన ప్రతి ఒక్కరికి శిక్షపడేలా చేస్తుందన్నారు. విజయనగరం జిల్లాలో 3 నుంచి 6 నెలల కాలంలోనే రెండు పోక్సో కేసులను దర్యాప్తు చేసి చట్ట ప్రకారం శిక్షపడేలా చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. పోలీస్, న్యాయ విభాగాలను సమన్వయం చేసుకుంటూ మరింత వేగంగా నిందితులకు శిక్షలను అమలు చేస్తామన్నారు.

### గుర్రంకొండలో యువతి యాసిడ్ దాడి ఘటన కలచివేసింది

అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం ప్యారంపల్లె గ్రామానికి చెందిన యువతిపై ప్రేమోన్మాది యాసిడ్ దాడి ఘటపై హోంమంత్రి అనిత తీవ్రంగా స్పందించారు. ఘటన జరిగిన వైనాన్ని జిల్లా ఎస్పీతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హోంమంత్రి వీడియో కాల్ ద్వారా బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. బాధితురాలి మెరుగైన వైద్యం కోసం బెంగళూరు ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. బాధితురాలికి, కుటుంబానికి న్యాయం జరిగే వరకూ ఆ కుటుంబానికి ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉంటుందన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ స్పందించారన్నారు. మరో మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి బాధిత కుటుంబాన్ని స్వయంగా వెళ్లి పరామర్శించినట్లు ఆమె తెలిపారు.

### తొలిసారి జరిగే కీలక సదస్సుకు ముఖ్య అతిథిగా హోంమంత్రి అనిత

కూటమి ప్రభుత్వం నేతృత్వంలో వినూత్న విధానాల దిశగా అడుగులు పడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆధ్వర్యంలో నేర,న్యాయ విచారణకు సంబంధించిన కీలక అవగాహన సదస్సు జరగనుంది. ఈ నెల 15వ తేదీ శనివారం జరిగే వర్క్ షాప్‌లో కీలకమైన డిజిటల్ ఎవిడెన్స్ ద్వారా కేసుల పరిష్కారం, సవాళ్ల గురించి ప్రధానంగా చర్చించనున్నారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని జీఆర్టీ హోటల్‌లో ఉదయం 10గం.లకు ప్రారంభమయ్యే వర్క్‌షాప్‌లో హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరవనున్నారు. సచివాలయంలోని హోం మంత్రి చాంబర్లో శుక్రవారం ప్రాసెక్యూషన్ డైరెక్టరేట్ అధికారులు హోంమంత్రిని ఆమె చాంబర్‌లో కలిసి ఆహ్వానం పలికారు.

## తెలంగాణలో ప్రతి వ్యక్తి తలసరి ఆదాయం 3.56 లక్షలు

- రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తి జరుగుతుంది, భూగర్భ జల వనరులు పెరిగాయి
- హైదరాబాద్ పరిసరాల్లో పూల సాగును నాబార్డు ప్రోత్సహించాలి
- గత పది సంవత్సరాలు సైంటిఫిక్ సాగును నిర్లక్ష్యం చేశారు
- ఐకెపిల ద్వారా ఆర్గానిక్ సాగును ప్రోత్సహించాలి
- వ్యవసాయ పంపు సెట్లు క్రమంగా సోలార్ పవర్ పంపుసెట్లుగా మార్చేందుకు దృష్టి సారించాలి
- గ్రీన్ ఎనర్జీ రంగంలో తెలంగాణను లీడర్‌గా నిలపాలి
- నాబార్డ్ స్టేట్ ఫోకస్ పేపర్ ఆవిష్కరణ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్: దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం ఒకటి. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (gsdp) 15.02 లక్షల కోట్లు, వృద్ధిరేటు 14.5%. రాష్ట్రంలో ప్రతి వ్యక్తి తలసరి ఆదాయం 3.56 లక్షలుగా ఉందని తెలిపారు. అభివృద్ధి అనేది కేవలం సంఖ్యల ద్వారా మాత్రమే కాకుండా రైతులు, సూక్ష్మ , చిన్న, మధ్య తరహా పరిశ్రమలు గ్రామీణ ప్రాంతాలను ఏ విధంగా అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్తున్నాం అనేదే మెరుగైన ప్రయాణం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభివర్ణించారు.

ఈ ప్రయాణంలో నాబార్డ్ కీలక భాగస్వామిగా ఉందని రాబోయే రోజుల్లో మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు.వ్యవసాయ రంగానికి రుణ సహాయం, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. డిజిటల్ బ్యాంకింగ్ రంగాన్ని విస్తరించాలని కోరారు.

నాబార్డ్ సహకారంతో రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగి రైతులు అనేక పంటలు పండించే స్థాయికి చేరుకున్నారని, నీటి కొరత ఉన్న జిల్లాలను గుర్తించి నాబార్డ్ తన సహకారాన్ని మరింత విస్తరించాలని కోరారు. నీటిని ఆదా చేసే డ్రిప్పు, స్ప్రింక్లర్ల ద్వారా సాగు చేయడంతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే అవకాశం ఉందని తెలిపారు. విపరీతమైన ఎండ ఉన్నప్పటికీ ఇజ్రాయిల్ దేశంలో అద్భుతమైన వ్యవసాయ వృద్ధిని సాధించారని వివరించారు. ఎడిబుల్ ఆయిల్ దిగుమతులపై ఆధారపడకుండా ఉండడానికి మనదేశంలో లక్ష ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగులో



మలేషియా ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందని తెలంగాణలోనూ ఆయిల్ ఫామ్ సాగును బలోపేతం చేయాలని కోరారు. మన రాష్ట్రం మామిడి, పసుపు, మిర్చి, చిరుధాన్యాలు వంటి విలువైన పంటలకు పేరుగాంచిన రాష్ట్రం. కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సహించడం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రైతులకు శిక్షణ ఇవ్వడం వంటి పనులు నాబార్డు చేపట్టాలని కోరారు.

మహారాష్ట్రలో ఆల్ ఫోన్స్ రకం మామిడిని సాగు చేస్తున్నారు. ఇది ఎగుమతిలో ఒక మోడల్ గా ఉన్నది. మహారాష్ట్ర తరహా భూమి, ఇతర వనరులు మన రాష్ట్రంలో ఉన్న నేపథ్యంలో ఆల్ ఫోన్స్ రకం మామిడి సాగుకు రైతులను ప్రోత్సహించాలని కోరారు.

గత పది సంవత్సరాలపాటు పాలించిన వారు రాష్ట్రంలో సైంటిఫిక్ సాగును నిర్లక్ష్యం చేశారని తిరిగి ఆ రంగం వైపు వ్యవసాయ శాఖ, నాబార్డు అధికారులు దృష్టి సారించాలని కోరారు. గ్రీన్ హౌస్, పాలీ హౌస్, డ్రిప్, స్ప్రింక్లర్ ల ద్వారా పంటల సాగుకు ప్రోత్సాహం అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ బ్యాంకింగ్, మొబైల్ క్రెడిట్ వ్యవస్థలను విస్తరించాలని, స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని కోరారు. డిజిటల్ బ్యాంకింగ్ రంగంలో కెన్యా దేశం M -pesa ద్వారా ఆత్మక మార్పు తెచ్చిందని ఉదహరించారు.

సూక్ష్మ ,చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా లక్షల సంఖ్యలో ఉపాధి, రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. గ్రీన్ పవర్ ఉత్పత్తికి సహకారం అందించి సుస్థిరమైన అభివృద్ధి సాధనకు నాబార్డ్ ముందుకు రావాలని కోరారు. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపు సెట్లు ప్రస్తుతం ఉచిత విద్యుత్తు పథకం ద్వారా కొనసాగుతున్నాయి, వీటిని క్రమంగా సోలార్ పంపుసెట్లు గా మార్చేందుకు ప్రయత్నం చేయాలని కోరారు. సోలార్ వైపు వెళ్లడం మూలంగా ఆర్థికంగా లాభం పొందడమే కాదు, వాతావరణ కాలుష్యాన్ని పెద్ద సంఖ్యలో తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

గ్రీన్ పవర్ ఉత్పత్తిలో జర్మనీ ప్రపంచ లీడర్ గా ఉంది.. ఈ రంగంలో దేశంలో మన రాష్ట్రం లీడర్గా ఎదిగేందుకు నాబార్డ్ సహకారం అందించాలన్నారు. కొత్త విద్యుత్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. స్వయం సహాయక సంఘాల ద్వారా 1000 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తికి ఇంధన శాఖ అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఆర్థిక చేయూతను అందించాలన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజన ప్రాంతాల్లో రైతులకు సాగు భూములు అందజేశాం, ఆ భూముల్లో పామాయిల్, అవకాడో, వెదురు వంటి పంటల సాగును ప్రోత్సహించండి.. ఫలితంగా అటవీ విస్తీర్ణంను కాపాడుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 15, ఫిబ్రవరి 2025 ||






## మంచి జీవితాన్ని త్యాగం చేసిన ఘనత దేవేందర్ గౌడ్‌దే

- దేవేందర్ గౌడ్ ఆ నాడు గోడలపైన టీజీ అని రాయించారు
- మా ప్రభుత్వం రాగానే టీఎస్ ను టీజీ గా మార్చాం
- దేవేందర్ గౌడ్ లాంటి వారు క్రియాశీలక రాజకీయాల్లో లేకపోవడం తెలంగాణకు తీరని నష్టం
- విజయ తెలంగాణ పుస్తకావిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్:** వ్యక్తిగతంగా నేను చాలా అభిమానించే నాయకుల్లో దేవేందర్ గౌడ్ అగ్రస్థానంలో ఉంటారు. పుస్తకంలో దేవేందర్ గౌడ్ తెలంగాణ ఉద్యమ చరిత్ర ను ప్రజల కోణంలో పొందుపర్చారు. కొంత మంది తెలంగాణ ఉద్యమ చరిత్రను తమకనుకూలంగా మలుచుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, యువకుల త్యాగాలను చరిత్రలో లిఖించాలి. ఒక వ్యక్తి, ఒక కుటుంబం, ఒక రాజకీయ పార్టీ నే తెలంగాణ అని చరిత్రలో రాసే ప్రయత్నం చేశారు. తెలంగాణ కోసం దేవేందర్ గౌడ్ ఆ నాడు తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైనది. ఆనాడు ఆయన ఉన్న పార్టీలో నాయకుడి తర్వాత సరిసమానం గా చలామణి అయిన నేత దేవేందర్ గౌడ్. మంచి జీవితాన్ని త్యాగం చేసి తెలంగాణ కోటసం బయటకు వచ్చారు. గోదావరి జలాలతోనే తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని దేవేందర్ గౌడ్ ఆ నాడు పాదయాత్ర చేశారు. దేవేందర్ గౌడ్ పాదయాత్ర వల్ల నే ఆ నాటి పాలకులు చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టు ను చేపట్టారు. తెలంగాణ అంటే టీజీ అని



ఉద్యమంలో యువకులు బండ్ల పైనే కాదు గుండెలపైన రాసుకున్నారు. దేవేందర్ గౌడ్ ఆ నాడు గోడలపైన టీజీ అని రాయించారు. ప్రజల ఆకాంక్ష మేరకు మా ప్రభుత్వం రాగానే టీఎస్ ను టీజీగా మార్చాం. జయ జయహే తెలంగాణ పాట ను రాష్ట్ర అధికారిక గీతం గా తీసుకువచ్చాం. ఇవన్నీ నా ఆలోచనలు కావు.. ప్రజల ఆలోచనలు. తెలంగాణ ఉద్యమంలో సర్వస్వం త్యాగం చేసిన 9 మంది ఉద్యమకారులకు ఇంటి స్థలం, కోటి రూపాయలు ప్రకటించాం. దేవేందర్ గౌడ్ లాంటి వారు క్రియాశీలక రాజకీయాల్లో లేకపోవడం తెలంగాణకు తీరని నష్టం. తెలంగాణ రాజకీయాల్లో విలువలతో కూడిన నాయకులు రావాలి.

హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ ఎంపి కె.కేశవరావు, వి.హన్మంతరావు, మధుయాష్కీగౌడ్ తదితర బీసీ నేతలు ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.






## ఎస్సీ వర్గీకరణ ఏ కులానికి, ఏ మతానికి వ్యతిరేకం కాదు

- ఎస్సీ వర్గీకరణ అమలు తో అత్యంత వెనకబడ్డ కులాలకు రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్ ఫలాలు అందరికీ చేరుతాయి
- మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి .

**హైదరాబాద్:** ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తూ అందుకు కృషి చేసిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా గారిని 57 ఎంబిఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేశం ఆధ్వర్యంలో వచ్చిన ప్రతినిధులు హైదరాబాద్ లోని మంత్రుల నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణపై సుదీర్ఘకాలం పాటు పోరాటం చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఎస్సీ వర్గీకరణ పై చిత్తశుద్ధితో సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసి సీనియర్ అడ్వకేట్స్ తో కేసును వాదించామన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తుందన్నారు.

దళితుల్లో అత్యంత వెనుకబడ్డ దళిత కులాల కు సామాజిక న్యాయం చేయడానికి కృషిచేస్తామన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పై జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదికను సీఎం రేవంత్ రెడ్డి శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టారన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా ఏ కులానికి, మతానికి నష్టం జరగదన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ.

ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ గారిని కలిసిన 57 ఎంబిఎస్సీ కులాల ప్రతినిధులు దళితుల్లో అత్యంత వెనుకబడ్డ 57



ఎంబి ఎస్సీ కులాలకు కులధ్రువీకరణ పత్రాలను ఆర్డీవో ద్వారా కాకుండా తహసీల్దార్ ద్వారా ఇవ్వాలని వినతి పత్రం సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ మేరకు 57 ఎంబి ఎస్సీ కులాలకు ప్రత్యేక డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేసారు.

ఈ కార్యక్రమంలో ఎంబి ఎస్సీ కులాల రాష్ట్ర నాయకులు ముంజాగల విజయ్ కుమార్, ఉపదే సనధన్ మాంగ్ గారోడి, కర్నె రామారావు డక్కలి, బత్తుల పాండు పంబాల, దొంబర దివాకర్, వెంకటయ్య మదాసి కురువ, రాయిల లక్ష్మి నర్సయ్య చిందు, పరమేశ్వర్ మాంగ్, కొల్పుల నవీన్, మాష్టి చిన్నస్వామి, మటపతి నాగయ్య బేడ బుడ్గ జంగం తదితరులు పాల్గొన్నారు.

### రైతులు, చేనేత కార్మికుల సంక్షేమానికి

## రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఉద్యాన పంటలకు ప్రోత్సాహం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల

**హైదరాబాద్:** రాష్ట్రంలో లక్షలాది సంఖ్యలో ఉన్న రైతులు, చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన వ్యవసాయ, చేనేత, హస్త కళల శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో వారు స్పష్టం చేశారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రైతు వెన్నుముక, వ్యవసాయ ఆధారిత రాష్ట్రం ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ రంగానికి గత రాష్ట్ర బడ్జెట్లో పెద్ద మొత్తంలో కేటాయింపులు చేశాం, ఆ విధానాన్ని కొనసాగిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయంగా అందిస్తున్న రైతు భరోసాను కొనసాగిస్తామని ఆ మేరకు బడ్జెట్లో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

ఉద్యాన పంటల విస్తీర్ణం పెంపుపై దృష్టి సారించాలని మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల అధికారులను ఆదేశించారు. సాధారణ పంటలతో పోలిస్తే ఉద్యాన పంటలతో వచ్చే ఆదాయం మూడు రెట్లు ఉంటుంది, ఫలితంగా రాష్ట్ర ఆర్థిక వృద్ధి పెద్ద సంఖ్యలో ఉంటుందని మంత్రులు వివరించారు. పూలు, కూరగాయలు, ఆయిల్ ఫామ్ వంటి



ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.

జల వనరులను సంరక్షించడంతోపాటు, పంట ఉత్పత్తులు పెరిగేందుకు ఉపయోగపడే డ్రిప్పు, స్ప్రింక్ లర్లు సబ్సిడీపై రైతులకు అందజేయాలని తెలిపారు.

చేనేత కార్మికులకు సబ్సిడీపై నూలు, విద్యుత్ సౌకర్యం వంటి పథకాలు కొనసాగించాలని మంత్రులు అధికారులకు తెలిపారు. వారికి ఇచ్చిన మాట మేరకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రంలో టెక్స్ టైల్ పార్కుల అభివృద్ధికి కావలసిన చర్యలు చేపట్టాలని మంత్రులు ఇరువురు అధికారులను ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్ రావు, చేనేత శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రమా అయ్యర్, ఆర్థిక శాఖ జాయింట్ డైరెక్టర్ హరిత, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

## మోదీకి రేవంత్ రెడ్డి సర్టిఫికెట్స్ అవసరం లేదు

- 75 ఏళ్లో ఒక్క బీసీనైనా కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిని చేసిందా?
- మోదీని విమర్శిస్తే బీసీ సమాజమే సరైన బుద్ధి చెబుతుంది
- మోదీ కన్వర్టెడ్ బీసీ అంటూ సీఎం రేవంత్ చేసిన కామెంట్స్‌పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందన

**హైదరాబాద్:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అవగాహనారాహిత్యంతో కూడుకున్నవి. రాజకీయ విమర్శలు చేసే క్రమంలో.. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న విషయాన్ని మరిచిపోయి.. నోటకొచ్చినట్లు అవాక్కులు, చెవాకులు పేలడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను.

ప్రధానమంత్రి బీసీనా కాదా? అని అంశంపై ముఖ్యమంత్రి బహిరంగ చర్చకురావాలని సవాల్ విసురుతున్నాను. రోజురోజుకూ రాష్ట్రంలో, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో పట్టుకోల్పోతున్న నేపథ్యంలో.. అసహనంతో రేవంత్ రెడ్డి ఇలా మాట్లాడుతున్నారు. కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారానికి దూరమవడం, మొన్నటి ఢిల్లీ ఎన్నికల్లో డబుల్ హ్యాట్రిక్ గుండుసున్నాలతో అవమానం పాలవడాన్ని తట్టుకోలేక కాంగ్రెస్ పార్టీలో, రేవంత్ రెడ్డిలో అసహనం కట్టలు తెంచుకుంటోంది.

ఆకాశం పైకి ఉమ్మేస్తే పెద్దోడిని అయిపోతానని రేవంత్ రెడ్డి అనుకుంటే అది ఆయనపైనే పడుతుందనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. స్వతహాగా బీసీ వర్గానికి చెందిన వ్యక్తిగా.. దేశంలో బీసీ అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న నాయకుడిగా ప్రధానమంత్రికి ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోతోంది. సామాజిక సమరసత విషయంలో బీజేపీకి, నరేంద్రమోదీకి.. రేవంత్ రెడ్డి సర్టిఫికెట్స్ అవసరం లేదు.

బీసీకమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించిన నరేంద్రమోదీ ప్రభుత్వం. కేంద్రమంత్రివర్గంలో 27 మంది ఓబీసీలకు, 12 మంది ఎస్సీలకు, 8 మంది ఎస్టీలకు, ఐదుగురు మైనార్టీలకు అవకాశం కల్పించిన ఘనత నరేంద్రమోదీది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు.. ఇలా సామాజిక సమరసతతో పనిచేసిన సందర్భాలున్నాయా? అని రేవంత్ లెక్క చెప్పగలరా? మోదీ సర్కారు వచ్చిన తర్వాత నీట్ పరీక్షల్లో బీసీలకు 27% రిజర్వేషన్లు కలిపించినందునే.. ఇవాళ బీసీ తమ్ముళ్లు, చెల్లెళ్లకు ఉన్నతవిద్యాసంస్థల్లో ప్రవేశాలు లభిస్తున్నాయి. ఒకటా రెండా? బీసీల అభ్యున్నతికోసం మోదీ ప్రభుత్వం చేస్తున్న పనుల జాబితాను నేను



ఇవ్వగలను. మరి మీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తోంది?

కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు.. రాష్ట్రమంతా అట్టహాసంగా సర్వే నిర్వహించి తమకు అన్యాయం చేశారని బీసీ సంఘాలే విమర్శలు చేస్తున్నాయి. ఇంత అసమగ్రంగా సర్వే చేశారంటూ మండిపడుతున్నాయి. దీన్నుంచి తప్పించుకోవడానికి, మీరు మోదీ మీద విమర్శలు చేస్తున్నారు. మీ అసమర్థతమీద చర్చను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు.

ఎన్నికల వాగ్దానం సందర్భంగా.. ఐదేళ్లకు లక్షకోట్లు, ఏడాదికి 20వేల కోట్ల బడ్జెట్ ఇస్తామని అని.. ఎంతవరకు పూర్తిచేశారో ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోండి. ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపోలేక.. మోదీ ను తక్కువ చేసి తప్పించుకుందామనుకుంటున్నారు. ఇదేనా మీ చిత్తశుద్ధి? తెలంగాణలో బీసీల పురోగతికోసం రాష్ట్ర బడ్జెట్ లో రేవంత్ సర్కారు ఎంత కేటాయించింది? ఎంత విడుదల చేసింది? ఒక్కటంటే ఒక్క బీసీ వర్గమైనా మీ పాలనలో సంతోషంగా ఉన్నారా? ఇదేనా మీ చిత్తశుద్ధి?

నామినేటెడ్ పోస్టుల విషయంలోనూ బీసీలకు అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా? 75 ఏళ్లో ఒక్క బీసీనైనా కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిని చేసిందా? తెలంగాణలో అధికారంలోకి వస్తే.. బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిన పార్టీ బీజేపీ. అనవసరంగా బీజేపీపై, మోదీ పై విమర్శలు చేస్తే.. ప్రజలు ఊరుకోరు. మోదీని విమర్శిస్తే బీసీ సమాజమే సరైన బుద్ధి చెబుతుంది.

## తెలంగాణపై కేంద్రం సవతి తల్లి ప్రేమ

- మోడీ సర్కార్‌కు తెలంగాణ ప్రజాగ్రహం తప్పదు
- కేంద్రం వివక్షతపై దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాల్సిందే
- కేంద్రం నిధులు ఇవ్వదు.. విభజన హామీలు అమలు చేయదు
- కేంద్రంపై ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తాం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రానికి నయా పైసా నిధులు ఇవ్వకుండా, రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా వివక్షత చూపుతున్న బీజేపీ నేతృత్వంలోని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజాగ్రహం తప్పదు అని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం బిఆర్ అంబేద్కర్ సచివాలయ మీడియా సెంటర్ లో చిన్నారెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.



తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపిస్తోందని చిన్నారెడ్డి ఆరోపించారు. పార్లమెంట్లో బిల్లు పాస్ అయి రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిసారి అక్కసును వెళ్ళగక్కుతూనే ఉన్నారని చిన్నారెడ్డి అన్నారు.

ఆ అక్కసును మనసులో పెట్టుకుని ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణపై కక్ష సాధిస్తున్నారని చిన్నారెడ్డి ఆరోపించారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అయినప్పటికీ పార్లమెంటులో బిల్లు పెట్టినపుడు బీజేపీ కూడా మద్దతు ఇచ్చిందన్న విషయం ప్రధాని నరేంద్ర మోడీకి గుర్తు పెట్టుకోవాలని చిన్నారెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రూ. 15,000 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉందని, టీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఏడున్నర లక్షల కోట్ల రూపాయలు అప్పులు మిగిల్చిందని చిన్నారెడ్డి చెప్పారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి పాలన చాతకాక రాష్ట్రాన్ని అప్పులు ఊబిలో నెట్టివేసిందని చిన్నారెడ్డి అన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది టీఆర్ఎస్ ప్రభుత్వం అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ నేరుగా ఎందుకు చెప్పలేక పోయారని చిన్నారెడ్డి ప్రశ్నించారు.

రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని చిన్నారెడ్డి కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని, గిరిజన, హార్టికల్చర్ యూనివర్సిటీలకు నిధులు విడుదల చేయాలని, కొత్తగా రోడ్లు, రైల్వే లైన్స్ ను ఏర్పాటు చేయాలని, నాలుగు వేల మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తిలో మిగిలిన 2,400 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తికి సహకరించాలని, నవోదయ, కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని, షెడ్యూల్ 9, 10 లోని అంశాలను అమలు చేయాలని చిన్నారెడ్డి కేంద్ర ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆర్.ఆర్.ఆర్. ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కోరారు. కేంద్రం వివక్షత్తపై దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాల్సిందే అని చిన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. కేంద్రంపై ఉద్యమ కార్యాచరణను రూపొందించు కోవాల్సిందే అని చిన్నారెడ్డి పేర్కొన్నారు.

## జాతీయ భావనతో బీజేపీని గెలపించండి

- తెలంగాణను అప్పులపాలు చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- పటాన్‌చెరులో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**పఠాన్‌చెరు:** 2014 ముందు దేశం ఏ విధంగా ఉండేదో, నేడు ఏ విధంగా ఉందో ఉపాధ్యాయులు, పట్టభద్రులు రాష్ట్రప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

2014కు ముందు ఉగ్రదాడులు, కర్ఫ్యూలు, దాడులు బాంబ్లాస్ట్ లే చూసేవారమన్నారు. లుంబినీ, గోకుల్ చాట్, దిల్ సుఖ్ నగర్ సాయిబాబా టెంపుల్ వద్ద పేలుళ్లు జరిగాయన్నారు. మెహిదీపట్నంలో అడిషనల్ ఎస్పీ కృష్ణప్రసాద్, ఏసీపీ సత్తయ్యను ఉగ్రవాదులు చంపారన్నారు. ముంబాయిలో మధ్యాహ్నం 2 గంటలకు ఏడు రైళ్లను పేల్చిన చరిత్ర ఉగ్రవాదులదన్నారు. మోదీ పాలన పదేళ్లలో పరిస్థితులను దేశ ప్రజలంతా గమనిస్తున్నారని చెప్పారు. పాక్ ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేశామన్నారు. ఈ నెల 27న జరగనున్న శాసనమండలి ఎన్నికల్లో కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ నాలుగు ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయుల నియోజకవర్గానికి పోటీ చేస్తున్న ముగ్గురు అభ్యర్థులను గెలిపించాలని కోరారు. శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పటాన్ చెరులో జరిగిన సభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రసంగించారు.

1969లో ఇందిరాగాంధీ ప్రభుత్వం 360 మందిని చంపించారన్నారు. ఊరేగింపులు, ఉద్యమాలేంటని కర్కశంగా చంపారన్నారు. ఏడో తరగతి విద్యార్థిని రేణుక కూడా అప్పుడు చనిపోయిందని గుర్తు చేశారు. 2014లో ఆంధ్ర నుంచి విడిపోతున్నప్పుడు తెలంగాణ బడ్జెట్ అన్ని ఖర్చులు పోనూ ఆదాయంలో మిగులు ఉండేదన్నారు. ధనిక రాష్ట్రంగా ఉండేదన్నారు. కేసీఆర్ పుణ్యమా అని 8 లక్షల కోట్లు అప్పు అయ్యిందన్నారు. అప్పుచేసి దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రస్తుతం రియల్ఎస్టేట్, కాంట్రాక్టర్లు ఏ ఒక్కరూ సంతోషించడం లేదన్నారు. ప్రభుత్వం టెండర్లు



వేస్తే పాల్గొనే పరిస్థితి లేదన్నారు. జీహెచ్ ఎంసీలో వీధి లైట్లను వేసే వారికి కూడా ఏడు నెలలుగా జీతాలివ్వలేని పరిస్థితి ఉందన్నారు. ఐదువేల కోట్ల రూపాయలు జీహెచ్ ఎంసీ బాండ్లు ఉంటే అవి కూడా కరిగిపోయాయన్నారు. జీహెచ్ ఎంసీ మౌలిక వసతులు కల్పించే పరిస్థితుల్లో లేదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రాష్ట్రం ఏమైపోయినా పరవాలేదన్నట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు.

కాంగ్రెస్ పాలిత మూడు రాష్ట్రాలు పూర్తి దివాలా తీశాయని, ఆప్ అధికారంలో ఉన్న పంజాబ్ ప్రభుత్వం కూడా దివాలా దిశగా కొనసాగుతుందన్నారు. ఆదాయానికి మించి ఖర్చు చేస్తే అభివృద్ధి, ప్రజలపై పరిణామాలు పడతాయన్నారు. హిమాచల్ లో జీతాలిచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ పార్టీల విధానాలతో నష్టపోయేది తెలంగాణ ప్రజలే అన్నారు. పేదవారు, మధ్య తరగతి వారే నష్టపోతారన్నారు. కాబట్టి మేధావులు ఈ రాష్ట్రం ఎటుపోతుందో అని ఆలోచించాలని, ముందుచూపుతో తెలంగాణను రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో సభాధ్యక్షత వహించిన గోదావరి, పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, రాజేశ్వర్ రావు, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ గుప్త, వెంకటేశ్, శ్రీనివాస్, శిల్పా తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

## జిబియస్ బాధితులు ఆందోళన చెందవద్దు

- ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

**గుంటూరు, మహానాడు:** అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పర్యటనలో ఉన్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు గుంటూరు జిజిహెచ్‌ను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శుక్రవారం సందర్శించారు. జిజిహెచ్ లో గులియన్ బాలీ సింద్రోం కేసులతో పాటు రాష్ట్రంలో ఉన్న తాజా పరిస్థితిని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రికి కృష్ణబాబు వివరించారు. రాష్ట్రంలోని పలు జిజిహెచ్ లలో ఇప్పటి వరకు 17 మంది జిబియస్ బాధితులు చికిత్స పొందుతున్నారని కృష్ణబాబు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిజిహెచ్ లలో ఇమ్మునోగ్లోబిన్ ఇంజక్షన్లు సరిపడా అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. అదనంగా ఇమ్మునోగ్లోబిన్ ఇంజక్షన్లు అవసరమైతే వెంటనే కొనుగోలు చేయాలని



ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబును ఆదేశించారు.

జిబియస్ బాధితులెవరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ భరోసా కల్పించారు. జిజిహెచ్‌లలో పూర్తిస్థాయి చికిత్స అందు బాటులో ఉందని, గుంటూరు జిజిహెచ్‌లో 5 గురు జిబియస్ పేషెంట్లు చికిత్స పొందుతున్నారు.. రెండ్రోజుల కిందట ఇద్దరు డిస్చార్జ్ అయ్యారని మంత్రి తెలిపారు. కోనసీమ, గుంటూరు జిల్లాలు, గిద్దలూరు, నర్సారావుపేట ప్రాంతాల నుండి గుంటూరు జిజిహెచ్ లో జిబియస్ బాధితులు చేరారు. ఇమ్మ్యునోగ్లోబిన్ ఇంజక్షన్లు తీసుకోకుం డానే 80 శాతం మంది జిబియస్ బాధితులు రికవర్ అయ్యారని, 10 నుండి 15 శాతం జిబియస్ బాధితులకు చికిత్స అవసరమయ్యింది... ఐసియుల్లో చికిత్స అందిస్తూ ఇమ్మునోగ్లోబిన్ ఇంజక్షన్లు ఇచ్చారని మంత్రి తెలిపారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
5
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 15, ఫిబ్రవరి 2025

# పీలేరులో యువతిపై ప్రేమోన్మాది దాడిని ఖండించిన జగన్

● నిందితునిపై కఠిన చర్యలకు డిమాండ్



**తాడేపల్లి:** అన్నమయ్య జిల్లా, గుర్రంకొండ మండలం, పేరంపల్లి గ్రామంలో యువతిపై ప్రేమోన్మాది యాసిడ్ దాడిని వైయస్ జగన్ ఖండించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధిత యువతి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉండాలని కోరారు. రాష్ట్రంలో మహిళల భద్రత విషయంలో ప్రభుత్వ వైఫల్యం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, ఇకనైనా మహిళల భద్రతపై దృష్టిసారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# "పేరాబత్తుల" గెలుపు కోరుతూ మంత్రి సుభాష్ విస్తృత ప్రచారం...

● కరపత్రాలు పంచుతూ.. ఓట్లు అభ్యర్థిస్తూ పర్యటన

**రామచంద్రపురం:** ఈనెల 27న జరగనున్న ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఎన్డీఏ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం రామచంద్రపురంలో సుడిగాలి పర్యటన చేశారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం , జనసేన ఇన్చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, రామచంద్రపురం ఎన్నికల పరిశీలకులు కాకినాడ రామారావు, పట్టణ అధ్యక్షులు కడియాల రాఘవన్ ఆధ్వర్యంలో పలు వార్డులో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నేరుగా పట్టభద్రులైన ఓటర్లను కలిసి ఎన్డీఏ కూటమి అభ్యర్థి రాజశేఖర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ విజయం అందించాలని కరపత్రాలు పంచుతూ ఓట్లు అభ్యర్థించారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల అందరివాడు

● కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర పురోభివృద్ధి

● కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**కె.గంగవరం/రామచంద్రపురం:** ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పాలనతోనే రాష్ట్ర పురోభివృద్ధి సాధ్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం పామర్రులో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి సుభాష్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. సకల జనుల శ్రేయస్సే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి పాలన సాగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం



అభివృద్ధి,సంక్షేమం, నిరుద్యోగ నిర్మూలన, పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా ముందుకు సాగుతుందని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు గన్ని కృష్ణ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తుందని, గత వైసిపి పాలనలో అన్ని రంగాల్లోనూ ఆర్థికంగా నష్టపోయా మన్నారు. ఐదేళ్లలో జరిగిన విధ్వంశాన్ని తిరిగి గాడిలో పెట్టే విధంగా కూటమి పాలన సాగుతుందన్నారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ పట్ట బద్రుల సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉన్న నాయకుడని, ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజశేఖర్ కు ఓటు వేయాలని అభ్యర్థించారు. రామచంద్రపురం ఎన్నికల ఇన్చార్జి కాకినాడ రామారావు ఎమ్మెల్సీ ఎన్నికల తీరు, ఓటు వేసే విధానాన్ని వివరించారు. రాష్టాభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు తన అపార అనుభవం ద్వారా విదేశీ పెట్టుబడులు రప్పించి రాష్ట్రభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నివాస ప్రాంతాల్లో రసాయనాలు పారబోస్తే సహించేదిలేదు

● ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య

**విజయవాడ/జక్కంపూడి:** పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను నివాస ప్రాంతాల్లో వారి బోస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య అన్నారు. జక్కంపూడి గ్రామం లోని 60:40 స్థలాల్లో రసాయన వ్యర్థాలను పారబోసిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు.రసాయనాల వ్యర్థాలను పారబోసే పరిశ్రమలను సీజ్ చేస్తా హెచ్చరించారు.

అనకాపల్లికి చెందిన కెమికల్ ప్యాక్టరీ వారు ఈ వ్యర్థాలను పారబోసినట్లుగా గుర్తించామన్నారు. పర్యావరణ చట్టం కింద ఆ సంస్థపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. వ్యర్థాలతో కలుషితమైన ఈ ప్రాంతాన్ని పరిశుభ్రంగా మార్చేందుకు అవసరమైన



చర్యలు చేపడతామన్నారు. ఆ విషయమై అధికారులతో మాట్లాడతామని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడటం దురదృష్టకరమని, ముమ్ముందు ఇలాంటివి పునరావృతమైతే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వ్యర్థాలను నివాస ప్రాంతంలో కలపడం వల్ల ప్రజల ఆరోగ్యం పాడవుతుందన్నారు. వ్యర్థాలను పంపిన పరిశ్రమను మూసివేయడం జరిగిందని అన్నారు. పలువురు గ్రామస్తులు ఆయన వెంట ఉన్నారు.

# కులగణనను శాస్త్రీయంగా రీసర్వే చేపట్టాలి

● రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర

**హైదరాబాద్:** తప్పులతడక సర్వేను బుట్టదాఖలు చేసి కులగణనలో ప్రజలందరిని భాగస్వాములను చేసి తాజాగా, శాస్త్రీయంగా రీసర్వే చేపట్టాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఇటీవల జరిపించిన సర్వే,నిండు శాసనసభ సాక్షిగా వెల్లడించిన నివేదిక చిత్తు కాగితంతో సమానమన్నారు.

హైదరాబాద్ తెలంగాణ భవన్ లో శుక్రవారం మధ్యాహ్నం ఎంపీ రవిచంద్ర విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ప్రభుత్వం ఆషామాషీగా, తూతూమంత్రంగా సర్వే జరిపించిందని, చిత్తశుద్ధి లోపించిందన్న నిర్ణయానికి వచ్చిన బీసీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు దానిని పూర్తిగా తిరస్కరించారన్నారు.రాష్ట్ర ఏర్పాటు జరిగిన తొలినాళ్లలోనే (2014 ఆగస్ట్ 17వతేదీన) మహానేత కేసీఆర్ గారు ఒక రోజులో జరిపించిన సమగ్ర కుటుంబ సర్వే (SKS)లో దేశవిదేశాల నుంచి వచ్చిన తెలంగాణ వాళ్లంతా పాల్గొన్న విషయాన్ని ఎంపీ రవిచంద్ర ఈ సందర్భంగా గుర్తు చేశారు.

SKS ప్రకారం బీసీల జనసంఖ్య కోటి 85లక్షల 61వేల 856 (1,85,61,856) కాగా (51%),10ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వే కోటి 64లక్షల 9వేల 179 (1,64,09,179)(46.25%)అని పేర్కొనడం విడ్డూరంగా, బీసీ జనాభా 21లక్షల 52వేల 677 తగ్గినట్లు చూపడం అసంబద్ధంగా ఉందని ఎంపీ వద్దిరాజు తెలిపారు.




ప్రతి పదేళ్లకొకసారి కేంద్రప్రభుత్వం అధికారికంగా జరిపించే లెక్కల ప్రకారం జనాభా 13.5 శాతం పెరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం ప్రకటించిన ఓటర్లు 3 కోట్ల 35లక్షలు కాగా,18ఏళ్ల లోపు వాళ్లు 25% ఉంటారనే,3 కోట్ల 90 లక్షల మందికి పైగా ఉన్న ఆధార్ కార్డుల ప్రకారం జనాభా 4 కోట్ల 30 లక్షలకు మించుతుందన్నారు.

ఇదిలావుంటే రాష్ట్ర ప్రభుత్వం జరిపించిన సర్వేలో మొత్తం జనాభానే 3 కోట్ల 54 లక్షల 77 వేల 554 (3,54,77,554)అని పేర్కొందని,ఇది SKS నివేదిక కంటే కూడా 9 లక్షల 18 వేల 242 (9,18,242) తక్కువ అని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. ఈవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను అణచివేసే, అన్యాయం చేయాలనే దురుద్దేశంతోనే సర్వే అశాస్త్రీయంగా జరిపించిందని ఆయన మండిపడ్డారు.సర్వేపై పాలకులు వితండవాదంతో కుల సంఘాలపై ఎదురుదాడికి దిగారని.. బీఆర్ఎస్,కుల సంఘాలు లెక్కలతో సహా అది బోగస్ అని నిరూపించడంతో, ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో ప్రభుత్వం దిగొచ్చిందన్నారు. తిరిగి జరుపనున్న కులగణనను అందులో పాల్గొనని 3.1%మందికే పరిమితం చేయకుండా, ఎన్యూ మరేటర్స్ ప్రతి ఇంటికి విధిగా వెళ్లి శాస్త్రీయ పద్ధతిలో మొత్తానికి మొత్తం చేపట్టాలని ఎంపీ వద్దిరాజు డిమాండ్ చేశారు.అర్థంపర్థం లేని కాలమ్స్,57 ప్రశ్నలతో ప్రజలను అయోమయానికి గురి చేయకుండా, సామాజిక వర్గం (కులం) తెలుసుకునేందుకు రెండు మూడు కాలమ్స్‌తో సర్వేను సమగ్రంగా జరిపించాలని, వివరాలను చిత్తశుద్ధితో వెల్లడించాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కోతి కిశోర్,వివేక్ రాజు,కొండపల్లి శ్రీనివాస్ యాదవ్,గోపగాని రఘు తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టారాజ్యంగా అరాచకాలు, దుర్మార్గాలు

● వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

**తాడేపల్లి:** అధికార మదంతో విర్ర వీగుతున్నా కూటమి నేతలు ఇష్టారాజ్యంగా అరాచకాలు, దుర్మార్గాలు చేస్తున్నారని, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడంలో భాగంగా ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కి అలవాటు పడిందని వైయస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆక్షేపించారు.

ఈనెల డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా వల్లభనేని వంశీని అరెస్ట్ చేశారని ఆయన అన్నారు. చంద్రబాబు పాలనలో మహిళలకు, మందిరాలకు రక్షణ లేకుండా పోయిందని.. న్యాయస్థానాలు, చట్టాలపై ప్రభుత్వానికి గౌరవం లేదని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లో తాటిపర్తి చంద్రశేఖర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తున్నదని చెప్పడానికి నిన్న (గురువారం) జరిగిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్ట్ ఘటన తాజా నిదర్శనం. ఆయన అరెస్ట్‌ను, అరెస్ట్ చేసిన విధానాన్ని, ఆయన భార్యను అడ్డుకున్న విధానాన్ని వైయస్సార్‌సీపీ తీవ్రంగా ఆక్షేపిస్తోంది. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, తండ్రీకొడుకులు చంద్రబాబు, లోకేష్ దుర్మార్గాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడమే లక్ష్యంగా వైయస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి వేధించడం పరిపాటిగా మారింది.

అధికారం చేతిలో ఉంటే ఏమైనా చేయొచ్చు అనేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుంది. కోర్టులు ఆక్షేపిస్తున్నా కూడా పట్టించుకోకుండా చట్టాలను కూడా ఉల్లఘించడానికి ఏమాత్రం సంకోచించకపోవడం లేదు. పోలీస్ వ్యవస్థను జేబు సంస్థగా మార్చుకుని అరాచకాలకు పాల్పడుతున్నారు.

అధికారంలోకి వచ్చిన నాటి నుంచి డైవర్షన్ పాలిటిక్స్‌కు అలవాటు పడిన కూటమి ప్రభుత్వం ప్రతినెలా ఏదొక సంచలనం క్రియేట్ చేయడంలో భాగంగా ఈనెలలో వంశీ అరెస్ట్‌పై దృష్టి సారించింది. వైయస్సార్‌సీపీ నాయకులు, సానుభూతిపరులే వారి లక్ష్యం. తెలుగుదేశం పార్టీ కార్యాలయం మీద దాడి చేశారనే ఆరోపణలతో ఏకంగా 94 మందికిపైగా వంశీ అనుచరుల మీద




కేసులు పెట్టి, 40 మందికిపైగా జైళ్లకు పంపినా సరే వారిలో రాక్షసానందం తీరినట్టు లేదు.

పోలీస్‌స్టేషన్‌కొచ్చి ప్రెస్‌మీట్ పెట్టి వంశీని ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టేలా మాట్లాడిన టీడీపీ నాయకుడు పట్టాభిపై ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంది? బూతులు తిట్టి ఈ గొడవకు అసలు కారణమైన పట్టాభిని ఎందుకు వదిలేశారు? సీఐ మీద దాడి చేసిన దానికి చర్యలుండవా? లోకేష్ పుట్టిన రోజు నాడు మా పార్టీ కార్యాలయంపై దాడి కొచ్చిన టీడీపీ కార్యకర్తలపై కేసులుండవా?

# ఆదాయ.. ఉపాధి వనరుగా పర్యాటకం

● సెమీ అర్బన్, రూరల్ జోన్లలో పర్యాటకానికి ప్రోత్సాహకాలు

● అటవీ, ఐటీ, టీజీఐఐసీ, మెడికల్, స్పోర్ట్స్ విభాగాలతో సమన్వయం చేసుకోవాలి

● పర్యాటక శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్:** రాష్ట్రానికి ఆదాయం సమకూర్చడమే కాకుండా ఎక్కడికక్కడ యువతకు ఉపాధి కల్పించే వనరుగా పర్యాటక శాఖ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పర్యాటకులను ఆకర్షించే వనరులు మనకు ఎన్నో ఉన్నా, గతంలో ప్రచారంపైన శ్రద్ధ చూపకపోవడం.. వినూత్న పద్ధతిలో ఆలోచించకపోవడంతో ఈ రంగంలో ఆశించిన ప్రగతి కనిపించలేదన్నారు. తెలంగాణ ఘన చరిత్రను వర్తమానానికి అనుసంధానిస్తూభవిష్యత్‌కు బాటలు వేసేలా పర్యాటక శాఖను తీర్చిదిద్దాలని సీఎం సూచించారు.

పర్యాటక శాఖపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు.

సెమీఅర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రోత్సాహకాలు కల్పించాలని సీఎం తెలిపారు. నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్‌లో బోట్ హౌస్ అందుబాటులో ఉంచాలని, డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు తెలంగాణను వేదికగా మార్చాలని సీఎం సూచించారు. ఆలయాలు, పులుల అభయారణ్యాలకు పర్యాటకంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని... ఆ దిశగా దృష్టిసారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

భద్రాచలం, సలేశ్వరం, రామప్ప వంటి ఆలయాలు, మల్లెల తీర్థం, బొగత జలపాతాలు, బౌద్ధ స్తూపాలు, జైన ఆలయాలు ఇలా ప్రతి ఒక్క పర్యాటక ప్రదేశంలో వసతులు మెరుగుపర్చడంతో పాటు సరైన ప్రచారం కల్పించాలని సీఎం అధికారులకు సూచించారు. భువనగిరి కోట రోప్ వే పనులపైనా సీఎం ఆరా తీశారు.



భూ సేకరణలో కొంత జాప్యం జరిగిందని... ఇప్పుడు భూ సేకరణ పూర్తయినందున త్వరలో టెండర్లు పిలుస్తామని అధికారులకు సీఎంకు తెలియజేశారు. సాధ్యమైనంత త్వరగా భువనగిరి కోట రోప్ వే పనులకు టెండర్లు పిలవడంతో పాటు కోటపై ఉన్న చారిత్రక కట్టడాల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

పర్యాటక శాఖ పాలసీకి తుది రూపు ఇచ్చే సమయంలో అటవీ, ఐటీ, విద్యుత్, టీజీ ఐఐసీ, వైద్య, క్రీడల శాఖలతో సమన్వయం చేసుకోవాలని, ఒక శాఖ విధానాలు మరో శాఖ విధానాలకు ఆటంకంగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు తెలియజేశారు. అడ్వెంచర్ స్పోర్ట్స్‌కు పర్యాటక శాఖలో ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం అన్నారు. వైద్య అవసరాలకు విదేశాల నుంచి వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పర్యాటకుల్లా వచ్చిపోయేలా అన్ని చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. పర్యాటక శాఖకు బడ్జెట్ కేటాయింపులు పెరిగేలా చూస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

సమీక్షలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, చంద్రశేఖర్‌రెడ్డి, సీఎం సంయుక్త కార్యదర్శి సంగీత సత్యనారాయణ, పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆసియాలో సంపన్న కుటుంబాల జాబితాలో 4 భారతీయ ఫ్యామిలీలు



● ఆసియాలో అత్యంత సంపన్న కుటుంబాల జాబితాను రిలీజ్ చేసిన బ్లూమ్‌బర్గ్

● అత్యంత ధనిక ఫ్యామిలీగా రూ. 7.86 లక్షల కోట్ల సంపదతో ముకేశ్ అంబానీ కుటుంబం

● నాలుగో స్థానంలో మిస్త్రీ కుటుంబం (రూ. 3.25 లక్షల కోట్లు)

● ఏడు, తొమ్మిదో స్థానాల్లో వరుసగా జిందాల్, బిర్లా ఫ్యామిలీలు

ఆసియాలోనే అత్యంత సంపన్న కుటుంబాల జాబితాను తాజాగా బ్లూమ్‌బర్గ్ రిలీజ్ చేసింది. ఈ జాబితాలో మన భారతీయ కుటుంబం అగ్ర స్థానంలో నిలిచింది. అలాగే జాబితాలో టాప్-10లో నాలుగు భారతీయ ఫ్యామిలీలు చోటు దక్కించుకోవడం విశేషం. కాగా, ఆసియాలో అత్యంత ధనిక ఫ్యామిలీగా రూ. 7.86 లక్షల కోట్ల సంపదతో ముకేశ్ అంబానీ కుటుంబం అగ్ర స్థానాన్ని సొంతం చేసుకుంది. అలాగే రెండో స్థానంలో థాయ్‌లాండ్‌కు చెందిన చీరా వనోంట్ కుటుంబం (రూ. 3.70లక్షల కోట్లు) నిలిచింది. మూడో స్థానంలో ఇండోనేషియాకు చెందిన హర్టోనో ఫ్యామిలీ (రూ. 3.66 లక్షల కోట్లు) ఉంటే.. నాలుగో స్థానాన్ని రూ. 3.25 లక్షల కోట్ల సంపదతో మిస్త్రీ కుటుంబం దక్కించుకుంది. అలాగే.. ఏడు, తొమ్మిదో స్థానాల్లో వరుసగా జిందాల్ (రూ. 2.44 లక్షల కోట్లు), బిర్లా (రూ. 1.99 లక్షల కోట్లు) ఫ్యామిలీలు నిలిచాయి.

06

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 15, ఫిబ్రవరి 2025 ||

## విద్యావంతుల్లారా ఆలపాటిని గెలిపించండి

- రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్



**మచిలీపట్నం:** ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టబుద్రుల శాసన మండలి ఎన్నికకు కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ని విద్యా వంతులైన ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువత అందరూ మద్దతు ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, మచిలీపట్నం నియోజకవర్గం పరిశీలకులు లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ కోరారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో లుక్కా మాట్లాడుతూ , గత జగన్ రెడ్డి పాలన లో ఐదు సంవత్సరాలలో పట్టభద్రులైన నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేదు అన్న విషయం గమనించమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు 80% వరకు పట్టభద్రులై ఉంటారని, వారికి పిఆర్సి 43.5% చంద్రబాబు ఇస్తే, దాన్ని జగన్ రెడ్డి రివర్స్ పిఆర్‌సితో 23%కు కుదించి ఉద్యోగులను ఆర్థికంగా కుదేలు చేశాడు అన్నారు. వారు దాచుకున్న జిపిఎఫ్, పెన్షన్ల సొమ్మును ఇతర అవసరాలకు జగన్ రెడ్డి వారికి తెలియకుండా దారి మళ్లించి మోసం చేశాడు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వారి ఆరోగ్య అవసరాలకు, పిల్లలు చదువులకు ,వారి పిల్లల వివాహాలకు, వారి కుటుంబ అవసరాలకు వాడుకోవటానికి వీలు లేకుండా జగన్ రెడ్డి దగా చేశాడు అన్నారు.




## మార్చి 31న బ్యాంకులకు సెలవు లేదు:ఆర్బీఐ

**న్యూఢిల్లీ,మహానాడు:**
మార్చి 31వ తేదీన దేశంలోని బ్యాంకులకు సెలవు రద్దు చేస్తూ ఆర్బీఐ నిర్ణయం తీసుకుంది. ఆ రోజున ఈద్ ఉల్ ఫితర్ సందర్భంగా బ్యాంకులకు సెలవు ఉంది. ఆర్థిక సంవత్సరం చివరి తేదీ కావడంతో అన్ని లావాదేవీలు పూర్తి కావాలనే ఉద్దేశంతో ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఒకవేళ మార్చి 31న సెలవు ఇస్తే లావాదేవీ లన్నీ 2025-26 ఆర్థిక సంవత్సరంలో నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో, అన్ని బ్యాంకులు ఆ రోజు పని చేయాలని ఆదేశాలు జారీ చేసింది..

## మద్యం సేవించడంలో తెలంగాణ టాప్

- కేంద్ర మంత్రి అసుప్రియ పటేల్



**న్యూఢిల్లీ,మహానాడు:**
దక్షిణ భారతదేశంలో అత్యధికంగా మద్యం సేవించే రాష్ట్రాలలో తెలంగాణ అగ్ర స్థానంలో ఉందని కేంద్ర మంత్రి అసుప్రియ పటేల్ రాజ్యసభలో వెల్లడించారు.. అయితే, మద్యం తాగే వారి శాతం తగ్గిందని మంత్రి తెలిపారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 2015-16లో ఏపీలో 35 శాతం, తెలంగాణలో 54 శాతం మంది మద్యం సేవించే వారని పేర్కొంది. 2019-21లో ఏపీలో 31 శాతం, తెలంగాణలో 50 శాతానికి తగ్గిందని తెలిపింది..

## మంత్రి సంధ్యారాణి గన్‌మన్ జీవీ రమణపై సస్పెన్షన్ వేటు

**విజయవాడ:** గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి గన్ మన్ జీవీ రమణపై సస్పెన్షన్ వేటు పడింది. రమణ డ్యూటీ దిగి ఇంటికి వెళుతుండగా ఆయన బ్యాగ్ మాయమయింది. ఆ బ్యాగ్ లో 30 బుల్లెట్లు ఉండే మేగజీన్ ఉండడంతో ఈ ఘటన పోలీసు శాఖలో కలకలం రేపింది. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్నారు. రమణపై సస్పెన్షన్ వేటు వేశారు. సంధ్యారాణి ఎస్కార్ట్ వాహనంలో రమణ రొటేషన్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. నిన్న ఉదయం తన రైఫిల్ ను జిల్లా కేంద్రంలో అప్పగించారు. అయితే బుల్లెట్లు ఉన్న మేగజీన్ ను మాత్రం అప్పగించలేదు.

## నా ఓటమి ఆరునెలల క్రితమే తెలుసు

- అయినా కేసీఆర్ ప్రోత్సాహంతో పోటీ చేశా
- ఇప్పుడు ఎన్నికలు వస్తే బీఆర్ఎస్‌కు 100 సీట్లు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**మహబూబాబాద్:** శాసనసభ ఎన్నికల్లో ఓడిపోతానని తనకు ఆరు నెలల ముందే తెలుసని కానీ కేసీఆర్ ప్రోత్సాహంతో పోటీ చేసినట్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకరరావు చెప్పారు. ముఖ్యమంత్రి సోదరులు, ఎమ్మెల్యేలు, మంత్రులు రాష్ట్రంలో అవినీతికి పాల్పడుతున్నారని ఎర్రబెల్లి అన్నారు. రాహుల్ గాంధీ గత ఆరు నెలలుగా రేవంత్ రెడ్డికి అపాయింట్ మెంట్ ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పనితీరుపై వాకబు చేయడానికి ఇటీవల వరంగల్‌కు రావడానికి రాహుల్ గాంధీ ప్రయత్నించారని, కానీ తన నిజస్వరూపం బయటపడుతుందని ముఖ్యమంత్రి ఢిల్లీ పెద్దలతో మాట్లాడి ఆయన పర్యటనను రద్దు చేయించారని దయాకరరావు ఆరోపించారు.



కేసీఆర్ తెలంగాణను పదేళ్లు దార్శనికతతో పాలించారని, కాంగ్రెస్ పదిహేను నెలల్లో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దివాలా తీయించిందని విమర్శించారు. ఇప్పుడు ఎన్నికలు వస్తే బీఆర్ఎస్‌కు 100 సీట్లు వస్తాయని జోస్యం చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రహస్యంగా సమావేశమయ్యారని వ్యాఖ్యానించారు. ఓటమి భయంతో స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు విశ్వసించడం లేదని అన్నారు.

## నేరస్తుడు తప్పించుకోలేడు

- వంశీని కస్టడీలోకి తీసుకుంటాం
- కేసు విచారణలో ఫోన్ కాల్స్, సీసీ కెమెరాలు కీలకపాత్ర
- వంశీ కేసుపై విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు



**విజయవాడ:** వల్లభనేని వంశీని కస్టడీకి తీసుకుంటామని వంశీని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపించామని, నేరం చేసిన ఎవరైనా తప్పించుకోలేని విధంగా టెక్నాలజీఉందని విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు తెలిపారు. కేసు విచారణలో ఫోన్ కాల్స్, సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. వల్లభనేని వంశీపై కస్టడీ పిటిషన్ ఫైల్ చేస్తామని, పోలీస్ కస్టడీకి తీసుకుంటామని చెప్పారు. ఏ కారు ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడకు వెళ్లింది? అనేది టెక్నాలజీ ద్వారా క్లియర్‌గా తెలిసిపోతుందని.. వంశీ కేసుపై టెక్నికల్ ఇన్వెస్టిగేషన్ చేస్తున్నామని తెలిపారు. వల్లభనేని వంశీ విజయవాడ సబ్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వంశీ రిమాండ్ రిపోర్టులో పోలీసులు కీలక విషయాలను పేర్కొన్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న సత్యవర్ధన్ తన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని వంశీ బెదిరించినట్లు తెలిపారు. వంశీకి చట్టాలపై గౌరవం లేదని పేర్కొన్నారు. కిడ్నాప్ కేసులో వైసీపీ నేత వల్లభనేని వంశీకి విజయవాడ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే.




## భవిష్యత్తు అభివృద్ధికి డేటా ఆధారిత పరిపాలన కీలకం

- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. సిసోడియా
- వ్యాపార వ్యూహాలలో ప్రాధాన్యత సంతరించుకున్న డేటా విశ్లేషణ
- డేటా వినియోగం, నిర్వహణలో నైతికత అత్యంత అవశ్యకం

**నాగార్జున విశ్వవిద్యాలయం (అమరావతి):** "ఆధునిక పరిపాలన, వ్యాపార వ్యూహాల్లో డేటా కీలకమైన స్థానం కలిగి ఉంది. విశ్లేషణలు, కృత్రిమ మేధస్సును సద్వినియోగం చేసుకునే సామర్థ్యం గల సంస్థలే భవిష్యత్తులో విజయాన్ని సాధిస్తాయి" అని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, సర్వే సెటిల్ మెంట్, భూపరిపాలన) ఆర్.పీ. సిసోడియా అన్నారు.

"బిజినెస్ అనలిటిక్స్, ఇంటెలిజెన్స్‌లో పురోగమనలు" అనే అంశంపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్ మెంట్ విభాగంలో నిర్వహించిన జాతీయ సదస్సుకు సిసోడియా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు నేతృత్వంలో రాష్ట్రంలో అధునిక సాంకేతిక పరిపాలనకు సాగుతోందని, ప్రతి ఒక్కరూ దానిని అందిపుచ్చుకోవాలని కోరారు.

సిసోడియా ప్రసంగిస్తూ డేటా ఆధారిత నిర్ణయాల ప్రాముఖ్యతను వివరించారు. ఆదాయ నిర్వహణ నుంచి ప్రజా సేవల దాకా అనేక రంగాల్లో కృత్రిమ మేధస్సు, పెద్ద డేటా విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నాయని, వాటి ద్వారా ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు మంచి వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవచ్చని అన్నారు. డేటా విశ్లేషణను సమర్థంగా వినియోగించుకునే సంస్థలు ఆర్థిక అభివృద్ధిలో ముందంజలో ఉంటాయన్నారు. డేటా ఆధారిత భవిష్యత్తుకు విద్యార్థులు, నిపుణులను సిద్ధం చేయడం చాలా అవసరమని, డేటా వినియోగంలో నైతికత అత్యంత కీలకమైన అంశమన్నారు.

ఎవరు డేటాను సమర్థంగా విశ్లేషించి, అర్థం చేసుకుని, నిపుణంగా నిర్ణయాలు తీసుకుంటారో వారిదే భవిష్యత్తు అన్న సిసోడియా వారే విజయం సాధిస్తారని స్పష్టం చేసారు. డేటా ఆధారిత భారతదేశాన్ని నిర్మించేందుకు మనమందరం కృషి చేయాలని ఆకాంక్షించారు. విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య ఒప్పందాలు, సంశోధనలో భాగస్వామ్యం పెరగడం అభినందనీయమని అన్నారు. డేటా ఆధారిత యుగంలో నిరంతర అభ్యాసం, మార్పులకు అనుగుణంగా తమని తాము మలచుకోవడం చాలా అవసరమని సూచించారు.

సదస్సుకు అధ్యక్షత వహించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి అచార్య కె. గంగాధర రావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం బిజినెస్ అనలిటిక్స్ పరిశోధన, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు అకడెమియా-ఇండస్ట్రీ కలయిక అవసరమన్నారు.

సదస్సు డైరెక్టర్, వాణిజ్య, వ్యాపార పరిపాలన విభాగాధిపతి అచార్య రామినేని శివరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ వ్యాపార వ్యూహాలలో డేటా విశ్లేషణ ప్రాధాన్యతను వివరించారు. ఇలాంటి అకడమిక్ సదస్సులు విద్యార్థులు, పరిశోధకులకు విలువైన పరిజ్ఞానాన్ని అందిస్తాయన్నారు. సదస్సులో ప్రముఖ విశ్వవిద్యాలయాల నిపుణులు ఈ అంశంపై దృక్పథాలను పంచుకున్నారు.

ఐఐఎం విశాఖపట్నంకు చెందిన అచార్య విజయ భాస్కర్ కీలకోపన్యాసం చేస్తూ బిజినెస్ ఇంటెలిజెన్స్‌లో ఎఐ, మెషిన్ లెర్నింగ్ పెరుగుతున్న ప్రభావాన్ని వివరిస్తూ, నైతిక డేటా నిర్వహణ కీలకమని అన్నారు. ఐఐఎం రాయ్‌పూర్‌కు చెందిన వర్ష మామిడి, మేధో సంపత్తి హక్కులు, డేటా విశ్లేషణ అనుసంధానంపై మాట్లాడారు.

ఐపీఈ హైదరాబాదు డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాస మూర్తి, భవిష్యత్తు అంచనాల ప్రాముఖ్యతను వివరిస్తూ, వివిధ పరిశ్రమల్లో దీని వాస్తవ ఉపయోగాలను తెలియజేశారు. వ్యాపార విశ్లేషణలో ఆధునిక సాంకేతికతల పాత్ర, పెద్ద డేటా నిర్వహణలో సవాళ్లు, ఎఐ ఆధారిత విశ్లేషణలు ఎలా పరిశ్రమలను మార్చుతున్నాయనే అంశాలపై సదస్సు చర్చించింది. కార్యక్రమంలో డాక్టర్ కనకదుర్గ, డాక్టర్ రత్న కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## యాసిడ్ దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

- యాసిడ్ దాడికి గురైన మహిళకు ప్రభుత్వం తరపున అన్ని సదుపాయాలు కల్పిస్తాం
- యాసిడ్ దాడులను సహించేది లేదు
- కేవలం 15 నిమిషాల్లోనే నిందితులను అదుపులోకి తీసుకోవడం జరిగింది
- యాసిడ్ దాడి సంఘటనపై వెంటనే స్పందించిన మంత్రి నారా లోకేష్
- రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి



**మదనపల్లి:** గుర్రంకొండ మండలం, ప్యారంపల్లి గ్రామానికి చెందిన గౌతమి అనే మహిళపై యాసిడ్ దాడికి పాల్పడిన గణేష్ అనే వ్యక్తిని కఠినంగా శిక్షించడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

శుక్రవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి యాసిడ్ దాడికి గురైన మహిళలను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ భాష, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, తంబళ్లపల్లె నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి జయ చంద్రారెడ్డి, శ్రీరామ్ చిన్నబాబు లతో కలిసి మంత్రివర్యులు మదనపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బాధితురాలని, వారి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. గుర్రంకొండ మండలం, ప్యారంపల్లెకు చెందిన గౌతమి అనే మహిళ డిగ్రీ పూర్తి చేసుకొని బ్యూటిషన్ పని చేసుకుంటూ ఉండేదన్నారు. ఈమెపై గణేష్ అనే వ్యక్తి యాసిడ్ దాడికి పాల్పడం జరిగిందని యాసిడ్ దాడికి పాల్పడిన వ్యక్తిని కేవలం 15 నిమిషాలలోనే అదుపులోకి తీసుకుని నిందితుడిని రిమాండ్ కు పంపేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

మహిళలపై యాసిడ్ దాడులకు పాల్పడే వ్యక్తులను సహించేది లేదని అలాంటి వారిని కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా ఉండేందుకు మహిళలు ముందస్తు జాగ్రత్తగా పోలీసులను ఆశ్రయించాలన్నారు.

యాసిడ్ దాడికి గురైన మహిళను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బెంగళూరుకు తరలించి అక్కడ మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యాసిడ్ బాధితురాలు ఆరోగ్యం గురించి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఫోన్ చేసి బాధితురాలి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

యాసిడ్ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బాధితురాలు పూర్తిగా కోరుకునేంతవరకు ప్రభుత్వం తరపున అన్ని సహాయ సహకారాలు తీసుకోవడం జరుగుతుందని నారా లోకేష్ మంత్రివర్యులకు తెలిపారు.

## ఆర్థిక వృద్ధికి హస్తకళ రంగమే బలమైన ఆధారం

- కేంద్ర చేనేత జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్
- భారత్ టెక్స్ 2025లో ఘనంగా ఆంధ్రప్రదేశ్ పావిలియన్ ప్రారంభం

**న్యూఢిల్లీ:** భారతదేశ ఆర్థిక వృద్ధిలో హస్తకళ రంగం కీలక భూమిక పోషిస్తోందని కేంద్ర చేనేత జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన భారత్ టెక్స్ 2025లో ఆంధ్రప్రదేశ్ పావిలియన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యుత్తమమైన హస్తకళ సంప్రదాయాలకు నిలయంగా ఉందన్నారు. ఈ కేంద్రం మన కళాకారుల నైపుణ్యానికి అద్దం పడుతుందన్నారు పరిశ్రమ పునరుద్ధరణ, మార్కెట్ విస్తరణ, స్థిరమైన అభివృద్ధికి అనుగుణంగా, శిల్పకారులను మద్దతు ఇవ్వడంపై . ప్రభుత్వ దృష్టి సారించిందన్నారు. రేఖా రాణి మాట్లాడుతూ భరత్ టెక్స్ వేదిక ద్వారా ఆంధ్రప్రదేశ్ కళాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశం పొందుతారన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌కి



అనుసంధానం కావడంతోపాటు, శిల్పకారుల స్థిరమైన అభివృద్ధికి ఈ ప్రదర్శన దోహదపడుతుందని వివరించారు.

పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, హస్తకళలు కేవలం సంప్రదాయం మాత్రమే కాదని, వేలాది కుటుంబాలకు జీవనోపాధి మార్గమని పేర్కొన్నారు. ఈ ప్రదర్శన ద్వారా కళాకారుల మార్కెట్ విస్తరించి వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. భరత్ టెక్స్ 2025లో ఆంధ్రప్రదేశ్ పావిలియన్ సందర్శకులకు అందుబాటులో ఉంటూ, నైపుణ్య కలిగిన శిల్పకారుల ప్రత్యక్ష ప్రదర్శనలు, రాష్ట్ర సంప్రదాయ వస్త్ర సంపదను పరిశీలన, ప్రామాణిక హస్తకళ వస్త్రాలను కొనుగోలు చేసే వీలును కల్పించనుంది.

రాష్ట్రంలోని వెంకటగిరి, మంగళగిరి, ధర్మవరం, ఉప్పాడ, కలంకారి వంటి ప్రసిద్ధ హస్తకళ వస్త్ర సంపదను ఇక్కడ ప్రదర్శిస్తుండగా, దేశీయ,అంతర్జాతీయ వేదికలపై ఆంధ్రప్రదేశ్ హస్తకళ కళాకారులకు గుర్తింపు కల్పించడం, మార్కెట్ అవకాశాలను పెంచడం ఈ ప్రదర్శన ముఖ్య లక్ష్యంగా ఉంది. కార్యక్రమంలో ఎంఎస్ ఎంఇ కార్పొరేషన్ సిఇఓ, లేపాక్షి ఎండి ఎం. విశ్వ, చేనేత జౌళి శాఖ అదనపు సంచాలకులు శ్రీకాంత్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక వ్యవస్థలో అప్పులు కూడా భాగమే

- దేశ ఆదాయం లో 85 శాతం అప్పులు చేస్తున్న మీరా తెలంగాణ గురించి మాట్లాడేది?
- సీతారామన్‌కు సలహాదారులు ఆకాశం లో ఉన్నట్టున్నారు
- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

**హైదరాబాద్:** దేశంలో ఎనిమిది సార్లు ఓ మహిళగా బడ్జెట్ ప్రవేశ పెట్టిన సీతారామన్ అంటే గౌరవం ఉంది. తెలంగాణ ఆర్థిక పరిస్థితులపై సీతారామన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. ఆర్థిక వ్యవస్థలో అప్పులు కూడా భాగమే. దేశ ఆదాయం లో 85 శాతం అప్పులు చేస్తున్న మీరా తెలంగాణ గురించి మాట్లాడేది?

గతం లో 46 శాతం అప్పులే ఉండేవి. తెలంగాణ ఆదాయంలో 26 శాతం అప్పులే ఉన్నాయి. దేశం లో 19 ప్రధాన రాష్ట్రాల కన్నా తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగుంది. ప్రపంచం లో అగ్రరాజ్యాలు గా



చెప్పుకునే దేశాల్లో అప్పులు ఎలా ఉన్నాయో సీతారామన్ కు తెలియదా? తెలంగాణ తలసరి ఆదాయం దేశం లోనే ఎక్కువ ఉన్న సంగతి సీతారామన్ కు తెలియదా ?

తెలంగాణకు చేసిన చిన్న చిన్న పనుల గురించి సీతారామన్ గొప్పగా చెప్పుకుంటున్నారు. రాష్ట్రాలకు ఇచ్చే నిధులు తక్కువ చేశారు. ఇదేనా సీతారామన్ చేసిన గొప్పా?

రాష్ట్రపతి ప్రసంగంలో పక్క రాష్ట్రం గురించి మాట్లాడి తెలంగాణ ను విస్మరించారు. బడ్జెట్ లో బీహార్ గురించే చెప్పారు .తెలంగాణ గురించి ఒక్క మాటయినా చెప్పారా? పార్లమెంటు చేసిన పునర్విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలు పది సంవత్సరాలుగా విస్మరిం చిన సీతారామన్, తెలంగాణ అభివృద్ధిని తక్కువ చేసి మాట్లాడటం సిగ్గు చేటు సీతారామన్‌కు సలహాదారులు ఆకాశం లో ఉన్నట్టున్నారు .అందుకే తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు. సీతారామన్ రాజ కీయాలు చేస్తే మేము కూడా రాజకీయాలు చేస్తాం. తెలంగాణపై విషం చిమ్మే మాటలు సీతారామన్ ఇప్పటికైనా మానుకోవాలి.

జనం గుండె చప్పుడు
07
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 15, ఫిబ్రవరి 2025 ‖

# మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా..

- మంత్రి నారాయణ హామీ

**అమరావతి, మహానాడు:** ఏపీ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డెయిరీని మంత్రి నారాయణ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి నాయుడు బాబు మున్సిపాలిటీల్లో పాలన పటిష్ఠం చేసేలా 176 పోస్టులు కొత్తగా భర్తీ చేయడంపై మంత్రికు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో మున్సిపల్ ఉద్యోగుల సేవలు చాలా కీలకమైనవి.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మున్సిపల్ శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని గుర్తు చేశారు. ఇంకా, మంత్రి ఏమన్నారంటే.. ఉద్యోగులు ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలి.



మున్సిపల్ ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాను.



## గౌతమికి అండగా ఉంటాం...

- మంత్రి నారా లోకేష్

**అమరావతి, మహానాడు:** అన్నమయ్య జిల్లా, గుర్రంకొండ మండలం, ప్యారంపల్లెకు చెందిన గౌతమి(23)పై యాసిడ్ దాడి ఘటన నన్ను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఆ సోదరికి మెరుగైన వైద్య సాయం అందించి అండగా నిలుస్తాం. గౌతమిపై అత్యంత అమానవీయంగా వ్యవహరించిన సైకోని కఠినంగా శిక్షిస్తాం. భవిష్యత్ లో మరో చెల్లిపై ఇటువంటి ఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరుతున్నాను అని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## అలిపిరి నడకమార్గంలో చిరుత సంచారం

**తిరుమల, మహానాడు:** అలిపిరి నడకమార్గంలో చిరుత పులి సంచరించింది. ఏడో మలుపు వద్ద నడకదారి భక్తులకు చిరుత కనిపించింది. దీంతో భక్తులు



భయంతో పరుగులు తీశారు. చిరుత ఆనవాళ్లను గుర్తించే పనిలో అటవీశాఖ అధికారులు ఉన్నారు. చిరుత కదలికల పట్ల భక్తులను టీటీడీ అప్రమత్తం చేసింది.

## దామోదరం సంజీవయ్య ఆశయ సాధనకు కృషిచేద్దాం

**అమరావతి, మహానాడు:**
మాజీ ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళి అర్పిస్తున్నాను. బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రిగా ఆయన ఖ్యాతికెక్కారు.



తన పదవీ కాలంలో అనేక విప్లవాత్మక పథకాలతో ప్రజల అభ్యున్నతికి విశేషంగా కృషిచేశారు. నమ్మిన విలువలకు జీవితాంతం కట్టుబడిన వ్యక్తి దామోదరం సంజీవయ్య. ఆయన జయంతి వేడుకలను కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. దామోదరం సంజీవయ్య ఆశయ సాధనకు కృషిచేద్దామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు.


## యాసిడ్ బాధితురాలి తండ్రికి మంత్రి లోకేష్ ఫోన్

- అన్ని విధాల అండగా ఉంటామని భరోసా

**అమరావతి, మహానాడు:**
అన్నమయ్య జిల్లా, గుర్రంకొండ మండలం ప్యారంపల్లెకు చెందిన యాసిడ్ బాధితురాలు తండ్రి జనార్దన్ తో శుక్రవారం మంత్రి లోకేష్ ఫోన్ చేసి ఆమె ఆరోగ్యంపై వాకబు చేశారు. చెల్లి కోలుకోవడానికి అత్యంత మెరుగైన వైద్యం అందిస్తాం. ఆమెను నా సొంత చెల్లిగా భావించి అండగా నిలుస్తా. యాసిడ్ దాడి ఘటన నన్ను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. దాడిచేసిన ఉన్మాదిని కఠినంగా శిక్షిస్తాం, అలాంటి సైకోలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం. అధైర్య పడొద్దు, మీ వెంట నేనున్నానని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు. అక్కడే ఉన్న మంత్రి మండుపల్లి రాంప్రసాద్‌తో మాట్లాడిన లోకేష్... గౌతమి కోలుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోండి. ఆమె వైద్యానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించాల్సిందిగా సూచించారు.

## శ్రీశైలానికి 24 గంటలూ అనుమతి

**శ్రీశైలం, మహానాడు:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వేళ శ్రీశైలానికి ఈ నెల 19 నుంచి మార్చి ఒకటోతేదీ వరకు అటవీ శాఖ చెక్ పోస్టులో 24 గంటలూ అనుమతించనున్నారు. పాదయాత్రగా వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు శ్రీశైలం సబ్ డీఎఫ్‌వో అబ్దుల్ రవూఫ్ చెప్పారు. అటవీ ప్రాంతంలోకి 2-5ఎల్ వాటర్ బాటిల్స్ తీసుకెళ్లొచ్చని, చెత్తకుండీల్లోనే ప్లాస్టిక్ వ్యర్థాలు వేయాలని సూచించారు. సాధారణ రోజుల్లో రాత్రి తొమ్మిది గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు శ్రీశైలానికి రోడ్డు మార్గంలో అనుమతించరు.



# సత్యవర్ధన్ కిడ్నాప్ వంశీ అరాచకానికి పరాకాష్ఠ!

- హత్య చేసేందుకు యత్నించాడు
- టీడీపీ అన్యాయం చేయలేదు... ఆ సంగతి వల్లభనేనికీ తెలుసు
- తల్లిలాంటి ఆఫీసుపై దాడికి పాల్పడ్డాడు
- తాడేపల్లి సైకో ఆనందం కోసమే అల్లర్లు
- మాజీ మంత్రి కేఎస్ జవహర్ ఆరోపణ

**మంగళగిరి, మహానాడు:** తాడేపల్లిలోని తన సైకో బాస్‌ని సంతృప్తి పరచడానికే వల్లభనేని వంశీ గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి చేశారని మాజీ మంత్రి కేఎస్ జవహర్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఇక్కడి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. వంశీకి నాన్ బెయిలబుల్ గా జైల్లో ఉంచాలి. బయటకు వదిలితే సమాజానికి మంచిదికాదు. అల్పబుద్ధివారికి అధికారమిస్తే పరిపాలన ఇలాగే ఉంటుంది. చెప్పు తినెడి కుక్క చెరుకు తీపి ఎరగనట్లు వల్లభనేని వంశీ కి అవినీతి, అక్రమాలే తెలుసుగానీ, నీతి, నియమాలు తెలియవు అని జవహర్ విమర్శించారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే.. చెడ్డవారికి అధికారం ఇస్తే పరిపాలన ఏ విధంగా ఉంటుందో వల్లభనేని వంశీయే సాక్ష్యం.

వల్లభనేని వంశీ తెలుగుదేశం పార్టీ నుండి వైసీపీలోకి వెళ్లినప్పటికి వంశీలోని తెలుగుదేశం భావాజాలాన్ని జగన్ రూపుమాపేశాడు. వంశీ కులం, గుణం గల వ్యక్తి కాదు. ఇలాంటి వారి వల్లే కులానికి కూడా చెడ్డపేరు వస్తుంది. వంశీ చేయని అరాచకం లేదు. చేయని కబ్జా లేదు, చేయని నేరం లేదు. వంశీ అధికారంలో ఉన్నప్పుడు అతని బాడీ లాంగ్వేజ్ కూడా ఒక రౌడీని తలపిస్తుంది.



సత్యవర్ధన్ విషయంలోనే కాక వంశీ అరాచకాలు అనేకం ఉన్నాయి. అతని ప్రవర్తన, వ్యవహారశైలిని గమనిస్తే అతనిపై అనేక కేసులు పెట్టాల్సి వస్తుంది. నేరస్తుడు ఏదో ఒక చిన్న సాక్ష్యాన్నైనా వదిలి వెళ్తాడనడానికి సత్యవర్ధన్ పై వంశీ దాడి చేసి వెళ్లడమే ఉదాహరణ. సత్యవర్ధన్ అనే వ్యక్తి 'తెలుగు' బిడ్డ. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తుంటే వంశీ అతనిపై అనేక మంది చేత దాడి చేయించాడు. కార్లు, కంప్యూటర్లు ధ్వంసం చేశాడు. విధ్వంసాన్ని సృష్టించాడు. ఇంతటి విధ్వంసం సృష్టించాల్సిన అవసరం వంశీకి రావడానికి కారణం తాడేపల్లిలోని తన సైకో బాస్ ని సంతృప్తి చేసేందుకే.

గన్నవరంలో తెలుగుదేశం గానీ, తెలుగుదేశం పార్టీ శ్రేణులుగానీ ఏరోజు ఎవరికీ అన్యాయం చేయలేదు. వంశీ ముఖం చూసి ఆయనకు ఎవరూ ఓట్లేయలేదు. తెలుగుదేశం పార్టీ మేండేట్ ని బేస్ చేసుకొని వంశీని గెలిపించారు. తెలుగుదేశం అతనికి అన్యాయం చేయలేదని వంశీకి కూడా తెలుసు. గన్నవరం పార్టీ ఆఫీసుపై దాడి చేయడానికి కారణం జగన్ మెప్పు కోసమే. వంశీకి ఎటువంటి అన్యాయం చేయని తల్లిలాంటి తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి చేసింది జగన్ ను సంతోషపెట్టడానికే. ఆ దాడిలో కేసులు పెట్టాక తప్పించుకోవడానికి అక్కడ కంప్యూటర్ ఆపరేటర్ గా ఉన్న సత్యవర్ధన్ ఒక దళితుడు. ఏమీ చేయలేనివాడు, అసక్తుడు. అలాంటి వ్యక్తిని కిడ్నాప్ చేసి, బలవంతంగా బెదిరించి ఎస్సీ, ఎస్టీ కోర్టు వద్దకు వచ్చి కేసు విత్ డ్రా చేసుకున్నారు.

వంశీ నేర ప్రవృత్తి కలవాడు. సత్యవర్ధన్ ని కాపాడుకుంటారని వంశీకి తెలుసు. అయినా నక్కజిత్తులు ప్రదర్శించాడు. అంబేద్కర్ పెట్టిన భిక్ష వల్ల దళితులు అమాయకులైనా, వారి వద్ద ఏ శక్తులు లేకున్నా వాళ్లకు రక్షణ కవచంలా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఉంది. గన్నవరం నియోజకవర్గం తన సంస్థానమనుకున్నాడు. జగన్ రాష్ట్రాన్ని దోచుకుంటే... వల్లభనేని వంశీ గన్నవరాన్ని దోచుకున్నాడు. విమానాశ్రయ భూముల్ని కూడా వదలలేదు. గన్నవరం ప్రాంతంలో అపార్టుమెంట్స్ కట్టిన వారు ఇద్దరి మధ్య గొడవలు సృష్టించి వారి ద్వారా లబ్ది పొందే రకం. సెటిల్ మెంట్ లు చేయడంలో వంశీ దిట్ట.

ఇంత పెద్ద వ్యక్తిగా, నిర్మాతగా, వందల కోట్లు ఎలా సంపాదించాడు? ఈ విషయం గన్నవరం చుట్టపక్కల ప్రజలందరికీ తెలుసు. జగన్.. వంశీకి పూర్తి అధికారాలిచ్చి వదిలేయడంతో విచ్చలవిడిగా వ్యవహరించాడు. వంశీ దూకుడుకి అడ్డుకట్ట వేయాలి. వంశీని అరెస్టు చేయడం సమర్థనీయం. అతను చేసిన సత్యవర్ధన్ కిడ్నాప్ అతని అరాచకానికి నిదర్శనం.

ఒక దళితుడిని కిడ్నాప్ చేసి హత్య చేయడానికి ప్రయత్నించాడు. అలాంటి వ్యక్తిపై అత్యాచారయత్నం కేసు నమోదు చేయాలి. అతని పై సెక్షన్ 3 కేసు పెట్టాలని మాజీ మంత్రి కేఎస్ జవహర్ డిమాండ్ చేశారు.

# భూ సమస్యను పట్టించుకోని రెవెన్యూ అధికారులు

- గ్రీవెన్స్‌లో బాధితురాలి ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించి, పరిష్కారానికి కృషి చేసిన మాజీ మంత్రి కేఎస్ జవహర్

**మంగళగిరి, మహానాడు:** ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. బాధితులు తరలి వచ్చిన అర్జీలు ఇచ్చారు. మాజీ మంత్రి కేఎస్ జవహర్ అర్జీలు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

- అనంతపురం జిల్లా, గుంతకల్ కు చెందిన రాఘవేంద్రాయుడు గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేస్తూ.. తన తండ్రి మరణాంతరం తనకు, తన తమ్ముడికి సమానంగా రావాల్సిన వాటాను తన తమ్ముడే ఆక్రమించుకొని తనను ఇబ్బంది పెడుతున్నాడని.. దయ చేసి



తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

- అదే జిల్లా, దేవుని ఉప్పలపాడు గ్రామానికి చెందిన నారమ్మ విజ్ఞప్తి చేస్తూ.. తాము గత 40 ఏళ్ళుగా సాగు చేసుకుంటున్న భూమిని అధికారులు ఆన్ లైన్ చేయమంటే చేయకుండా హోల్డ్



లో పెట్టారని దయ చేసి తాము సాగు చేసుకుంటున్న భూమిని తమ పేరుమీద ఆన్ లైన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

- తూర్పు గోదావరి జిల్లా, చాగల్లు మండలం, మల్లవరం గ్రామానికి చెందిన పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తూ.. గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం భూమిలో కొనసాగుతున్న 20 మంది లబ్ధిదారులకు 1935 లో రైతు వారి భూములుగా కన్వెర్షన్ చేస్తూ రిజిస్టర్ లో మార్పు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుల కొనసాగించేలా నిషేధిత జాబితా నుండి ఆ భూమిని దేవాదాయ శాఖచే తగ్గించి తమకు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం అందజేయాలని వారు విజ్ఞప్తి చేశారు.
- అనంతపురం జిల్లా, గొర్లదిన్నె మండాలనికి చెందిన లోకేశ్వర్ నాయడు విజ్ఞప్తి చేస్తూ.. తాను ఏపీఎంఎస్ఐడీసీ లో వర్క్ చేసి మూడేళ్ళు దాటినా తాను చేసిన పనికి డబ్బులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని.. దయ చేసి తనకు రావాల్సిన బకాయిలు ఇప్పించి ఆదుకోవాలని అతను విజ్ఞప్తి చేశారు.
- నంద్యాల జిల్లా, వెలుగోడుకు చెందిన దువ్వాసి వసంత కుమారి విజ్ఞప్తి చేస్తూ.. తాను ఎస్సీ మాల కులానికి చెందిన దానని తనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని.. తన కుటుంబ పోషణ నిమిత్తం కేజీబీవీలో నైట్ వాచ్ మెన్ ఉద్యోగం ఇచ్చి తనకు సాయం చేయాలని ఆమె గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- అనంతపురం జిల్లా, అనంతపురం మండలం మన్నీల గ్రామానికి చెందిన ముండ్లపాటి కుమారస్వామి విజ్ఞప్తి చేస్తూ.. తమకు వారసత్వంగా వచ్చిన భూమికిలోకి దారిలేదంటూ పై చేలవారు



తమను బెదిరిస్తున్నారని.. దయ చేసి పూర్వం నుండి ఉన్న రహదారిని యథావిధిగా కొనసాగేలా అధికారులు సర్వే చేసి తమకు రహదారి సమస్య లేకుండా చూడాలని కోరారు.

- గుంటూరు 10వ లైనుకు చెందిన పెరికల లక్ష్మీ విజ్ఞప్తి చేస్తూ.. తమ ఇంట్లో నాలుగు శౌరీల బంగారం రెండు లక్షలు డబ్బులు పోయాయని.. తన భర్తకు వైద్యానికి దాచుకున్న డబ్బులను దొంగలు కొట్టేశారని.. దీనిపై త్వరగా విచారించి దొంగలను పట్టుకుని డబ్బులు తీరిగి ఇప్పించవలసిందిగా.. ఆమె గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి వేడుకుంది.

# వంశీ నాలుకను బయటకు లాగి కోసేయాలి

- ఆడబిడ్డలపై నీచంగా మాట్లాడిన వంశీకి కఠిన శిక్షలు పడాలి
- నా క్యారెక్టర్ గురించి మాట్లాడే అర్హత రాంబాబుకు లేదు
- వంశీ జైలుకు వెళ్లడానికి జగనే కారణం..
- ఆ జగన్ వంశీని పరామర్శించకుండా బెంగళూరు వెళ్ళిపోయారు!
- ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఎద్దేవా

**మంగళగిరి, మహానాడు:**
ఆడబిడ్డలపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడిన వంశీకి కఠిన శిక్ష పడాలి. వంశీ మాట్లాడుతుంటే జగన్ పకపకా నవ్వారు. బలం ఉందని నాడు ఇష్టం వచ్చినట్టు రెచ్చిపోయారు. వంశీ జైలుకు వెళ్లడానికి కారణం జగనే .. మరి జగన్ వంశీని పరామర్శించకుండా బెంగళూరు ఎందుకు వెళ్లారు? ఇలాంటి వ్యక్తి అరెస్ట్ అయితే రాంబాబు అరుస్తున్నారు. అసలు ఆ 'అరగంట, 'గంట' గురించి ఏంటో రాంబాబు ముందు ప్రజలకు చెప్పి తరువాత మాట్లాడాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఇక్కడ జరిగిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు.

వంశీ అరెస్ట్‌ను అక్రమం అని వైసీపీ నేతలు మాట్లాడటం సిగ్గుచేటు. వంశీ ఏ తప్పు చేయకుండా గన్నవరం టీడీపీ కార్యాలయం తగలబడుతుందా? మీరు అధికారంలో ఉండి నాడు మీ తప్పులను కప్పెట్టారు. అక్రమ అరెస్టులు, హౌస్ అరెస్టులు, అవసరమైతే చింతపల్లి ఫారెస్ట్ లోకి తీసుకెళ్లి ఎన్ కౌంటర్ చేస్తామని బెదిరించడంతో పాటు కొంతమందిని భూమి మీద లేకుండా చేసింది మీరే. ఇటువంటివి మీకే సాధ్యం. మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ ఆత్మహత్య చేసుకునే పరిస్థితిని తీసుకు వచ్చింది మీరు కాదా? ఎటువంటి తప్పు చేయకపోయినా ఆయన భూమి మీద లేకవపోవడానికి కారణం మీ వైసీపీ పార్టీ, జగన్ మోహన్ రెడ్డి కాదా? నేడు చేసిన తప్పునకు వంశీని అరెస్ట్ చేశారు. వంశీనే కాదు కొడాలితో పాటు అరాచక వ్యక్తులు అందరూ అరెస్ట్ అవుతారు. నేరం చేసిన వారు చట్టం ముందు తప్పించుకోలేరు. చట్టం అమలు అయ్యేందుకు కాస్త సమయం పట్టొచ్చేమో కాని శిక్ష తప్పదు. ఇలాంటివారందరు కటకటాలపాలు కాక తప్పదు.

రాత్రిపూట కామబాబు.. పగలుపూట రాంబాబు కు మంత్రి పదవి ఇచ్చి జగన్ ఇంకా దిగజార్చారు... ఇలాంటి వ్యక్తి వంశీ అరెస్ట్ పై మాట్లాడుతున్నాడు. క్యాసెక్, టీఎంసీ అంటే ఏంటో తెలియని వ్యక్తి ఇరిగేషన్ శాఖకు మంత్రిగా ఉండి పోలవరాన్ని పడుకోబెట్టి సర్వనాశనం చేశాడు. రాంబాబు గురించి చెప్పాలంటే మాటలు సరిపోవు. కోడెల శివప్రసాద్ ఆత్మహత్యలో రాంబాబు హెరాస్మెంట్ కూడా ఉంది. దీనిపై రాంబాబును అరెస్ట్ చేయాలి. పరోక్షంగా కోడెల చావుకు కారణం రాంబాబు, జగన్‌లే. మా మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు నాడు స్వయంగా డీజీపీని కలిసేందుకు వెళితే గేటు దాటి రానివ్వకుండా వెనక్కి పంపారు. డీజీపీ ఆఫీసు పక్కనే టీడీపీ కేంద్ర



కార్యాలయంలోకి చొరబడి కార్యాలయాన్ని ధ్వంసం చేసి ఆఫీసు సిబ్బందిపై దాడి చేస్తే... నాడు డీజీపీ ఎక్కడికి పోయారు. ఆ రోజు ముఖ్యమంత్రి ఎక్కడికిపోయారు. నిన్ను తిడుతుంటే నీకు రోసం వస్తుంటే.. మా కార్యాలయాలు.. మాపై దాడులు చేస్తుంటే మాకు కోపం రాదా?

మీరు మాత్రం సపరేట్‌గా ఉప్పుకారం తింటున్నారా? ప్రతిపక్ష హోదాలో చంద్రబాబు వెళుతుంటే రాళ్లు విసిరినా దానిపై నాడు డీజీపీ మాట్లాడుతూ భావ ప్రకటన స్వేచ్ఛ అంటూ తోసిపుచ్చాడు. ఇప్పుడు మీకు మీ నాయకులకు ఇబ్బంది వస్తే చీమ కుడుతుందే? బాధ కలుగుతుందే? నాపై ఏ తప్పు లేకుండా ఎస్సీ, ఎస్టీ కేసులు, 307 కేసులతో పాటు 67 రోజులు జైల్లో పెట్టారు. అన్యాయంగా చంద్రబాబుని స్కిల్ డవలప్ మెంట్ కేసులో 53 రోజులు జైల్లో పెట్టారు. దాని ఫలితమే నేడు వైసీపీకి 11 సీట్లు, సిగ్గులేకుండా అబ్బయ్య చౌదరిని ఇబ్బంది పెడుతున్నారంటూ.. రాంబాబు మాట్లాడుతున్నారు.. అసలు అబ్బయ్య గురించి రాంబాబుకు ఏమి తెలుసు. పేరుకే సాఫ్ట్ వేర్ మెంటాలిటీ అంతా హార్డ్ వేర్ అబ్బయ్యది. అలాంటి క్రిమినల్ ఉండనే ఉండదు. కొల్లేరు ప్రజలకు చెందిన ఆరు కోట్లను కొల్లగొట్టాడు. తన ఇంటి ముందు వంద రోజులుగా వంటావార్పుతో పేదలు కంచాలు కొడుతూ నిరసన చేస్తున్నారు.

ఇంకా సిగ్గులేకుండా మీరు మాట్లాడుతారా? అదే టీడీపీలో అయితే నా ఇంటి ముందు ఇలాంటి ఉద్యమం జరిగితే మా నాయకుడు నన్ను పిలిచి అడిగేవారు. నా తప్పు ఉంటే మందలించేవారు. వెంటనే సమస్యను పరిష్కరించమని చెప్పేవారు. జగన్ రెడ్డికి ఇవేం పట్టవు. దెందులూరులో ఏం జరుగుతుందో ఆయనకు తెలియదు.. శుభకార్యానికి వెళితే తనపై కేసుపెట్టారని నంగనాచి మాటలు మాట్లాడుతున్నాడు అబ్బయ్య. మేం శుభకార్యాలకు వెళ్లడంలేదా? ప్రజల్లో తిరగడంలేదా? ఎవరు తప్పు చేశారో పెళ్ళికి పిలిచిన వ్యక్తినే చెప్పమనండి... చెలమలశెట్టి రమేష్ గురించి చెబుతున్నారు? ఆయన్నే చెప్పమను ఎవరిది తప్పో? నాది తప్పు అని తేలితే నేను అసెంబ్లీకి రాజీనామా చేస్తా? గంట అరగంట అంటూ మాట్లాడే వ్యక్తివి.. నీకు ఎక్కడిది నా క్యారెక్టర్ గురించి మాట్లాడే అర్హత రాంబాబు! నువ్వు నాకేంటి సర్టిఫికేట్ ఇచ్చేది. గంట అరగంట గురించి నువ్వు ఎందుకు వివరణ ఇచ్చుకోలేదు. అది నువ్వు మాట్లాడిన మాటలేకదా?

డీజీపీ రిప్రజెంటేషన్ తీసుకొకుంటే తగలబెట్టి వెళ్తానంటున్నావ్ ఇది నువ్వు నేర్పిన సంస్కృతేగా. తప్పు చేసిన వారు ఎవరూ తప్పించుకోలేరు. దెందులూరు, గుడివాడ, బందర్ ఎక్కడ ఉన్నా ఎవరైనా శిక్ష తప్పదు. దళిత బిడ్డను చంపి డోర్ డెలివరి చేస్తే దిక్కు లేదు. మళ్లీ మమ్మల్నా మీరు ప్రశ్నించేది? వైసీపీ వారి తప్పు లేకుండా నా నియోజకవర్గంలో ఒక్క అక్రమ కేసు కూడా పెట్టలేదు. ఇదే కూటమి క్రమశిక్షణ. నన్ను ఇరికించాలని యత్నించి అబ్బయ్యనే ఇర్కున్నాడు.

కొల్లేరు డబ్బులు ఎగ్గొట్టాలన్న ప్లాన్ లో భాగంగా స్కెచ్ వేశాడు. కావాలని కారును పెళ్లిలో అడ్డంపెట్టి రచ్చచేశారు. అక్కడి సెక్యూరిటీ వారు మూడు సార్లు చెప్పినా కార్లను అడ్డం తియ్యలేదు. ఏమి తెలియకుండా నోరు ఉంది కదా అని రాంబాబు అంబోతులా అరిస్తే సరిపోదు. ప్రజా క్షేత్రంలో ప్రజలే నీ కోరలు పీకారు. నీ కొమ్ములను విరిచారు. ఇంకెందుకు రంకెలేస్తున్నావు. వైనాట్ 175 అన్నారు. ప్రజలే మీకు ఎక్కడ కాల్చి వాతలు పెట్టాలో అక్కడ కాల్చి వాతలు పెట్టారు. ఇంకా మాట్లాడటానికి సిగ్గనిపించడం లేదా? దెందులూరులో అబ్బయ్య చరిత్ర అంతా బయటకు తీస్తా వదిలిపెట్టను. చేసిన తప్పులు బయటకు వస్తుంటే.. ఈ అరాచక వ్యక్తులకు నేడు రెడ్ బుక్ గుర్తుకు వస్తోందని చింతమనేని అన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

08

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 15, ఫిబ్రవరి 2025 ||



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి..సంజీవయ్య చిత్రపటానికి నివాళులు అర్పించిన సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ లు పటేల్ రమేష్ రెడ్డి, మానాల మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యులు చారగొండ వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, తదితరులు



భారత క్రికెట్ యువ క్రీడాకారుడు అబ్దుల్ రషీద్ గుంటూరులో సుప్రసిద్ధ హజరత్ సయ్యద్ బాజీ షహిద్ అవులియా వారి దర్గాకు విచ్చేసి బాబావారి ఆశీస్సులు కోరారు. ఉజ్వల భవిష్యత్తు ఉండాలని వేడుకున్నారు..



## ప్రేమోన్మాది దాడిని ఖండించిన సీఎం చంద్రబాబు

- నిందితునిపై కఠిన చర్యలకు ఆదేశం

**అమరావతి, మహానాడు:** అన్నమయ్య జిల్లా, గుర్రంకొండ మండలం, పేరంపల్లి గ్రామంలో యువతిపై ప్రేమోన్మాది యాసిడ్ దాడిని సీఎం చంద్రబాబు ఖండించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధిత యువతికి, ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

## ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు

**నరసరావుపేట, మహానాడు:**
ఇక్కడి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన జరగబోయే కృష్ణ-గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా టీడీపీ జనసేన బీజేపీ కూటమి సమావేశం శుక్రవారం జరిగింది. నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ



అరవింద బాబు మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలుపును అందరు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని కోరారు. అందరూ సమన్వయంతో పనిచేయాలని నియోజకవర్గ కూటమి నేతలను కోరారు.

నరసరావుపేట నుండే ఆలపాటి రాజాకు గెలుపును అందించే విధంగా కార్యాచరణ రూపొందించుకొని ప్రతి ఒక్క ఓటర్ ను స్వయంగా కలవాలన్నారు. గత ప్రభుత్వ పాలనలో అప్పుల ఊబిగా మారిన రాష్టాన్ని కేవలం ఏడు నెలలలో కూటమి ప్రభుత్వం ఆదుకుందని ఓటర్లకు వివరించాలన్నారు.



నగరంలోని శివాజీపాలెం శివాజీ పార్కులో ఈ నెల 19న ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి మహోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమానికి విశాఖ తూర్పు నియోజకవర్గ శాసన సభ్యుడు వెలగపూడి రామకృష్ణ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ గున్న యోగచంద్ర వివేక్, శివకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

- మహానాడు, విశాఖపట్నం.

## 15న దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్

**ఒంగోలు, మహానాడు:**
కలెక్టరేట్లో పీజీఆర్ఎస్ హాల్‌లో ఈనెల 15వ తేదీన దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టుగా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ డైరెక్టర్



అర్చన ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, జిల్లాస్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో హాజరవుతారని, జిల్లాలోని దివ్యాంగులు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చున్నారు.

## జగన్ పాలనను ప్రశ్నిస్తే.. హత్యలు, గుండు గీయడాలు, తప్పుడు కేసులు!

- దళితుల మీద దాడిపై జగన్ రెడ్డి నోరు విప్పాలి
- వంశీ, కొడాలి అల్లర్లతోనే వైసీపీ పోయిందని ఆ పార్టీ నేతలే అంటున్నారు
- అరాచక నేతలు నేడు కటకటాలు లెక్కబెడుతున్నారు
- చంద్రబాబు పాలనలో చట్టం తన పని తాను చేసుకుపోతోంది
- దోషులు చట్టం నుండి తప్పించుకోలేరు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు హెచ్చరిక

**మంగళగిరి, మహానాడు:**
టీడీపీ కార్యాలయాలు మాకు దేవాలయం... అలాంటి దేవాలయంపై దాడి చేసినా నాటి ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. అంతేకాకుండా తిరిగి టీడీపీ నాయకులమీదే కేసులు పెట్టారు. నాటి ప్రభుత్వం ఒక జంగిల్ రాజా ప్రభుత్వం. ఒక దుర్మార్గ ప్రభుత్వమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేడు ప్రజా స్వామ్యం నడుస్తోంది. జన రాజ్యం నడుస్తోంది. చంద్రబాబు పాలనలో చట్టం తన పని తాను చేసుకుపోతోంది.



రాజకీయ ముసుగులో నేరస్తులు చలామణి అవ్వడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి వారి వలన ప్రజాస్వామ్యానికే విఘాతం. కనుక ఇలాంటి వారు ఊసలు లెక్కపెట్టే రోజు వస్తోంది. దీనికి ఉదాహరణే వంశీ అరెస్ట్. నా దళితులు.. నా దళితులు అంటూ మాట్లాడే జగన్ కి అసలు దళితులపై ప్రేమే లేదు. దళిత బిడ్డ అయిన సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేసి దారుణంగా కొట్టారు.

నాడు టీడీపీ కార్యాలయంపై చేసిన దాడిమీద పెట్టిన కేసును విత్ డ్రా చేసుకునేలా చేశారు. ఇది అంతా క్లియర్ గా కనిపిస్తోంది. నాటి అరాచక పాలనలో నడిచినట్లే నేడు కూడా వైసీపీ నేతలు కొంతమంది నడుస్తున్నారు. అలాంటి వారికి కూడా త్వరలోనే గుణపాఠం చెబుతాం.

అధికారంలో ఉన్నా లేకున్నా వీరి తీరు మారడంలేదు. డాక్టర్ సుధాకర్ ను హింసించి చంపారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేశారు. ఓం ప్రతాప్ నాణ్యతలేని లిక్కర్ పై ప్రశ్నిస్తే దారుణంగా హత్య చేశారు. ఇసుక అక్రమాలపై శివప్రసాద్ ప్రశ్నిస్తే అతనికి గుండు గీశారు. దళితుల మీద వైసీపీ నేతల దమనకాండపై జగన్ రెడ్డి సమాధానం చెప్పాలి.

వల్లభనేని వంశీ, కొడాలి నాని లాంటి నేతలను పెట్టుకుని రాష్ట్రంలో అరాచకాన్ని సృష్టించడంతోనే వైసీపీ పోయిందని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. నేడు ప్రజాపాలన నడుస్తోంది. ప్రజా పాలనలో గూండాలు, రౌడీలకు తావులేదు. నేరస్తులందరూ జైలుకు పోక తప్పదు. నాడు లా అండర్ ఆర్డర్ ను గాలికి వదిలిపెట్టి ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడమే లక్ష్యంగా పాలన సాగించారు. నేడు నేర చరిత్ర కలిగిన వారు మాత్రమే జైళ్లకు వెళుతున్నారు.

## జగన్ రెడ్డి.. వంశీని వెనకేసుకొస్తున్నావ్ సిగ్గుందా?

- అరాచకాలే వైఎస్ జగన్ బ్రాండ్!
- వంశీని వెనకేసుకొస్తున్నావ్ సిగ్గుందా..?
- దళితులు, మహిళలపై అనుచితంగా ప్రవర్తించే వంశీనే మీకు ఎక్కువ జగన్
- రౌడీలు, గుండాలు, గంజాయి, డ్రగ్స్ వంటివి ప్రోత్సహించడం మీ బ్రాండ్
- అరాచకాలను అంతమందించడమే చంద్రబాబు బ్రాండ్
- చట్ట ప్రకారమే వల్లభనేని వంశీ అరెస్ట్
- రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా పక్కగా అమలవుతోంది
- నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**మంగళగిరి, మహానాడు:**
వల్లభనేని వంశీ అరాచకత్వం, రౌడీయిజాన్ని జగన్ రెడ్డి ఖండించక పోగా... వంశీని పొగడటం చూస్తే దొంగే ఇంకొక దొంగను ఆదరించినట్టుగా ఉంది. ఒక అరాచక వాదిని ఇంకొక అరాచక వాది కౌగిలించుకునే పరిస్థితి జగన్ మాటల్లో కనిపిస్తోందని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఈ మేరకు ఆయన మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇలాంటి విష సంస్కృతి కలిగిన జగన్ రెడ్డి పాలనలో అంబేద్కర్ రాజ్యాంగం కాదు కదా రాజారెడ్డి రాజ్యాంగాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేశారని ఆరోపించారు. ఇంకా, మంత్రి ఏమన్నారంటే.. సాక్షుల గురించి మీరు మాట్లాడుతున్నారు. సాక్షుల్ని బెదిరించడం, సాక్షులు చెప్పిన దాన్ని తారుమారు చేయడం.. నేరాన్ని ఎదుటి వారి మీద వేయడం మీ గుణం. ఈ గుణం ఈరోజు కాదు గతం నుంచి కూడా చూస్తూ ఉన్నాం జగన్మోహన్ రెడ్డి. మీ కేసుల్లో కూడా ఈ రకమైన పరిస్థితినే చూస్తాం. బెదిరించడం లేదా?



సాక్షుల్ని చంపడం. ఇవన్నీ జగన్మోహన్ రెడ్డి కేసుల్లో కూడా జరుగుతున్న పరిస్థితి. నేరం చేసి ఆ నేరం నుండి తప్పించుకోవడానికి ఇంకొక నేరం చేసిన వల్లభనేని వంశీ విధానాన్ని ఖండించడం మాని... మరీ అతనికి వత్తాసు పలుకుతుంటే రాష్ట్ర ప్రజలందరూ కూడా అసహ్యించుకునేటువంటి పరిస్థితి ఏర్పడింది. జగన్మోహన్ రెడ్డిని సూటిగా అడుగుతున్నాం. ఎవరైతే ఆ రోజు టీడీపీ ఆఫీస్ మీద దాడి చేశారో, ఆ రోజు పార్టీ కార్యాలయంలోని దళిత బిడ్డను చంపుతానని బెదిరించి... వంశీ కారులోనే కోర్టు దగ్గరికి తీసుకొచ్చి దొంగ సాక్ష్యం చెప్పడం ఎంతవరకు సమర్థనీయమో జగన్మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలి.

ఒక దళిత బిడ్డను కిడ్నాప్ చేసి విశాఖపట్టణంలో వంశీ ఆధీనంలో పెట్టుకుంటే ఎందుకు ఖండించలేకపోతున్నావో జగన్మోహన్ రెడ్డి సమాధానం చెప్పవలసిన అవసరం ఉంది. వంశీని వెనుకేసుకొస్తున్నటువంటి జగన్ వాస్తవాన్ని ఎందుకు గ్రహించలేకపోయారు. ఆ రోజు తెలుగుదేశం పార్టీ ఆఫీస్ అంటే ఒక పార్టీకి దేవాలయం లాంటిది. అటువంటి పార్టీ కార్యాలయం కూడా ఎక్కడో మారుమూల అడవుల్లో లేదు నేషనల్ హైవేకి పక్కనే ఉంది. తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆ రోజు వంశీ, వంశీ అనుచరులు తగలబెట్టిన మాట వాస్తవం కాదా అనేది ఇవాళ జగన్మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలి.

రాక్షస పాలనలో టిడిపి ఆఫీసు మీద, ఆఫీసులో పనిచేసిన సిబ్బంది మీద, ఆఫీసు వెలుపల ఉన్న వాహనాలను ధ్వంసం చేసిన మాట వాస్తవమా కాదా అనేది. జగన్మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలి. ఆ రోజు దాడి సంఘటన తెలుసుకొని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకుంటే... వాళ్ల మీద మీ గుండాలు, మీ రౌడీలతో రాళ్ల దాడి చేసిన మాట వాస్తవమా కాదా? ఎవరైతే బాధితులు ఉన్నారో వారు పెట్టిన కేసులను మీరు తీసుకోకుండా.... ఆ బాధితుల మీదే ఎదురు కేసులు పెట్టారు. ఆ రోజు కూడా ఒక మహిళను అరెస్టు చేయడానికి ఇంటికి పోతే కనీసం బట్టలు మార్చుకోవడానికి కూడా అవకాశం ఇవ్వకుండా వ్యవహరించారని ఆరోపించారు.

రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా నడుస్తోందని, అవినీతితో దేశాన్ని వదిలి విజయ్ మాల్యా పారిపోయిన పరిస్థితిని చూశాం. కానీ దురదృష్టం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లక్షల కోట్ల అవినీతి సొమ్ముని సంపాదించిన జగన్ రెడ్డి... ఆ సొమ్ముతో పార్టీ పెట్టి మరి ఇక్కడ రాష్ట్రంలో అరాచకాలు సృష్టించడం దురదృష్టకరం. అటువంటి జగన్ నైజాన్ని ప్రజలందరూ గమనించాలని కోరుతున్నా... కచ్చితంగా చట్ట ప్రకారమే ప్రభుత్వం పని చేస్తుంది.

## ఏపీ... క్రీడాంధ్రప్రదేశ్ సాకారం దిశగా అడుగులు..

- కేంద్రం నుంచి మరింత సాయం అవసరం
- కేంద్ర మంత్రిని కోరిన ఏపీ క్రీడా మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**న్యూఢిల్లీ:** సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో క్రీడాంధ్రప్రదేశ్ సాకారం దిశగా అడుగులు వేస్తున్నామని, ఇప్పటికే అత్యుత్తమ నూతన క్రీడా పాలసీ, క్రీడా యాప్ ఆవిష్కరణ వంటి అంశాలు కూటమి ప్రభుత్వం హయంలో జరిగాయని మంత్రి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర కార్మిక, ఉపాధి, క్రీడ, యువజన సర్వీసుల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు తెలిపారు. రాష్ట్రంలో నూతనంగా నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా సెంటర్, జిల్లా స్థాయిలో ఖేలో ఇండియా కేంద్రాలు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి రాంప్రసాద్ రెడ్డి వినతి పత్రం సమర్పించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా శుక్రవారం ఢిల్లీకి వెళ్లిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యవజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి.. మాండవీయను కలిసి, సత్కరించారు. అనంతరం యువతకు కావాల్సిన మౌలిక సదుపాయాలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారాలు అందించాలని కోరారు.

రాష్ట్రంలో క్రీడా సముదాయం ఏర్పాటు ద్వారా, "మల్టీపర్పస్ హాల్, అథ్లెటిక్స్ ట్రాక్, ఫుట్‌బాల్ ఫీల్డ్, స్విమ్మింగ్ పూల్" వంటి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో చాలా పట్టణాలు/నగరాలలో ప్రాథమిక క్రీడా మౌలిక సదుపాయాలు లేవని, ఈ నేపథ్యంలో మంత్రి కేంద్ర ప్రభుత్వానికి కొన్ని ప్రతిపాదనలు సమర్పించారు. రాష్ట్రంలో అన్ని నగరాలలో క్రీడ మౌలిక సదుపాయాల నిర్మాణానికి 280.9 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించాలని, రాయచోటిలో క్రీడా సముదాయ నిర్మాణం కోసం కేంద్రం నుండి 42.62 కోట్ల రూపాయల ప్రాజెక్టు కు సహకారం అందించాలని, రాయచోటిలో జిల్లా స్థాయి ఖేలో



ఇండియా హాకీ కేంద్రాన్ని ఏర్పాటుకు చేసి రాయచోటి లో క్రీడా సముదాయ నిర్మాణానికి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

అదేవిధంగా రాష్ట్రంలో నూతనంగా నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా సెంటర్, జిల్లా స్థాయిలో ఖేలో ఇండియా కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఢిల్లీలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) కార్యాలయంలో కేంద్ర మంత్రికి మంత్రి రాంప్రసాద్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి ఆంధ్రప్రదేశ్ కు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని, ఏప్రిల్ నెలలో ఏపీలో



పర్యటించనున్నట్టు కేంద్ర మంత్రి తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇ-స్పోర్ట్స్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం నుండి సహాయాన్ని మంత్రి రాంప్రసాద్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో స్థిరమైన ఇ - స్పోర్ట్స్ వ్యవస్థను నెలకొల్పడానికి రాబోయే నాలుగేళ్ళలో కేంద్ర ప్రభుత్వం నుండి ?255 కోట్లు ఆర్థిక సహాయం అందించాలని మంత్రి కోరారు. క్రీడల జాబితాలో ఇ-స్పోర్ట్స్ చేరిందని, ఇ స్పోర్ట్స్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహకాలు అందుతున్నాయని తెలిపారు.

## తులసిబాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ!

- బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్

**అమరావతి:** ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగం కేసులో కామేపల్లి తులసిబాబుకు ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తులిసిబాబు బెయిల్ పిటిషన్‌ను ధర్మాసనం డిస్మిస్ చేసింది. ఈ కేసులో కీలక నిందితులు అరెస్ట్ కావాల్సి ఉండటంతో బెయిల్ ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ ఇరవై రోజుల కిందట తులసిబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, జిల్లా కోర్టులో కాకుండా హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం విచారణకు రాగా.. ఈ కేసులో కీలక నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉన్నందున బెయిల్ ఇవ్వలేమని హైకోర్టు అభిప్రాయపడింది. మరికొంతమంది కీలక నిందితులు కూడా అరెస్ట్ కావాల్సి ఉంది. ఇందులో అప్పటి ఇంటలిజెన్స్ ఉన్నతాధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుతో పాటు అప్పటి సీఐడీ డీజీ పీవీ సునీల్ కుమార్, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా నిందితులుగా ఉన్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయిన విజయ్ పాల్‌కు మాత్రం జిల్లా కోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. అంతుకు ముందు విజయ్ పాల్‌కు కూడా జిల్లా కోర్టు, హైకోర్టు, సుప్రీం కోర్టు కూడా బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఆయన మరలా జిల్లా కోర్టులో బెయిల్ కోసం పిటిషన్ వేయగా.. దాదాపు రెండు నెలల తర్వాత విజయ్ పాల్‌కు బెయిల్ మంజూరు అయ్యింది.

ప్రస్తుతం కీలక నిందితుడిగా ఉన్న తులసిబాబును కూడా ఒంగోలు పోలీసులు అరెస్ట్ చేశారు. ఒంగోలు ఎస్పీ ఇప్పటికే రెండు సార్లు విచారణ జరిపారు. ఈ విచారణలో ఆయన ఎటువంటి సహకారం అందించలేదని, అడిగిన ప్రశ్నలకు సమాధానం




చెప్పలేదని పోలీసులు పిటిషన్ ఫైల్ చేశారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా తులసిబాబును ఒంగోలు ఎస్పీ విచారించారు. అయినప్పటికీ ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, దర్యాప్తునకు సహకరించడం లేదని పోలీసులు పిటిషన్ ఫైల్ చేశారు. నాలుగు రోజుల క్రితమే తులసిబాబు బెయిల్ పిటిషన్‌పై వాదప్రతివాదనలు ముగియగా.. శుక్రవారం తులసిబాబు బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 15, ఫిబ్రవరి 2025 ||





పల్నాడు జిల్లా, తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన జరగబోయే కృష్ణ-గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్బంగా అందుబాటులో ఉన్న కూటమి నేతలు, టీచర్స్, లాయర్స్ తో శుక్రవారం సమావేశం జరిగింది. పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ నేతలకు ఎమ్మెల్సీ ఎన్నికల విధి విధాలను వివరించారు ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికలలో టీడీపీ జనసేన బీజేపీ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపును అందరు ఛాలెంజ్‌గా తీసుకొని సమన్వయంతో పనిచేయాలని నేతలను కోరారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్లారు. వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యలు విన్నవించుకునేందుకు వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. పలువురు దివ్యాంగులకు ఆర్థిక సాయం అందించారు. అనంతరం పార్టీ నేతలతో కాసేపు సమావేశమయ్యారు.











విశాఖపట్నంలోని అక్కయ్య పాలెం జంక్షన్ లోని ఒక ప్రైవేట్ హోటల్ లో శుక్రవారం ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ విశాఖ యూనిట్ కార్య వర్గ సమావేశం జరిగింది.



ముఖ్యమంత్రిని కలిసిన మాదిగ ఇంటలెక్చువల్ ఫోరం ప్రతినిధులు ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, ఓయూ వీసీ ప్రొఫెసర్. ఎం, కుమార్ , ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్. సి. కాశీం, ప్రొఫెసర్. గడ్డం మల్లేశం, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ,తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యుడు డాక్టర్ చారకొండ వెంకటేష్ .వర్గీకరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి రేవంత్ రెడ్డి చూపిన చొరవకు ధన్యవాదాలు తెలియజేసిన మాదిగ మేధావులు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సత్తెనపల్లి పట్టణంలోని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్, కాకతీయ కల్యాణ మండపంలో న్యాయవాదులతో సమావేశం జరిగింది. సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యుడు కన్నా లక్ష్మీ నారాయణ, పరిశీలకుడు వేములకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు. పట్టభద్రులు, గ్రాడ్యుయేట్స్, మేధావులు అందరూ మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటును కూటమి బలపరిచిన అలపాటి రాజాకి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు.




## మోదీ పాలనలో రక్షణ వ్యవస్థ పటిష్ఠం

◆ అమరులకు పురందేశ్వరి ఘన నివాళులు


విజయవాడ, మహానాడు: 41 మంది భారత మాత ముద్దు బిడ్డలు విధులు నిర్వహిస్తుండగా పొరుగు దేశం చేసిన ఉగ్రవాద దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. 2014 ముందు వరకు దేశంలోకి చొచ్చుకుని వచ్చి తలలు సైతం తీసుకు వెళ్లే పరిస్థితులు ఉండేవి. కానీ, మోదీ ప్రధాని అయిన తర్వాత దేశ రక్షణ కోసం, దేశ భద్రత కోసం ఉన్న సైనికుల కోసం అనేక విధి విధానాలను తీసుకొచ్చారని ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఇక్కడి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం అమరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉగ్రవాదుల దాడుల్లో 41మంది మరిణించిన అనంతరం పొరుగు దేశం భూభాగంలోకి సైనికులను పంపించారు. వీరులు అక్కడ ఉన్న ఉగ్ర స్థావరాలని ధ్వంసం చేసి తిరిగి దేశానికి క్షేమంగా తిరిగి వచ్చారని తెలిపారు.

దేశ సైనికుల మీదకు వస్తే భారత దేశం అంటే ఏంటో రుచి చూపించిన ప్రధాని.. మోదీ అని తెలిపారు. 2014 కి ముందు ఇలాంటి దాడులు జరిగితే చూస్తూ ఉండేవారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పరిపాలనలో రక్షణ వ్యవస్థ పటిష్ఠమైందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీ రాం, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీ శర్మ, బిజెపి నేతలు రవిచంద్ర రెడ్డి, మువ్వల వెంకట సుబ్బయ్య, పియూష్ దేశాయ్, మాజీ సైనికులు పాల్గొన్నారు.



అమరావతి మండలం ధరణికోట లోని ఆర్‌వీవీఎన్ కళాశాలలో లెక్చరర్లను శుక్రవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి ఓటు వేయాలని ఈ సందర్భంగా అభ్యర్థించారు.



దేశంలోని ఉత్తమ ముఖ్యమంత్రుల జాబితాలో నాలుగో స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుకి హృదయపూర్వక అభినందనలు. ప్రతిష్ఠాత్మక ఇండియా టుడే పత్రిక సర్వేలో చంద్రబాబు నాయుడు నాలుగో స్థానంలో నిలవడం గర్వకారణంగా ముందని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేవలం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే ఐదో స్థానం నుంచి ఆయన నాలుగో స్థానానికి చేరుకోవడం సంక్షేమం కోసం ఆయన పడుతున్న శ్రమ, ప్రగతి సాధించడానికి పట్టుదలతో పనిచేస్తున్న తీరుకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు.

## పిడుగురాళ్ల మున్సిపల్ ఉప ఎన్నికలో దౌర్జన్యాలు

◆ కౌన్సిలర్లను కిడ్నాప్ చేసి బెదిరిస్తున్నారు
◆ పార్టీ మారాలంటూ మున్సిపల్ చైర్మన్ పై వత్తిడి
◆ టీడీపీ నేతలు, పోలీసులు కలిసి అరాచకాలు
◆ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఫైర్

నర్సారావుపేట: పల్నాడు జిల్లా పిడుగురాళ్ళ మున్సిపాలిటీకి వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ పోలీసుల దన్నుతో అరాచకాలకు పాల్పడుతోందని వైయస్ఆర్ సీపీ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మండిపడ్డారు. నర్సారావుపేట శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ వైయస్ఆర్సీపీ కౌన్సిలర్లను కిడ్నాప్ చేయడం, బెదిరించడం ద్వారా ఈనెల 17న జరగబోయే ఉప ఎన్నికను అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాలను కాపాడాల్సిన పోలీసులే ఈ దౌర్జన్యకాండకు అండగా నిలుస్తున్నారని అన్నారు.

పిడుగురాళ్ళ మున్సిపాలిటీకి నాలుగేళ్ళ కిందట జరిగిన ఎన్నికల్లో ఉన్న మొత్తం 33 వార్డులను వైయస్ఆర్ సీపీ ఏకగ్రీవంగా గెలుచుకుంది. మున్సిపల్ చైర్మన్‌గా వైశ్య సామాజికవర్గంకు చెందిన సుబ్బారావు, వైస్ చైర్మన్‌గా దళిత సామాజిక వర్గంకు చెందిన ముక్కంటి, మైనార్టీల నుంచి జిలానీకి వైస్ చైర్మన్ పదవులను ఇచ్చాం. గత ఏడాది జనరల్ ఎలక్షన్స్ తరువాత వైస్ చైర్మన్ ముక్కంటి చనిపోవడంతో దానికి గానూ ఇప్పుడు ఉప ఎన్నిక జరగబోతోంది.

మొత్తం 33 మున్సిపల్ కౌన్సిలర్ స్థానాలకు గానూ అన్నింటినీ వైయస్ఆర్సీపీ గెలుచుకోగా, తాజాగా ఒకరు మాత్రం పార్టీని వీడి తెలుగుదేశంలో చేరారు. ప్రస్తుతం 32 మంది కౌన్సిలర్లు వైయస్ఆర్ సీపీకి ఉన్నారు. సంఖ్యాబలం చాలా స్పష్టంగా ఉండటంతో ఏకపక్షంగా ఉప ఎన్నికను తెలుగుదేశం కుట్రపూరితంగా అడ్డుకుంటోంది. వైస్ చైర్మన్ ఎన్నిక కోసం వెడుతున్న వైయస్ఆర్ సీపీ కౌన్సిలర్ లను పోలీసుల సహకారంతోనే కిడ్నాప్ చేసేందుకు



తెగబడ్డారు.

తెలుగుదేశం నేతల బెదిరింపులకు భయపడి పక్కనే ఉన్న మాచవరం గ్రామంలో తన తల్లి ఇంట్లో తలదాచుకున్న కౌన్సిలర్ ను టీడీపీ నాయకులు, పోలీసులు కిడ్నాప్ చేశారని ఒక కౌన్సిలర్ భార్య సోషల్ మీడియాలో వీడియో ద్వారా బయటపెట్టారు. తన భర్తకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు. అలాగే మరో కౌన్సిలర్ ఈ బాధ పడలేక హైదరాబాద్‌లో తలదాచుకుంటే, అయన సోదరులను పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టి మర్యాదగా పిడుగురాళ్ళకు వచ్చి, తాము చెప్పినట్లు నడుచుకోవాలంటూ బెదిరించారు.

గతంలో దర్శి, తాడిపత్రి మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మెజారిటీ వచ్చింది. ఆరోజు అధికారం ఉందని వైయస్ఆర్ సీపీ ప్రభుత్వం కూడా దౌర్జన్యాలకు పాల్పడితే ఆ రెండింటిలో కూడా వైయస్ఆర్ సీపీకే అధికారం దక్కేది కాదా? కానీ సీఎంగా ఉన్న వైయస్ జగన్ అటువంటి విధానాలకు మనం వ్యతిరేకం, ప్రజాతీర్పుకు గౌరవం ఇవ్వాలని స్పష్టంగా తన విధానాన్ని ప్రకటించారు. జేసీ ప్రభాకర్ రెడ్డి దానిని స్వయంగా అంగీకరించారు. వైయస్ జగన్ తలుచుకుంటే తాను మున్సిపల్ చైర్మన్ అయి ఉండేవాడిని కాదు అని ఒప్పుకున్నారు.

పిడుగురాళ్ళ మున్సిపల్ చైర్మన్ సుబ్బారావుకు చెందిన ఫ్యాక్టరీకి తెలుగుదేశం నేతలు తాళాలు వేశారు. నీ వ్యాపారాలు అడ్డుకుంటాం, పార్టీ మారాలంటూ బెదిరిస్తున్నారు. లేకపోతే అంతు చూస్తామని హెచ్చరిస్తున్నారు. ఇటీవల పిడుగురాళ్ళ మున్సిపల్ కౌన్సిలర్ ను టీడీపీ నేతలు కిడ్నాప్ చేసిన నేపథ్యంలో కోర్ట్ లో హెబియస్ కార్పస్ పిటీషన్ దాఖలు చేశాం. వెంటనే సదరు కౌన్సిలర్ ను వదిలిపెట్టారు. ఈ సందర్భంగా తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని చెప్పాలని లేకుండా తీవ్ర పరిణామాలు ఉంటాయని కూడా బెదిరించారు.

దెందులూరు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిపైనా టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దౌర్జన్యంకు పాల్పడ్డారు. తిరిగి అబ్బయ్య చౌదరిపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టడం చూస్తే ఇంత దుర్మార్గమైన పాలన మరెవరూ చేయలేరని అనిపిస్తోంది. తెలుగుదేశం చేస్తున్న ఈ దుర్మార్గాలను ప్రజలు గమనిస్తున్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు.


జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 15, ఫిబ్రవరి 2025


## సంఘసంస్కర్తగా సంత్ సేవాలాల్ మహారాజు సేవలు అసామాన్యం

**- సంత్ సేవాలాల్ 286వ జయంతిలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**



**అమరావతి:** సంత్ సేవాలాల్ 286వ జయంతి సందర్భంగా సేవా ఘాట్ లో పాల్గొనడం జరిగింది. జగదాంబ మాత సేవాలాల్ మహారాజ్ ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది. ఆనాడు 18 వ



శతాబ్దంలో ఆర్థికంగా సామాజికంగా సంఘసంస్కర్తగా మహారాజు చేసిన సేవలు అసమాన్యం. దేశంలో 10 కోట్ల మందికి పైగా జనాభా ఉన్న బంజర సోదర సోదరీమణులు కొలిచే దైవం సంత్ సేవాలాల్ మహారాజ్.

గత సంవత్సరం జరిగిన ఎన్నికల్లో ధర్మవరం నియోజకవర్గంలో 15 వేలకు మంది పైగా బంజారా సోదర సోదరీమణులు నన్ను ఈ రోజు ఈ స్థాయిలో నిలబెట్టారు. 2019 ముందు ఎన్డీఏ రాష్ట్ర ప్రభుత్వం జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రతి సంవత్సర 25 లక్షలు కేటాయించేవారు.

కానీ గత ప్రభుత్వంలో ఎవరు నిలదీయరు ఎవరు గుర్తించరు అని అనుకున్నారేమోగాని ఆ నిధులను పూర్తిగా ఆపేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో మళ్లీ తిరిగి 2024 లో రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతంలో ఇచ్చే 25 లక్షలకు పెంచి ప్రస్తుతం 50 లక్షలు అందించేందుకు జీఓ ను పాస్ చేశారు. ఈ కార్యక్రమంలో హంపి పీఠాధిపతి శ్రీశ్రీ విరూపాక్ష విద్యారన్య స్వామి , రాష్ట్ర అధ్యక్షులు జగన్నాధ రావు , గుంతకల్ ఎమ్మెల్యే జయరాం పాల్గొన్నారు.

# నిర్దేశిత సమయంలో నిర్మాణాలు పూర్తి చేయాలి

- **స్థల సేకరణ.. అనుమతులపై సీనియర్ అధికారులు దృష్టి సారించాలి**
- **కలెక్టర్లు క్షేత్ర స్థాయి పరిశీలనలు చేపట్టాలి**
- **యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మా ణాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఐసీసీసీలో విద్యా శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్ర వారం సమీక్ష నిర్వహించారు.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. కొడంగల్, మధిర, హుజూర్ నగర్ ల్లోని స్కూళ్ల నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, మార్చి 20వ తేదీన పనులు ప్రారం భిస్తామని అధికారులు తెలిపారు. మిగతా నియోజకవర్గాల్లో భూ సేకరణ, అనుమతుల ప్రక్రియను ఉమ్మడి జిల్లాలకు కేటాయించిన సీనియర్ అధికారులు చూడాలని సీఎం ఆదేశించారు.

నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు అను వుగా ఉండే ప్రదేశాన్ని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి ఎంచుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయి పర్యటన చేసి స్థలాల ఎంపికలో జాగ్రత్త వహించాలని సీఎం అన్నారు.


భూ సేకరణ, స్థలాల ఎంపిక ప్రతి రెండు రోజులకోకసారి సమీక్షించాలని, పది రోజుల్లోపే దీనిపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని సీఎం ఆదేశించారు. ఇప్పటికే స్థల సేకరణ పూర్తయిన నియోజకవర్గాల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**నిర్మాణాలు యూనివర్సిటీ స్థాయిలో ఉండాలి**

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయంలో బోధన, బోధనేతర అవసరాల కోసం చేపట్టే నిర్మాణాలు యూనివర్సిటీల స్థాయిలోనే ఉండాలని... ఈ విషయంలో ఏమాత్రం రాజీపడొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని గదులు, ల్యాబ్‌లు, ప్లేగ్రౌండ్, ఇతర నిర్మాణాలు చేపట్టాలని సీఎం అన్నారు. యూనివర్సిటీ నిర్మాణాలకు సంబంధించి నిధుల వ్యయానికి ప్రభుత్వం వెనుకాడదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

యూనివర్సిటీ ప్రాంగణంలోని చారిత్రక, పురాతన కట్టడాలను పరిరక్షించాలని, వాటికి అవసరమైన మరమ్మతుల విషయంలో పురా వస్తు శాఖ అధికారులతో చర్చించాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచిం చారు. నిర్మాణ ఆకృతులకు సంబంధించి పలు మార్పులను ముఖ్యమంత్రి సూచించారు.

సమీక్షలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఎంఆర్డీసీఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పి.గౌతమి, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ నరసింహారెడ్డి, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 15, ఫిబ్రవరి 2025 ‖



## మెగా పవర్‌స్టార్ కోసం ముగ్గురా?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఎంత బిజీ హీరో అన్నది చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుతం బుచ్చిబాబుతో తన 16వ సినిమా ఆన్ సెట్స్ లో ఉంది. ఇది పూర్తయిన వెంటనే సుకుమార్ తో 17వ సినిమా మొదలు పెడతాడు. ఈ రెండు సినిమాలు పూర్తి చేసి రిలీజ్ అవ్వడనికి



ఎలా లేదన్నా? మూడేళ్లకు పైగా సమయం పడుతుంది. అయినా చరణ్ కోసం క్యూలో ఉన్న దర్శకులు చాలా మంది ఉన్నారు. చరణ్ ఐదేళ్ల తర్వాత డేట్లు ఇచ్చినా? పర్వాలేదు మేము వెయిట్ చేస్తాం అని కాచుకుని కుర్చున్నారు కొందరు. అందులో ఈ ముగ్గురు దర్శకులు కాస్త ముందున్నట్లు కనిపిస్తోంది. బాలీవుడ్ స్టార్ మేకర్ నికిల్ నగేష్ చరణ్ ఇమేజ్ కి తగ్గ ఓ డిఫరెంట్ స్టోరీ సిద్ధం చేసి పెట్టాడట. అది పౌరాణిక నేపథ్యంలో సాగే కథ అని సమాచారం. చరణ్ కి వినిపించాడా? లేదా? అన్నది క్లారిటీ లేదు గానీ..వింటే మాత్రం నో చెప్పకుండా ఒప్పుకుంటాడు అనే కాన్ఫిడెన్స్ తో నిఖిల్ ఉన్నట్లు బాలీవుడ్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అలాగే తెలుగు నుంచి – హాయ్ నాన్న – ఫేం శౌర్యువ్ సెకెండ్ ప్లేస్ లో ఉన్నాడు. హాయ్ నాన్నతో శౌర్యువ్‌కి దర్శకుడిగా మంచి పేరొచ్చింది. ఆ సినిమా కమర్షియల్‌గా సక్సస్ అవ్వలేదు గానీ విమర్శకుల ప్రశంసలందు కున్నాడు. ఈ నేపథ్యంలో శౌర్యువ్ కూడా చరణ్ కోసం ఓ స్టోరీ సిద్ధం చేసి పెట్టాడట. చరణ్ పాన్ ఇండిమా ఇమేజ్ ని దృష్టిలో పెట్టుకుని సిద్ధం చేసిన స్టోరీ అని సన్నిహితుల నుంచి తెలిసింది. అలాగే మరో వైపు ఓ ప్రముఖ కోలీవుడ్ డైరెక్టర్ కూడా చరణ్ కోసం వెయిటింగ్ లో ఉన్నాడుట. తమిళ్ లో అతడు పేరున్న డైరెక్టర్ అని గతంలో చరణ్ కూడా తనతో సినిమా చేయమని రిక్వెస్ట్ చేసినట్లు ప్రచారం జరిగింది.



## 'జగన్నాథ్' టీజర్ లాంచ్



భరత్ ఫిలిం ఫ్యాక్టరీ బ్యానర్‌పై భరత్, సంతోష్ దర్శకత్వంలో, పీలం పురుషోత్తం నిర్మాణంలో తెరకెక్కుతున్న మూవీ 'జగన్నాథ్'. రాయలసీమ భరత్, ప్రీతి జంటగా నటిస్తున్న ఈ మూవీ టీజర్‌ను, పోస్టర్‌ను ముఖ్య అతిథిగా పాల్గొన్న రాక్‌స్టార్ మంచు మనోజ్ రిలీజ్ చేశారు. అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో ఘనంగా జరిగిన 'జగన్నాథ్' మూవీ టీజర్ లాంచ్ వేడుకలో జబర్దస్త్ కామెడియన్స్ అప్పరావు, వినోదిని, గడ్డం నవీన్ పాల్గొని వినోదం పంచారు.

ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ.. 'జగన్నాథ్' మూవీ టీజర్ చాలా అద్భుతంగా ఉంది. తమ్ముడు 'రాయలసీమ' భరత్ చేసిన ఫస్ట్ మూవీ అయినప్పటికీ ఎంతో ప్రొఫెషనల్‌గా చేశాడు. చిత్రయూనిట్‌లో ప్రతి ఒక్కరి కష్టం కనిపిస్తోంది. భరత్ ఫ్రెండ్స్ అంతా ముందుకు వచ్చి ఈ సినిమా నిర్మాణంలో పాలుపంచుకోవడం చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ రోజుల్లో సినిమా తీయడం అంత ఈజీ కాదు. అలాంటి పరిస్థితుల్లో ఎంతో ఫ్యాషన్‌తో ఈ సినిమా తీశారు. కోటి రూపాయలతో తీసిన సినిమా చిన్నది, వెయ్యి కోట్లతో తీసింది పెద్ద సినిమా అనడానికి లేదు. ఏదైనా సినిమానే. కాకపోతే, బాగుందా? బాగాలేదా? అనేదే ఉంటుంది. ఈ సినిమా 'జగన్నాథ్' మూవీ హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఆల్ ది బెస్ట్ మూవీ టీం." అని అన్నారు.

## కిచ్చా సుదీప్ 'మ్యాక్స్'

మాస్ ఎంటర్‌టైనర్ ఆఫ్ ది ఇయర్ అయిన 'మ్యాక్స్' డిజిటల్ ప్రీమియర్‌ను జీ5 ప్రకటించింది, కన్నడ బాద్ షా రీసెంట్ బ్లాక్ బస్టర్ 'మ్యాక్స్' మూవీ ఫిబ్రవరి 15న రాత్రి 7:30 గంటలకు జీ5లో స్ట్రీమింగ్ కానుంది.

నూతన దర్శకుడు విజయ్ కార్తికేయ డైరెక్షన్‌లో వచ్చిన ఈ హై ఆక్టేన్, హార్ట్ రేసింగ్ రోలర్‌కోస్టర్ మూవీకి థియేటర్లో మంచి రెస్పాన్స్ వచ్చింది. మాస్ అవతార్‌లో కిచ్చా సుదీప్ చాలా కొత్తగా కనిపించారు. కన్నడ బాక్సాఫీస్ వద్ద మ్యాక్స్ రికార్డులు సృష్టించింది. కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళంలోనూ మంచి ఆదరణను దక్కించుకుంది. కిచ్చా సుదీప్‌తో పాటుగా ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్‌కుమార్, సంయుక్త హెూర్నాడ్, సుకృతా వాగ్లే, సునీల్, అనిరుధ్ భట్ వంటి వారి నటించి మెప్పించారు. కలైపులి ఎస్. థాను (వి క్రియేషన్స్), కిచ్చా సుదీప (కిచ్చా క్రియేషన్స్) నిర్మించిన ఈ థ్రిల్లింగ్ చిత్రం ఇప్పటికే 2024లో అత్యధిక వసూళ్లు సాధించిన కన్నడ చిత్రంగా నిలిచింది. ఇక ఈ మ్యాక్స్ జీ5లోకి వచ్చే సమయం ఆసన్నమైంది. పోలీసు ఇన్‌స్పెక్టర్ అర్జున్ మహాక్షయ్ (కిచ్చా సుదీప్)గా మ్యాక్స్‌లో కిచ్చా సుదీప్ అదరగొట్టేశారు. పోలీస్ ఆఫీసర్ పవర్, గ్యాంగ్ స్టర్‌లను పరుగులు పెట్టించే నిజాయితీ గల పోలీస్ ఆఫీసర్ పాత్రలో కిచ్చా సుదీప్ మెప్పించారు. ఒక్క రాత్రిలో జరిగే ఘటనలను ఎంతో గ్రిప్పింగ్‌గా చూపించి ఆడియెన్స్‌ను ఆకట్టుకున్నారు. జీ5లోకి మ్యాక్స్ డిజిటల్ స్ట్రీమింగ్ అవుతున్న సందర్భంగా.. జీ5 ప్రతినిధి మాట్లాడుతూ.. 'అల్టిమేట్ మాస్ బ్లాక్‌బస్టర్ అయిన మ్యాక్స్ చిత్రాన్ని జీ5 ప్రేక్షకులకు అందించడం పట్ల మేం సంతోషంగా ఉన్నాం. కిచ్చా సుదీప్, సినిమా టీం ఇచ్చిన ఈ సహకారం మాకు ఒక అద్భుతమైన మైలురాయిని అందించేలా చేసింది.



## హారర్ థ్రిల్లర్ 'శంబాల' ఫస్ట్ లుక్

విమర్శకుల ప్రశంసలు పొందిన కృష్ణమ్మ చిత్రంలో తన పాత్రతో అందరినీ ఆకట్టుకున్నారు అర్చన అయ్యర్. ప్రస్తుతం అర్చన అయ్యర్ సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ 'శంబాల: ఎ మిస్టికల్ వరల్డ్'లో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం మేకర్లు ఈ చిత్రంలోని ఒక్కో క్యారెక్టర్‌ను రివీల్ చేస్తూ వస్తున్నారు. ఆది సాయికుమార్, స్వాసిక పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్లకు మంచి రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇక తాజాగా అర్చన అయ్యర్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. దేవీ పాత్రలో అర్చన అయ్యర్ ఇంటెన్స్ లుక్‌లో కనిపించారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో అర్చన ఎరుపు చీరలో కనిపిస్తోంది.


ఇంటెన్స్ ఎమోషన్స్‌ను పలికిస్తూ కనిపించింది. బ్యాక్ గ్రౌండ్‌లో పంట, గుడి, పక్షులు, దిష్టిబొమ్మ ఇలా అన్నీ కూడా చాలా క్యూరియాసిటీని పెంచేలా ఉన్నాయి. పోస్టర్లతోనే అందరిలోనూ ఆసక్తిని పెంచేస్తోంది చిత్రయూనిట్. యుగంధర్ ముని దర్శకత్వంలో షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభీమోజు, మహిధర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రామిసింగ్ హీరో ఆది సాయికుమార్ జియో సైంటిస్ట్ పాత్రను పోషిస్తున్నారు.

## ఇది తండ్రి కొడుకుల ప్రేమికుల రోజు- నాని

స్లేట్ పెన్సిల్ స్టోరీస్ పతాకంపై ప్రభాకర్ అరిపాక సమర్పణలో పృధ్వీ పోలవరపు నిర్మాతగా సముద్రఖని ప్రధానపాత్రలో నటించిన ద్విభాషా చిత్రం 'రామం రాఘవం'.

హీరో నాని మాట్లాడుతూ– " రామం రాఘవం" ట్రైలర్‌ను నా చేతులమీదుగా విడుదల చేయటం ఆనందంగా ఉంది. ముఖ్యంగా ధన్‌రాజ్ నాకు కెరీర్ మొదట్నుండి పరిచయం. అప్పుడే అతని టాలెంట్ రేంజ్ ఏంటో నాకు తెలుసు. అందుకే 'రామం రాఘవం' సినిమాని ధన్‌రాజ్ దర్శకత్వం వహించాడంటే నాకు పెద్దగా ఆశ్చర్యం అనిపించలేదు. ధన్‌రాజ్ కామెడి సినిమా తీస్తాడేమో అనుకున్న నన్ను ట్రైలర్ చూపించి ఎమోషనల్ డ్రైవ్‌లోకి తీసుకెళ్లాడు. సముద్రఖని అన్న వర్క్ అంటే వ్యక్తిగతంగా నాకు ఎంతో ఇష్టం. ఆయన నేను ఫ్యామిలీలా ఉంటాము. నిర్మాత పృధ్వీ పోలవరపు మంచి కంటెంట్ ఉన్న సినిమాని నిర్మించటం మంచి విషయం. 'శశి' సినిమాలో " ఒకే ఒక లోకం నువ్వు..... " పాట నాకు ఎంతో ఇష్టం. ఆ సినిమాకి సంగీతాన్నిచ్చిన అరుణ్ చిలివేరు 'రామం రాఘవం' సినిమాకు చక్కని సంగీతాన్ని ఇచ్చారని ట్రైలర్ చూస్తేనే అర్థం అవుతుంది. టీమందరికి ఆల్ ది బెస్ట్ చెప్తూ 21వ తారీకు కోసం ఎదురు చూస్తున్నా " అన్నారు. సముద్రఖని మాట్లాడుతూ–" నా సొంత తమ్ముడులాంటి నాని 'రామం రాఘవం' ట్రైలర్‌లాంచ్ చేయటం సంతోషంగా ఉంది. ధన్ రాజు దర్శకత్వంలో ఫిబ్రవరి 21న వస్తున్న మా సినిమాని థియేటర్‌లో చూసి నన్ను మా టీమ్‌ని ఆశీర్వదించండి" అన్నారు.





## "డార్క్ నైట్" టీజర్ రిలీజ్

పూర్ణ ప్రదాన పాత్రలో పి.19 ట్రాన్సమీడియా స్టూడియోస్ పతాకంపై పటోళ్ళ వెంకట్ రెడ్డి సమర్పణలో సురేష్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఎమోషనల్ థ్రిల్లర్ కథా చిత్రం "డార్క్ నైట్". ఈ చిత్రాన్ని జి.ఆర్.ఆదిత్య దర్శకత్వం వహించారు. పూర్ణ ఆమె సరసన కథ, వీకెండ్ లవ్,పి వి ఎస్ గరుడవేగా,24 కిస్సెస్, కథ కంచికి మనం ఇంటికి, ప్రేమదేశం, మనమే వంటి చిత్రాలలో నటించిన త్రిగుణ్ (ఆదిత్ అరుణ్), నటించగా విధార్థ్, సుభాశ్రీ రాయగురు, మిగతా ముఖ్య పాత్రలలో నటిస్తున్నారు. ప్రస్తుతం సెన్సార్ కి సిధమైంది. కాగా ఈ రోజు ఉదయం దర్శకుడు వి వి వినాయక్ చేతుల మీదుగా చిత్రానికి చెందిన రిలీజ్ ను సోనీ మ్యూజిక్ ద్వార విడుదల చేయడం జరిగింది.

ఈ సందర్భంగా డైనమిక్ డైరెక్టర్ వి వి వినాయక్ మాట్లాడుతూ : " సురేష్ రెడ్డిగారు మా ప్రాంతం నుండి వచ్చి నిర్మాతగా తెలుగు సినీ పరిశ్రమకు డార్క్ నైట్ చిత్రంతో పరిచయం అయ్యారు చాలా సంతోషం. ప్రస్తుతం థ్రిల్లర్ కథ చిత్రాలను ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు ముఖ్యంగా యూత్, పి.19 ట్రాన్సమీడియా స్టూడియోస్ బ్యానర్ లో తొలి చిత్రంగా పూర్ణ, త్రిగుణ్ మెయిన్ లీడ్ గా వస్తున్నడార్క్ నైట్ తప్పక విజయం సాధించాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను. ఈ చిత్రం విజయం తో ఆయన మరిన్ని చిత్రాలు తీసి తెలుగు సినీ పరిశ్రమ లో ప్రముఖ వ్యక్తిగా నిలబడాలని ఆశిస్తున్నాను" అన్నారు.

## నా లవ్ స్టోరీ ఫస్ట్ లుక్ పోస్టర్

మహీర క్రియేషన్స్, సుప్రియ ఆర్ట్స్ బ్యానర్ల పై దొమ్మరాజు అమరావతి, శ్రీకాంత్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న నా లవ్ స్టోరీ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ ను. "ఆర్‌ఎక్స్ 100 చిత్ర దర్శకుడు అజయ్ భూపతి లాంచ్ చేశారు. ఈ నా లవ్ స్టోరీ చిత్రానికి వినయ్ గోను దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా అజయ్ భూపతి మాట్లా డుతూ ఈ చిత్ర దర్శకుడు "వినయ్ గోను, నేను ఆర్జీవీ గారి దగ్గర అసిస్టెంట్స్ గా వర్క్ చేశాం. ఈ వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ సినిమా పోస్టర్‌ను లాంచ్ చేయడం నాకు చాలా హ్యాపీగా ఉంది. ఈ పోస్టర్ చాలా యూనిక్‌గా ఉంది. స్టూడెంట్స్ హాస్టల్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే ఒక కొత్త తరహా ఎమోషనల్ లవ్ స్టోరీగా ఈ చిత్రాన్ని రూపొంది స్తున్నారు.దర్శకుడు వినయ్ గోను ఈ సినిమా ద్వారా పెద్ద సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నాను" అని దర్శక నిర్మాతలకు, చిత్ర యూనిట్ శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ చిత్ర దర్శకుడు వినయ్ గోను మాట్లాడుతూ.."మా పోస్టర్ లాంచ్ చేసిన నా దర్శక మిత్రులు అజయ్ భూపతి గారికి ధన్యవాదాలు" అని చెప్పారు.



Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144